అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 11-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 | సంచిక : 161 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 8.00

మణిపూర్ హింసపై మౌనమెందుకు?

ప్రధాని వైఖరిని తప్పుపట్టిన ప్రతిపక్షాలు



ఇంఫాల్ : హింసాకాండతో మణిపూర్ అట్టుడుకుతున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడాన్ని పది ప్రతిపక్ష పార్టీలు తప్పుపట్టాయి. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరేందుకు త్వరలో ప్రధానిని కలవాలని ఆ పార్టీలు నిర్ణయించాయి. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, జేడీయూ, ఎఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్‌పీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, ఆప్ పార్టీల నేతలు ఇంఫాల్‌లోని కాంగ్రెస్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మణిపూర్ పీసీసీ అధ్యక్షుడు కె.మేఘచంద్ర అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నివారించి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పే దిశగా సమావేశం మూడు తీర్మానాలను ఆమోదించింది. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితిపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సమావేశం డిమాండ్ ...5లో

కేరళలో అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్

ఆసియాలోనే అతి పెద్ద సమావేశం

డిసెంబర్‌లో ప్రారంభం

తిరువనంతపురం : కేరళలోని తిరువనంతపురంలో డిసెంబర్ నుంచి రెండు నెలల పాటు అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నారు. దీనిని ఆసియాలోనే అతి పెద్ద సైన్స్ ఫెస్టివల్‌గా భావిస్తున్నారు. సైన్స్‌ను అందరికీ చేరువ చేయడమే ఈ ఫెస్టివల్ ముఖ్యోద్దేశం. దీనిలో భాగంగా విద్యార్థులు, శాస్త్రవేత్తల కోసం సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ కాంగ్రెస్‌లను నిర్వహిస్తారు. ఎగ్జిబిషన్‌లో మ్యూజియం, నౌకాదళానికి చెందిన హెచ్‌ఎంఎస్ బీగల్ నౌక ప్రతిమ ఉంటాయి. డార్విన్ పరిణామ సిద్ధాంతం స్ఫూర్తితో రూపొందించిన ఫెస్టివల్ లోగోను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆవిష్కరించారు. కేరళ రాష్ట్ర సైన్స్, టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ కౌన్సిల్ (కేఎస్‌సీఎస్టీఈ), శాస్త్ర సాంకేతిక శాఖ, ఎఎంయూఎస్ఈయూఎం సంయుక్తంగా లైఫ్ సైన్స్ పార్కులోని ...5లో



భద్రతా నిధి పక్కదారి

ప్రాధాన్యత లేని పద్దులకు మళ్లించిన రైల్వే శాఖ

- ప్రయాణికుల భద్రత గాలికి
- ఎత్తిచూపిన కాగ్



న్యూఢిల్లీ : రైల్వే ప్రయాణికుల భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2017లో రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ (ఆర్‌ఆర్‌ఎస్‌కే) పేరిట ఏర్పాటుచేసిన ప్రత్యేక నిధి పక్కదారి పట్టింది. ఈ నిధిని రైల్వే శాఖ వేరే అవసరాల కోసం వినియోగించింది. మసాజ్ పరికరాలు, పాత్రలు, ఎలక్ట్రానిక్ సామగ్రి, శీతాకాలంలో ఉపయోగించే జాకెట్లు, ఫర్నీచర్, కంప్యూటర్లు, ఎస్కలేటర్ల కొనుగోలు కోసం ఆ నిధిని వాడుకుంది. అంతేకాదు... ఈ నిధి కింద కేటాయించిన సొమ్ముతో పూల తోటలు అభివృద్ధి చేశారు. మరుగుదొడ్లు నిర్మించారు. సిబ్బందికి జీతాలు, బోనస్‌లు చెల్లించారు. ప్రయాణికుల భద్రతను మాత్రం గాలికి వదిలేశారు. ఇది ప్రతిపక్ష పార్టీల ఆరోపణ కాదు. సాక్షాత్తూ గత సంవత్సరం డిసెంబర్‌లో కాగ్ ఇచ్చిన నివేదికలోని చేదు నిజాలు. నిధులను దారి మళ్లించడంలో రైల్వే శాఖ నిర్వాకాన్ని ఈ నివేదిక బహిర్గతం చేసింది.

2017-18 నుంచి 2020-21 మధ్యకాలంలో ఎంపిక చేసుకున్న నాలుగు నెలలకు సంబంధించి... 2017 డిసెంబర్, 2019 మార్చ్, 2019 సెప్టెంబర్, 2021 జనవరి...11,464 ఓచర్లను కాగ్ పరిశీలించింది. ప్రతి రైల్వే జోన్ నుంచి రెండు డివిజన్లను ఎంచుకొని ఈ పరిశీలన జరిపారు. భద్రతా నిధి కింద రూ.48.21 కోట్ల రూపాయల వ్యయానికి సంబంధించిన లెక్కలు సరిగా లేవని గుర్తించారు. ఈ నిధిని ప్రారంభించే సమయంలో అప్పటి రైల్వే మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత కోసం ఐదు సంవత్సరాల కాలానికి లక్ష కోట్ల రూపాయల కార్పస్ ఫండ్‌ను కేటాయిస్తామని తెలిపారు. కేంద్రప్రభుత్వ పెట్టుబడితో పాటు రైల్వే శాఖ తన సొంత ఆదాయం, ఇతర వనరుల నుంచి మిగిలిన మొత్తాన్ని సమకూరుస్తుంది. ఈ నిధికి ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయలు జమ అవుతాయి. ఇందులో కేంద్రం పదిహేను వేల కోట్లు, రైల్వే శాఖ ఐదు వేల కోట్లు భరిస్తాయి.

అయితే గత ఐదు సంవత్సరాల కాలంలో ఈ నిధికి అందజేసిన మొత్తం చాలా తక్కువగా ఉందని కాగ్ తేల్చింది. ఉదాహరణకు నాలుగేళ్లలో రైల్వే శాఖ ఇరవై వేల కోట్లు అందించాల్సి ఉండగా ఇచ్చింది కేవలం రూ.4,225 కోట్లు మాత్రమే. దీనిని బట్టి చూస్తే ...5లో

మహిళలకు ఫ్రీ బస్ జర్నీ!

కర్నాటక తరహాలో సీఎం కేసీఆర్ కొత్త స్కీమ్

- కాంగ్రెస్ కంటే ముందే ప్రకటించేందుకు వ్యూహం
- సర్వే చేయాలంటూ ఇప్పటికే ఆదేశాలు
- మహిళల లెక్క కోసం టిమ్స్‌లో ప్రత్యేక ఆప్షన్
- వచ్చే ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టే యోచన

కొత్త స్కీంలను వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చేందుకు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ శ్రీకారం చుడుతున్నారు. దానిలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని కర్నాటక కాంగ్రెస్ తరహాలో మేనిఫెస్టోలో పెట్టాలని భావిస్తున్నారు. అలాగే 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ హామీని ఇప్పటికే ఢిల్లీలోని కేజ్రీవాల్ సర్కారు అమలు చేస్తున్నది. దీనిపై సాధ్యాసాధ్యాలనూ అధ్యయనం చేస్తున్నారు. ఇలాంటి హామీలతోనే సెప్టెంబర్ 17న రాష్ట్ర కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసేందుకు సిద్ధమవుతుంది. దానికంటే ముందు తామే ఆ హామీలను ఇచ్చేస్తే, ఓట్ల వర్షం కురుస్తుందని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు ఆర్థిక సాయం.. వికలాంగుల పెన్షన్ పెంపు... తదితర నూతన కార్యక్రమాలు, పథకాలను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్... ఇప్పుడు అదే కోవలో ఓ మరో పథకానికి శ్రీకారం చుట్టబోతున్నారు. కాకపోతే అది మొన్నటి కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు కురిపించిన స్కీమ్ కావటం గమనార్హం. అక్కడ హస్తం పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం...' అంటూ హామీనిచ్చి ఫలితం పొందింది. ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఆదివారం ఆ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించబోతున్నారు. ఈ క్రమంలో అదే అంశాన్ని ఇక్కడ కూడా ప్రయోగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనకు సీఎం కేసీఆర్ వచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్... కర్నాటక ఎన్నికల ప్రణాళికలోని అనేకాంశాలను తీసుకోనుంది. తద్వారా మ్యానిఫెస్టోను తయారు చేసి సెప్టెంబరు 17న విడుదల చేసేందుకు ఆ పార్టీ సంకల్పించిన విషయం విదితమే. అయితే అందులోని పలు



కీలకాంశాలతోపాటు ప్రధానమైన 'మహిళలకు ఉచిత ప్రయాణం' హామీని తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని కేసీఆర్ నిర్ణయించారు. ఆ హామీని కాంగ్రెస్ కంటే ముందుగా తామే ప్రకటించటం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించాలనేది ఆయన వ్యూహమని బీఆర్ఎస్‌కు చెందిన ఓ నేత వ్యాఖ్యానించారు. ఇప్పటికే సీఎం కేసీఆర్... ఆర్టీసీ ఉన్నతాధికారులకు 'రోజువారీగా, క్రమం తప్పక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య'ను లెక్కగట్టాలంటూ ఆదేశాలిచ్చినట్టు సమాచారం. దానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు మహిళా ప్రయాణీకుల సంఖ్యను లెక్కగట్టేందుకు టిక్కెట్ ఇష్యూ మిషన్స్ (టిమ్స్)లో ప్రత్యేక ఆప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఆ ఆప్షన్ ప్రకారం... మహిళా ప్రయాణీకుల సంఖ్యను లెక్కగట్టి చెప్పాలంటూ ఆర్టీసీ యాజమాన్యం తమకు ఆదేశాలిచ్చినట్టు హైదరాబాద్‌లోని ఓ డిపోకు చెందిన కండక్టరు తెలిపారు. రోజువారీగా ఏయే తరగతులకు చెందిన మహిళలు ఎక్కువగా ఏయే జిల్లాల్లో, ఏయే రూట్లలో ప్రయాణిస్తున్నారు..? అనే విషయాలను రిపోర్టులో స్పష్టంగా పేర్కొనాలంటూ సీఎం ఆర్టీసీ అధికారులకు సూచించినట్టు తెలిసింది. రైతు బంధు, రైతు బీమా ద్వారా అన్నదాతలను, ఆసరా పెన్షన్ల ద్వారా వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులను తమ పార్టీ వైపునకు తిప్పుకున్న గులాబీ దళపతి... అదే తరహాలో ఇప్పుడు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే పేద, మధ్య తరగతి, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు, ఉద్యోగాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సును ఆశ్రయించే మహిళా ఓటర్లే లక్ష్యంగా పథకాన్ని రూపొందించబోతున్నారు. మరోవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించటం ద్వారా సంస్థపై ఎంత భారం పడుతుంది..? ఆ భారాన్ని భరించటానికి వీలుగా కర్నాటక సర్కారు ఏం చేయబోతోందనే అంశాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలంటూ ఆయన ఆదేశించారు. తద్వారా ఆ పథకానికి రూపకల్పన చేసి... ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని భావిస్తున్నారు.



గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా

రూ.12.50 కోట్లు విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటి వరకు గీత వృత్తిలో ప్రమాదానికి గురై మరణించిన, వికలాంగులైన కార్మికులకు రూ.12.50 కోట్ల ఎక్స్‌గ్రేషియో నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు ముగిసిన అనంతరం ఆయా కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియోను పంపిణీ చేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. గౌడ వృత్తిదారుల ఆత్మగౌరవ భవనానికి జరిగే భూమి పూజ కార్యక్రమం సందర్భంగా సంబంధిత చెక్కులను పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. మున్ముందు (దశాబ్దిఉత్సవాల అనంతరం) గీత కార్మికులకు రైతు బీమా మాదిరిగా ఎక్స్ గేషియో అందించాలని సీఎం ఆదేశించారని గుర్తుచేశారు. భవిష్యత్‌లో ప్రమాదవశాత్తు తాటి, ఈత చెట్లపై నుంచి పడి మరణించిన, శాశ్వత అంగ వైకల్యం చెందిన గీత కార్మికులకు అందించే ఎక్స్‌గ్రేషియో నేరుగా వారి ...5లో



పరిధులు గీసుకోవద్దు


అన్ని ఫిర్యాదులూ స్వీకరించాలి..మర్యాదగా మాట్లాడాలి

- పాలనా సౌలభ్యం కోసం వార్డు కార్యాలయాలు
- వార్డు స్థాయి అధికారులతో మంత్రి కేటీఆర్ ముఖాముఖి

నవతెలంగాణ-సిటీబ్యూరో

'పరిపాలనా సౌలభ్యం కోసమే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం.. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి.. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి అవసరమైతే సంబంధిత వార్డు కార్యాలయాలకు స్వయంగా అధికారులే పంపించాలేగానీ బాధితులను ఇబ్బందులకుగురి చేయొద్దు..' అని పురపాలక పట్టణాభివృద్ధి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. పరిపాలనా సౌలభ్యంతోపాటు పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యల సత్వర పరిష్కారానికి హైదరాబాద్ మహానగర పాలక సంస్థ వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి తెలిపారు. తెలంగాణ అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ హైటెక్స్‌లో శనివారం నిర్వహించిన జీహెచ్ఎంసీ వార్డు ఆఫీసర్ల శిక్షణా కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వాలు పని చేస్తేనే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభా సుమారు 4 కోట్లుండగా, నగరంలో కోటీ 25 లక్షల మంది ఉన్నారన్నారు. ప్రజల సమస్యలను స్థానికంగానే అధికారులు పరిష్కరించాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వద్దకు రావడమంటే ఆ వ్యవస్థలో లోపమున్నట్టేనని చెప్పారు. కరోనా సమయంలో హైదరాబాద్‌లోనూ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. పురపాలన అనే మాటలోనే ప్రజల భాగస్వామ్యం ఇమిడి ఉందన్నారు. ప్రపంచంలో అద్భుతమైన టోక్యో నగరంలా హైదరాబాద్ మారాలనీ, తెలంగాణ వచ్చినప్పటికీ, ఇప్పటికీ హైదరాబాద్ అన్ని రంగాల్లో ...5లో

నేడు గ్రూప్-1 పరీక్ష



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

రాష్ట్రంలో 503 గ్రూప్-1 సర్వీసు ఉద్యోగాల భర్తీకి ఆదివారం నిర్వహించే రాతపరీక్షకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి 15 నిమిషాల ముందు గేట్లు మూసివేస్తామని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్దన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థులు పరీక్ష ...5లో

ఖమ్మం మార్కెట్లో అగ్నిప్రమాదం

1500కు పైగా పత్తి బస్తాలు దగ్ధం

- ఫైరింజన్ లేక భారీగా నష్టం
- ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. 1500కు పైగా పత్తి బస్తాలు దగ్ధమయ్యాయి. మంటలు ఎలా వచ్చాయనే విషయం మాత్రం బయటకు రాలేదు. మార్కెట్ వ్యాపారి, ఈ ప్రమాదంలో నష్టపోయిన చిత్తూరు శ్రీనివాస్ మాత్రం 2000కి పైన బస్తాలు దగ్ధమైనట్టు చెబుతున్నారు. సుమారు కోటి రూపాయలకు పైన నష్టం జరిగిందని అంటున్నారు. మార్కెటింగ్ శాఖ వర్గాలు మాత్రం రూ.50 లక్షల నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. నెల రోజులపాటు రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని.. ధర మందకొడిగా ఉండటంతో మార్కెట్లో నిల్వ చేశాడు. దీనికి తోడు లారీలు సక్రమంగా రాకపోవడం, వేసవి సెలవులు కూడా కావడంతో పత్తిని ఎగుమతి చేయలేకపోయాడు. ఇటీవల మార్కెట్ తిరిగి ప్రారంభం కావడంతో పరిస్థితుల్ని బట్టి విక్రయించుదామని వ్యాపారి భావించాడు. ఈలోగానే ఈ ప్రమాదం జరగడంతో శ్రీనివాస్ తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది.



మార్కెట్లో ఫైర్ ఇంజన్ లేకపోవడంతోనే ఈ ప్రమాదంలో నష్ట తీవ్రత అధికంగా జరిగిందని పరిశీలకులు అంటున్నారు. గతంలో ఇక్కడ ఉన్న ఫైర్ ఇంజన్‌ను కొద్ది రోజుల కిందట నేలకొండపల్లికి తరలించారు. దీనికి మార్కెట్ సెలవులను సాకుగా చూపుతున్నారు. ఒకవేళ ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉండి ఉంటే ఒకటి రెండు బస్తాలు దగ్ధమయ్యేలోపే మంటలను ...5లో



ప్రభుత్వానికి రెజ్లర్ల అల్టిమేటం

- సమస్యలు పరిష్కరిస్తేనే ఏషియన్ గేమ్స్‌కు...
- రాజీకి రావాలని బెదిరిస్తున్నారు : సాక్షి మాలిక్

న్యూఢిల్లీ : బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన దేశ అగ్రశ్రేణి రెజ్లర్లు శనివారం కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. తమ డిమాండ్లు పరిష్కారమైతేనే ...5లో

సర్వే ప్రాతిపదికనే టికెట్లు

కష్టపడి పనిచేయండి

- ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో రేవంత్



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు రానున్న ఆర్నెల్లు బాగా కష్టపడి పని చేయాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల శక్తిసామర్థ్యాలు, గెలుపు అవకాశాలు తదితర అంశాలతో కూడిన సర్వే ప్రాతిపదికనే టిక్కెట్లు కేటాయిస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో రేవంత్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాలకనుగుణంగా పనిచేసిన వారిని తప్పకుండా గుర్తింపు ఉంటుందని వివరించారు. ఇందుకు కర్నాటకలో మంత్రి పదవి దక్కించుకున్న బోసురాజే ఒక ఉదాహరణ అని చెప్పారు. ఈ సందర్భంగా నాలుగు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. ఎఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీమ్ జావీద్‌లను అభినందిస్తూ... కొత్తగా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శులకు స్వాగతం పలుకుతూ తీర్మానాలు చేసినట్టు తెలిపారు. బోయిన్‌పల్లిలోని రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ సెంటర్ శంకుస్థాపనకు సోనియాగాంధీని ఆహ్వానించాలని సభ మరో తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. మరోవైపు ...5లో



లైంగిక దాడులను అరికట్టాలి : మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్రిపురలో ఇటీవల మహిళలు, బాలికలపైన సామూహిక లైంగిక దాడులు పెరుగుతున్నాయని వీటిని అరికట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం పార్కు చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ ఏప్రిల్ 15 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు 12 మంది బాలికలు, మహిళలపై లైంగిక దాడులు జరిగాయని తెలిపారు. ఈ దారుణాలను అరికట్టటానికి త్రిపుర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న దని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికలపై లైంగిక దాడులు జరుగుతుంటే..ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం అత్యంత దారుణమని విమర్శించారు. బీజేపీకి సంబంధించిన వారే ఈ అకృత్యాలకు ఒడిగడుతున్నారని తెలిపారు. నిజనిర్ధారణ కమిటీ రిపోర్టును ప్రభుత్వానికి, మహిళా కమిషన్‌కు ఇచ్చినప్పటికీ సర్కారులో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను అరెస్టు చేసే వరకు జిల్లాల్లోనూ ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎస్ ఆశాలత, ఎమ్. లక్ష్మమ్మ, సహాయకార్యదర్శులు కె. నాగలక్ష్మి, కె. గీతరాణి, పి. శశికళ, ఎమ్. వినోద, కమిటీ సభ్యులు, ఎ. పద్మ, నర్మద, మస్తానీ, నవీన, అనిత, తదితరులు పాల్గొన్నారు.

నాసా కాన్ఫరెన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల హవా..



హైదరాబాద్: అమెరికా నాసాకు చెందిన ఎన్ఎస్ఎస్ ఐఎస్‌డిసి కాన్ఫరెన్స్‌కు భారత్ నుంచి అత్యధిక మంది శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు హాజరయ్యారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీచైతన్య స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ.. అమెరికాలోని డల్లాస్ నగరంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఐఎస్‌డిసి కాన్ఫరెన్స్‌కు 225 మంది విద్యార్థులు హాజరు కాగా.. వారిలో భారత్ నుంచి 105 మంది రాగా.. 101 మంది శ్రీచైతన్య విద్యార్థులేనని తెలిపారు. నాసా-ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ -2023లో ఇండియా నుండి 25,000 మంది విద్యార్థులు హాజరవ్వగా అందులో 105 మంది ఐఎస్‌డిఎస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. ఏపి, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి తమ విద్యార్థులే ఎక్కువ అవకాశాలను దక్కించుకున్నారన్నారు. గత 12 ఏళ్లుగా తమ సంస్థ విద్యార్థులు ఈ ఘనతను సాధిస్తున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ నిర్వహించిన స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో శ్రీచైతన స్కూల్ 54 ప్రాజెక్టులు గెలుపొందిందన్నారు. ఐఎస్‌డిసి కాన్ఫరెన్స్‌కు హాజరైన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత బిఎస్ రావు ప్రశంసించారు.

మణిపూర్‌లో బీజేపీ మత చిచ్చు

చారిత్రక వైరుధ్యాలను పెంచిన అధికార పార్టీ

- మెయిటీ, కుకీల మధ్య గొడవకు మతం రంగు
- ఇరు వర్గాల మధ్య ఘర్షణలతో అతలాకుతలం







న్యూఢిల్లీ : బీజేపీ స్వార్థపూరిత మత రాజకీయాలకు ఈశాన్య రాష్ట్రం మణిపూర్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 'గిరిజన హోదా'పై రాష్ట్రంలో కుకీలు, మెయిటీ లు అనే రెండు వర్గాల మధ్య చెలరేగిన వివాదం తీవ్ర హింసాత్మక పరిస్థితులకు దారి తీసిన విషయం విదితమే. దాదాపు 30 రోజులకు పైగా రాష్ట్రంలో భయానక పరిస్థితులు నెలొన్నాయి. ఈ హింసలో దాదాపు వంద మంది వరకు మరణించారు. వందలాది మంది గాయాలపాలయ్యారు. 37 వేల మందికి పైగా సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఆదివాసీ హోదాపై చెలరేగిన వివాదం కావటం.. గిరిజనుల్లో అత్యధికులు క్రైస్తవులే కావటంతో 40కి పైగా చర్చిలను ఆందోళనకారులు తగులబెట్టారు.

వివాదం ఏమిటి?

మణిపూర్‌లో కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజన ప్రజలలో కుకీలు ఒకరు. వీరిలో ఎక్కువ మంది క్రైస్తవులే ఉంటారు. ఇక మైదానాలు, లోయ ప్రాంతంలో ఉండే వారు మెయిటీ వర్గం ప్రజలు. వీరు హిందూ మతానికి చెందినవారు. అయితే, ఈ మెయిటీ ప్రజలు తమకు గిరిజన హోదా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆ వర్గం ప్రజలు ఆందోళనలు, నిరసనలు, ర్యాలీలు సైతం చేపట్టారు. మెయిటీల డిమాండ్‌ను కుకీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారికి గిరిజన హోదాను కల్పించొద్దని కుకీలు అంటున్నారు. రాష్ట్ర హైకోర్టు మెయిటీలను ఎస్టీ జాబితాలో చేర్చటాన్ని పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించగా.. హైకోర్టు తీర్పు సరైనది కాదని సుప్రీంకోర్టు తోసిపుచ్చిన విషయం విదితమే.

కుకీలలో బీజేపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత

అయితే, రాష్ట్రంలో బీజేపీ సర్కారు అధికారంలో ఉన్నది. ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ కూడా సాక్షాత్తూ మెయిటీ వర్గానికి చెందినవారు. ముఖ్యమంత్రి మెయిటీ వర్గం కావటం, అందులోనూ మెయిటీలంతా హిందువులు కావటంతో బీజేపీ దీనిని రాజకీయంగా తనకు అనుకూలంగా మలుచుకోవాలనుకుంటున్నదని సామాజిక వేత్తలు, ప్రజాసంఘాల నాయకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. సీఎం మెయిటీ వర్గం వ్యక్తి కావటంతో ఆయనను కుకీ ప్రజలు నమ్మటం లేదు. కొండలు, లోయల మధ్య అసమాన అభివృద్ధి, మౌలిక సదుపాయాలలో అసమానతల కారణంగా గిరిజన ప్రజలలో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఏర్పడింది.

అన్నింటిలోనూ 'కొండ ప్రాంతం'పై వివక్ష

ఈ విషయంలో కొండలు, లోయల మధ్య అసమాన బడ్జెట్ కేటాయింపుల గురించి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆల్ఫ్రెడ్ కనంగమ్ కొన్ని వాస్తవాలను బహిర్గతం చేశారు. 2016 నుంచి 2021 మధ్య బడ్జెట్‌లో రూ.22 వేల కోట్ల ప్రణాళికా నిధులు కేటాయించగా గిరిజనులకు రూ.500 కోట్ల లోపే అందటం గమనార్హం. కొండ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు 20 మంది కాగా.. లోయ నుంచి 40 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. గిరిజన సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో పెద్ద ఎత్తున అవినీతి, దారి మళ్లింపులపై అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇటు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా కుకీలు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని విశ్లేషకులు వెల్లడించారు. అభివృద్ధి లేకపోవటంతో కనీస ప్రాథమిక అవసరాలకు కూడా కుకీలు నోచుకోలేకపోతున్నారు. పేదరికం పెరగటం వలన నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితి కుకీలలో నెలకొన్నదని చెప్పారు.

'లోయలో మతఛాందసవాదానికి బీజేపీ కారణం'

ఈ రెండు వర్గాల మధ్య నెలకొన్న ఈ వివాదం మరింత తీవ్రం కావటం, లోయలో మత ఛాందసవాదం పెరిగిపోవటానికి బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వైఖరే కారణమని సామాజిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆరోపించారు. సహజంగా హిందుత్వ, జాతీయ వాద రాజకీయాలు చేసే బీజేపీ.. మణిపూర్‌లో మెయిటీ, కుకీల మధ్య దానిని ప్రయోగిస్తున్నదని తెలిపారు. ఈ విషయాన్ని హిందూ, క్రైస్త వుల మధ్య గొడవగా బీజేపీ, దాని అనుబంధ సంఘాలు ప్రచా రం చేస్తున్నాయి. కుకీల స్థానికతనూ వారు ప్రశ్నిస్తున్నారు. వారు ఇక్కడి వారు కాదనీ, మయన్మార్ (బర్మా) నుంచి ఇక్కడకు వచ్చి నివసిస్తున్నారని జాతీయ వాదం పేరుతో ఉద్రిక్తతలను నెలకొల్పుతున్నదని అన్నారు.

చర్చిలు, తమ కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నారని మణిపూర్‌లో స్థానిక చర్చి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లోని హింసాకాండపై ఫోరమ్ ఆఫ్ రిలీజియస్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. 2017లో మణిపూర్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మెయిటీ జాతీయవాదం పెరిగిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

మెయిటీలదే ఆధిపత్యం

మణిపూర్‌లో మెయిటీలు పైచేయి సాధించారని సామాజికవేత్తలు, నిపుణులు వెల్లడించారు. అయినప్పటికీ.. వారు తమను గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేయటం సందేహాస్పదంగా ఉన్నదన్నారు. కొండ ప్రాంతాలపై ఆధిపత్యం చలాయించేందుకే ఈ ఎత్తుగడ అంటూ కుకీలు అంటున్నారు. రాజ్యాంగం, ఇతర చట్టాలు గిరిజనులకు కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించాయి. వారి భూములను గిరిజనేతరులు కొనటం, బదిలీ చేయించుకోవటం లాంటివి చట్టవిరుద్ధం. అయితే, మెయిటీ ప్రజలు గిరిజన హోదాను పొందటం వల్ల ఇక్కడి భూములపై ఆధిపత్యం చలాయించా లని చూస్తున్నారని కుకీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మతకలహాలకు బీజేపీ ద్వేషపూరిత రాజకీయాలు కారణమని కుకీలు ఆరోపించారు. పోలీసు స్టేషన్‌లు, పోలీసు శిక్షణా కేంద్రాల్లోకి మెయిటీ మిలీషియాలు ప్రవేశించటం, పోలీసులు చూస్తుండగానే ఆయుధాలు స్వాధీనం చేసుకోవటం, సహాయక శిబిరాల్లో ఉన్న కుకీలపై కాల్పులు జరపటం వంటివి అనేకం చోటు చేసుకున్నాయని చెప్పారు.

మెయిటీలు పదిశాతమే

మణిపూర్‌లో పదిశాతం మంది మాత్రమే మెయిటీలు ఉన్నారు. వీరు లోయ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కుకీలు, నాగాలతో సహా వివిధ గిరిజన తెగలు 90 శాతం వరకు ఉన్నారు. వీరు కొండ లలో నివసిస్తున్నారు. లోయలో విశ్వ విద్యాలయాలు, మెడికల్, ఇంజినీరింగ్, ఆస్పత్రుల వంటి అభి వృద్ధి ఉంటుంది. కానీ కొండ ప్రాంతంలో ఇవేమీ కనిపిం చవు.

కుకీలపై విషప్రచారం

రెండు సార్లు బీజేపీ తరపున బీరెన్ సింగ్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో కుకీలపై మెయి టీలు అనేక అపవాదులు సృష్టించారు. ముఖ్యంగా వీరు మయ న్మార్ నుంచి వచ్చిన అక్రమ వలస దారులనీ, డ్రగ్ దందా చేసేవా రని కుకీలపై ప్రచారం చేశారు. కాగా మణి పూర్‌లో గిరిజనుల న్యాయబద్ధమైన ఆకాంక్షలను నెరవేర్చటానికి మణిపూర్‌లోని కుకీ- జోమి -మిజో-హ్మర్ గిరిజనుల కోసం రాష్ట్రం, యూటీ లేదా టెరి టోరియల్ కౌన్సిల్ వంటి ప్రత్యేక పరిపాలనను ఏర్పాటు చేయాలని మణిపూర్ ట్రైబల్ ఫోరమ్ డిమాండ్ చేస్తున్నది.

కాగా, రాష్ట్రంలో దారుణ హింస చెలరేగినప్పటికీ.. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో నిమగ్నమైందని విశ్లేషకులు ఆరోపించారు. మొత్తానికి బీజేపీ స్వార్థపూ రిత రాజకీయాలు చారి త్రక వైరుధ్యాలను మరింత పెంచాయని తెలిపారు.

నిమ్స్ ప్రతిష్ట పెంచేలా కృషి చేయాలి

- బీరప్పకు మంత్రి హరీశ్‌రావు సూచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్య తెలంగాణ అనే సీఎం కేసీఆర్ ఆశయం మేరకు పని చేసి, నిమ్స్ ప్రతిష్ట మరింత పెంచేలా కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. నిమ్స్ డైరెక్టర్‌గా నూతనంగా నియామకమైన డాక్టర్ బీరప్ప శనివారం హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. నిమ్స్ దేశంలోనే అత్యు త్తమ సేవలందించే ఆస్పత్రిగా అగ్రస్థానంలో నిలవా లని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు డైరెక్టర్ బీరప్పకు శుభాకాంక్షలు తెలిపా రు. తనకు నిమ్స్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం పట్ల సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విభాగాల సిబ్బంది సమన్వ యంతో ప్రజలకు మంచి వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

19న హరితోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఈనెల 19న హరితోత్సవం కార్యక్ర మాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా పర్యావరణ హిత కార్యక్ర మాలు, హరితహారం విజయాలను ప్రదర్శిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్ల పై అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎమ్ డోబ్రియాల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొమ్మిదేండ్లుగా సాధించిన విజయాలపై సమీక్ష నిర్వహించారు. 19న రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఫ్రెంచ్ ట్రోఫీకి మూడో ముద్దు



పోలాండ్ స్టార్ ఇగా స్వైటెక్ ఇరగదీసింది. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌కు ముచ్చటగా మూడో ముద్దు పెట్టింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో కరొలినా ముచోవ (చెక్ రిపబ్లిక్)పై థ్రిల్లింగ్ విజయం సాధించిన ఇగా స్వైటెక్ కెరీర్ నాల్గో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. సుమారు మూడు గంటల పాటు మూడు సెట్లలో తలపడిన స్వైటెక్, ముచోవ అభిమానులకు మరిచిపోలేని అనుభూతిని మిగిల్చారు. కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో చెక్ భామ ముచోవ పోరాడినా నిరాశ తప్పలేదు.

- చాంపియన్ ఇగా స్వైటెక్
- పారిస్‌లో పోలాండ్ స్టార్‌కు మూడో టైటిల్
- ఫైనల్లో ముచోవపై మెరుపు విజయం
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

నవతెలంగాణ-పారిస్

వరల్డ్ నం.1 పోలాండ్ భామ ఇగా స్వైటెక్ మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. పారిస్‌లో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో కరొలినా ముచోవ (చెక్ రిపబ్లిక్)పై ఇగా స్వైటెక్ 6-2, 5-7, 6-4తో మెరుపు విజయం సాధించింది. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను ముచ్చటగా మూడోసారి ఖాతాలో వేసుకుంది. 166 నిమిషాల పాటు మహా ఫైనల్లో పోలాండ్ స్టార్ పైచేయి సాధించింది. 22 ఏండ్ల ఇగా స్వైటెక్ 2020, 2022లో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గగా.. తాజాగా 2023 మహిళల సింగిల్స్ చాంపియన్‌గా మరోసారి నిలిచింది. ఇగా స్వైటెక్ 2022 యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను సైతం గెల్చుకున్న సంగతి తెలిసిందే.



ఉత్కంఠ రేపినా.. స్వైటెక్ జోరు

మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ ఇగా స్వైటెక్ ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. అంచనాలకు తగినట్టుగా తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో పోటీపడుతున్న కరొలినా ముచోవపై స్వైటెక్ ఆధిపత్యం చూపించింది. తొలి సెట్ ఆరంభంలోనే బ్రేక్ పాయింట్ సాధించిన స్వైటెక్ 3-0తో తిరుగులేని పట్టు సాధించింది. స్వైటెక్ దూకుడుతో తొలి సెట్‌లో ముచోవ పుంజుకునే అవకాశమే లేకపోయింది. రెండో సెట్‌లోనూ స్వైటెక్ అదే ప్రదర్శన పునరావృతం చేసింది. కరొలినా ముచోవ సర్వ్‌ను బ్రేక్ చేసి.. తన సర్వ్‌లను వరుసగా నిలుపుకుని 3-0తో ముందంజ వేసింది. కానీ ఈసారి ముచోవ వెనక్కి తగ్గలేదు. స్వైటెక్ సర్వ్ బ్రేక్ చేసి.. తన సర్వ్‌ను రెండుసార్లు నిలుపుకున్న ముచోవ 3-3తో స్కోరు సమం చేసింది. అక్కడితో ఆగని ముచోవ మరో బ్రేక్ పాయింట్‌తో 5-4తో ముందంజ వేసింది. 5-5తో స్కోర్లు సమం కాగా ముచోవ మళ్లీ సత్తా చాటింది. స్వైటెక్ సర్వ్‌ను మరోసారి బ్రేక్ చేసి పోలాండ్ స్టార్‌కు షాకిచ్చింది. 6-5తో సెట్ పాయింట్ ముందు నిలిచిన ముచోవ.. 7-5తో రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. దీంతో తుది పోరు నిర్ణయాత్మక మూడో సెట్‌కు దారితీసింది. ఇక మూడో సెట్లో ముచోవ ముందంజ వేసింది. ఆరంభంలోనే బ్రేక్ పాయింట్ సాధించి 2-0తో ఆధిక్యం సాధించింది. వేగంగా పుంజుకున్న ఇగా స్వైటెక్ వరుస గేములను గెల్చుకుని 2-2తో స్కోరు సమం చేసింది. 3-4తో వెనుకంజలో నిలిచిన వేళ రెండు బ్రేక్ పాయింట్లు సాధించిన స్వైటెక్ లాంఛనం ముగించింది. 6-4తో నిర్ణయాత్మక సెట్‌ను సొంతం చేసుకుని ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది.

టైటిల్ పోరులో కరొలినా ముచోవ ఓడినా ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. ఆరు ఏస్‌లు సంధించిన ముచోవ.. 30 విన్నర్లు సైతం కొట్టింది. స్వైటెక్ ఒక్క ఏస్, 19 విన్నర్లు మాత్రమే సాధించింది. స్వైటెక్ 27 అనవసర తప్పిదాలు చేయగా.. ముచోవ 30 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించింది. స్వైటెక్ ఏడు బ్రేక్ పాయింట్లు గెల్చుకోగా.. ముచోవ ఐదు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా స్వైటెక్96-81తో ముచోవపై పైచేయి సాధించింది.



రికార్డు ముంగిట జకో

- నేడు రూడ్‌తో టైటిల్ పోరు

సెర్బియా యోధుడు, 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్ (35) నేడు అరుదైన రికార్డుల ముంగిట నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో నేడు కాస్పర్ రూడ్ (నార్వే)తో జకోవిచ్ తలపడనున్నాడు. స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్‌తో సమవుజ్జీగా 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సొంతం చేసుకున్న జకోవిచ్.. అత్యధిక గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు సాధించిన మెన్స్ ప్లేయర్‌గా నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను రెండు సార్లు గెల్చుకున్న జకోవిచ్.. ఆదివారం నాటి ఫైనల్లో విజయం సాధిస్తే టెన్నిస్ చరిత్రలోనే నాలుగు గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలను (ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్) కనీసం మూడుసార్లు ముద్దాడిన ఏకైక క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించాడు. నార్వే కుర్రాడు కాస్పర్ రూడ్ కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ వేటలో నిలిచాడు. నిరుడు రొలాండ్ గారోస్‌లో



ఫైనల్స్‌లో పరాజయం పాలైన కాస్పర్ రూడ్.. మరోసారి అక్కడే కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ కోసం సిద్ధమవుతున్నాడు. మూడో సీడ్ నొవాక్ జకోవిచ్ వరుసగా 21 గ్రాండ్‌స్లామ్ విజయాలతో జోరుమీదున్నాడు. టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌తో సెమీఫైనల్లో... జకోవిచ్ టెక్నికల్, ఫిజికల్, స్ట్రాటజికల్ సత్తా ఏంటో మరోసారి నిరూపించాడు.

జకోవిచ్‌పై విజయం సాధించేందుకు కాస్పర్ రూడ్‌కు ఒక్కటే మార్గం ఉంది!. టైటిల్ పోరుకు ఐదు సెట్లకు దారితీస్తే జకోవిచ్‌ను నిలువరించటం కష్టసాధ్యం. తొలి మూడు సెట్లలోనే జకోవిచ్‌కు చెక్ పెట్టగలిగితేనే కాస్పర్ రూడ్ తొలిసారి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ అందుకోగలడు. ఫ్రెంచ్ ఓపెన్ మొనగాడు రఫెల్ నాదల్ లేనివేళ ఇక్కడ మరో టైటిల్ సాధించాలనే జకోవిచ్ సంకల్పాన్ని కాస్పర్ రూడ్ భగ్నం చేయగలడా? ఆసక్తికరం. నొవాక్ జకోవిచ్, కాస్పర్ రూడ్ మెన్స్ సింగిల్స్ ఫైనల్ మ్యాచ్ నేడు సాయంత్రం 6 గంటలకు ఆరంభం కానుంది. సోనీ నెట్‌వర్క్‌లో మ్యాచ్ ప్రసారం అవుతుంది.

ఆటలు

లక్ష్యం 444 పరుగులు. ప్రస్తుతం 164/3. చేతిలో ఏడు వికెట్లు ఉండగా చారిత్రక టెస్టు గద దక్కేందుకు భారత్ ఇంకో 280 పరుగులు చేయాల్సింది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్లో నేడు ఆఖరు రోజు ఆట. ఆస్ట్రేలియా విజయానికి ఏడు వికెట్ల దూరంలో నిలువగా.. విరాట్ కోహ్లి, అజింక్య రహానెలు భారత్ ఆశలను సజీవంగా నిలిపారు.

ఇంకో 280 కొడితే!

లక్ష్యం 444, ప్రస్తుతం 164/3

- క్లిష్ట పరిస్థితుల్లో టీమ్ ఇండియా
- ఆసీస్‌తో ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్

నవతెలంగాణ-కెన్నింగ్టన్

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్ ఎదురీదుతోంది. 444 పరుగుల రికార్డు లక్ష్య ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (43, 60 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (18), చతేశ్వర్ పజార (27) వికెట్లు చేజార్చుకున్న టీమ్ ఇండియా.. మరో 280 పరుగులు చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లి (44 బ్యాటింగ్, 60 బంతుల్లో 7 ఫోర్లు), అజింక్య రహానె (20 బ్యాటింగ్, 59 బంతుల్లో 3 ఫోర్లు) అజేయంగా ఆడుతున్నారు.

రోహిత్ మెరిసినా..

444 పరుగుల రికార్డు ఛేదనలో భారత్‌కు మంచి ఆరంభం లభించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (43), శుభ్‌మన్ గిల్ (18, 19 బంతుల్లో 2 ఫోర్లు) వేగంగా పరుగులు సాధించారు. సాఫీగా సాగుతున్న ఛేదనకు వివాదాస్పద క్యాచ్ అంతరాయం కలిగించింది. స్లిప్స్‌లో గిల్ క్యాచ్‌ను కామెరూన్ అందుకున్న తీరు గందరగోళంగా ఉన్నప్పటికీ టీవీ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. దీంతో భారత్‌కు తొలి ఎదురు దెబ్బ తగిలింది. టీ విరామ సమయానికి భారత్ 41/1తో నిలిచింది.

చివరి సెషన్‌ను రోహిత్ శర్మ, చతేశ్వర్ పుజార (27, 47 బంతుల్లో 5 ఫోర్లు) మెరుగ్గా మొదలెట్టారు. ఓ ఎండ్‌లో రోహిత్ ఎదురు దాడి చేయగా.. పుజార సైతం అదే దారిలో నడిచాడు. ఈ ఇద్దరు క్రీజులో ఉండగా ఆసీస్‌పై ఒత్తిడి కనిపించింది. రోహిత్ అర్ధ సెంచరీకి చేరువైన తరుణంలో స్పిన్నర్ నాథన్ లయాన్‌ను ప్రయోగించిన ఆసీస్.. రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించింది. 77 బంతుల్లోనే 51 పరుగులు జోడించిన పుజార, రోహిత్ ఆకట్టుకున్నారు. కానీ రోహిత్‌ను లయాన్ ఎల్బీగా అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్లోనే కమిన్స్‌కు పుజార వికెట్ల వెనకాల దొరికిపోయాడు. 91/1తో పటిష్టంగా కనిపించిన భారత్ 93/3తో మళ్లీ ఒత్తిడిలో కూరుకుంది. పుజార,రోహిత్ నిష్క్రమణతో జతకట్టిన విరాట్ కోహ్లి, అజింక్య రహానె నాల్గో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నిర్మించారు. అజేయంగా 71 పరుగులు నమోదు చేశారు.



అలెక్స్ మెరుపుల్

ఓవర్‌నైట్ స్కోరు 123/4తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా.. విలువైన పరుగులు జోడించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు లబుషేన్ (41), కామెరూన్ గ్రీన్ (18) ఎంతోసేపు నిలువలేదు. లబుషేన్‌ను ఉమేశ్, గ్రీన్‌ను జడేజా అవుట్ చేశారు. కానీ అలెక్స్ కేరీ (66 నాటౌట్) భారత్ ఛేదించాల్సిన లక్ష్యాన్ని భారీగా పెంచాడు. మిచెల్ స్టార్క్ (41)తో కలిసి ఏడో వికెట్‌కు 107 పరుగులు జోడించిన కేరీ.. ఆసీస్‌కు మంచి స్కోరు అందించాడు. ఆరు ఫోర్లతో 82 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన అలెక్స్ ధనాధన్ ఆటతో మెప్పించాడు. స్టార్క్, కమిన్స్ (5) నిష్క్రమణతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌ను 270 పరుగుల వద్ద డిక్లరేషన్ ప్రకటించింది. భారత్‌కు 444 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్లలో జడేజా (3/58), ఉమేశ్ (2/54), షమి (2/39) రాణించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 469/10

భారత్ తొలి ఇన్నింగ్స్: 296/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : ఖవాజ (సి) భరత్ (బి) ఉమేశ్ 13, వార్నర్ (సి) భరత్ (బి) సిరాజ్ 1, లబుషేన్ (సి) పుజార (బి) ఉమేశ్ 41, స్మిత్ (సి) ఠాకూర్ (బి) జడేజా 34, హెడ్ (సి,బి) జడేజా 18, గ్రీన్ (బి) జడేజా 25, అలెక్స్ నాటౌట్ 66, స్టార్క్ (సి) కోహ్లి (బి) షమి 41, కమిన్స్ (సి) (సబ్) అక్షర్ (బి) షమి 5, ఎక్స్‌ట్రాలు : 26, మొత్తం : (84.3 ఓవర్లలో 8 వికెట్లకు) 270 డిక్లేర్డ్.

వికెట్ల పతనం : 1-2, 2-24, 3-86, 4-111, 5-124, 6-176, 7-260, 8-270.

బౌలింగ్: షమి 16.3-6-39-2, సిరాజ్ 20-2-80-1, ఠాకూర్ 8-1-21-0, ఉమేశ్ 17-1-54-2, జడేజా 23-4-58-3.


భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ (ఎల్బీ) లయాన్ 43, గిల్ (సి) గ్రీన్ (బి) బొలాండ్ 18, పుజార (సి) అలెక్స్ (బి) కమిన్స్ 27, కోహ్లి బ్యాటింగ్ 44, రహానె బ్యాటింగ్ 20 , ఎక్స్‌ట్రాలు : 12, మొత్తం : (40 ఓవర్లలో 3 వికెట్లకు) 164.

వికెట్ల పతనం : 1-41, 2-92, 3-93.

బౌలింగ్: కమిన్స్ 9-0-42-1, బొలాండ్ 11-1-38-1, స్టార్క్ 7-0-45-0, గ్రీన్ 2-0-6-0, లయాన్ 11-1-32-1.

క్యాచౌట్ వివాదం!

గిల్ (18) క్యాచౌట్ నిర్ణయం వివాదాస్పదమైంది. బొలాండ్ ఓవర్లో మూడో స్లిప్స్‌లో కామెరూన్ గ్రీన్ క్యాచ్ అందుకున్నా.. బంతి ఓ వైపు నేలకు తాకుతున్నట్టు రీప్లేలో కనిపించింది. టీవీ అంపైర్ నిర్ణయంతో భారత అభిమానులు 'మోసం.. మోసం' అంటూ నినాదాలు చేశారు.



రక్తం నిల్వల కొరత

ఎండాకాలం కావడంతో ముందుకు రాని దాతలు

- అలాంటి అనుమానాలు అక్కర్లేదంటున్న వైద్య నిపుణులు
- గ్రేటర్ హైదరాబాద్‌లో 50కి పైగా బ్లడ్ బ్యాంకుల్లో సమస్య
- తలసేమియా బాధితులకు తప్పని తిప్పలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రక్తదానం చేయడం గొప్ప దానంగా పరిగణిస్తారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాన్ని కాపాడవచ్చు. అందుకే రక్తదానం చేసే వారిని ప్రాణదాతలుగా పేర్కొంటారు. అయితే, గ్రేటర్ హైదరాబాద్‌లో రక్తం నిల్వలు పడిపోయాయి. రక్తం అవసరమయ్యే వారి సంఖ్య పెరుగుతుండగా.. ఇందుకు అనుగుణంగా రక్త సేకరణ లేకపోవడంతో రక్తం నిల్వలు తగ్గుతున్నాయి. దీంతో తలసేమియా బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్చి నుంచి రక్తదానం చేసే వారి సంఖ్య తగ్గింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 14న జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో రక్తం దానం చేసే వారి సంఖ్య తగ్గడానికి కారణాలపై కథనం..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు 85 వరకు రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 22 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు కాగా.. మిగతావి ప్రయివేటు, రెడ్‌క్రాస్ తదితర స్వచ్ఛంద సంస్థల ఆధీనంలో పని చేస్తున్నాయి. దాదాపు 50కి పైగా బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు లేవని సమాచారం. రక్తం కొరత కారణంగా కొన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర లేదా ఎంపిక చేసిన సర్జరీలే చేస్తున్నారు. ప్రతి ఏడాదీ గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 3.40 లక్షల యూనిట్ల వరకు రక్తం అవసరం ఉంటుంది. ప్రస్తుతం కొరత ఏర్పడటంతో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు పడిపోయాయి. నగరంలో తలసేమియా బాధితులతో కలుపుకుని ఇతర రోగులకు రోజుకు 5-7 వేల యూనిట్ల రక్తం అవసరం ఉండగా.. ప్రస్తుతం సకాలంలో రక్తం అందించలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రతి వేసవిలో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు పడిపోవడం సర్వసాధారమే. కానీ ఈ ఏడాది కొరత తీవ్రంగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో సాధారణ రోజుల్లో 100 యూనిట్ల వరకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం 70-80 యూనిట్లకు మించి ఇచ్చే పరిస్థితి లేదు. ఇక్కడి నుంచి నిత్యం నిలోఫర్, ఉస్మానియా, ప్లేట్లబుర్జు ఆస్పత్రులకు రక్తం సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం రక్తం కొరతతో వీటికి కూడా అత్యవసరమైతే తప్ప బల్క్‌గా సరఫరా చేయడం లేదు.

వేసవిలో శిబిరాలు తక్కువ

వేసవిలో కాలేజీలకు సెలవుల వల్ల రక్తదాన శిబిరాలు తక్కువయ్యాయి. దీనికితోడు ఎండాకాలంలో రక్తదానం చేస్తే అనారోగ్యాల బారిన పడతామనే భావనతో చాలా మంది డోనర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ పరిస్థితులన్నీ బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు తగ్గడానికి కారణం అయి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సంవత్సరంలో మూడు నెలల వ్యవధిలో గరిష్ఠంగా నాలుగు సార్లు రక్తదానం చేయొచ్చని వైద్య నిపుణులు తెలిపారు.


తలసేమియా బాధితులకు ఇబ్బందులు

తలసేమియా వ్యాధి బారినపడిన వారికి 20 రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. సకాలంలో రక్తం అందకపోతే ప్రాణం పోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి వారికి దాతల నుంచి సేకరించిన రక్తం చాలా ఉపయోగపడుతుంది. శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీ ఎదురుగా ఉన్న భవనంలో 'తలసేమియా సెకిల్ సొసైటీ బ్లడ్ బ్యాంకు'ను ఏర్పాటు చేసి తలసేమియా రోగులకు ఉచితంగా రక్తం అందిస్తున్నారు. ప్రస్తుతం 3,085 మంది రోగులు ఈ సొసైటీలో తమ పేర్లను నమోదు చేసుకుని సేవలు పొందుతున్నారు. వీరిలో చిన్నారులే అధికంగా ఉండటం గమనార్హం. జంట నగరాల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ రక్తం ఎక్కించుకుంటారు. ఇక్కడికి వచ్చే రోగులకు రోజూ 50-70 యూనిట్ల రక్తం అవసరం అవుతుందనీ, నెలకు సుమారు 2వేల యూనిట్ల రక్తం అవసరం ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇక్కడికి వచ్చే వారికి తలసేమియా, సికెల్ సెల్, అనీమియా సొసైటీ తరపున 50శాతం, ప్రభుత్వ రక్తనిధి కేంద్రాల నుంచి 50శాతం రక్తం సరఫరా చేస్తుంటారు. ఇటీవల సరఫరా తగ్గడంతో తలసేమియా బాధితులు ఇబ్బందులు పడుతున్నారు.

దాతల నుంచి సేకరణ

స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, విద్యా సంస్థలు, యువజన సంఘాల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుల్లో నిల్వ చేస్తారు. ప్రస్తుతం రక్తం కొరతతో కొంత మందికి అందించలేని పరిస్థితి ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో తమ వద్ద ఉన్న రక్తదాతల జాబితా నుంచి అవసరమైన గ్రూపు వారికి సమాచారం ఇచ్చి రక్తం సేకరించాల్సి వస్తుందంటున్నారు.

రక్తదాతలు ముందుకు రావాలి



రక్తం కొరత ఏర్పడింది. గతంలో పోలీసులు, విద్యా సంస్థల వారు రక్తదాన శిబిరాలు నిర్వహించి సేకరించేవారు. కరోనా తర్వాత కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం ఇవ్వడం, విద్యా సంస్థలకు సమ్మర్ సెలవులు కావడంతో రక్తం దొరకడం లేదు. గత నెలలో పోలీసు డిపార్టుమెంట్ వారు రక్తదానం చేయాలని సీఎం సూచిస్తే చాలా మంది ఫోన్ చేసి రక్తదానం చేస్తామని చెప్పారు. ఇంకా ఎవరైన దాతలు ఉంటే ముందుకొచ్చి రక్తదానం చేయాలి.

- పిచ్చిరెడ్డి, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, విద్యానగర్



దాతలు ముందుకొచ్చి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి. ఎండాకాలంపై అపోహలు వీడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలి. రక్తదానం చేయాలనుకునే వారు శివరాంపల్లిలోని సొసైటీ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తం ఇవ్వొచ్చు. ఇతర వివరాలకు 8885534913, 04029885658 నెంబర్లలో సంప్రదించగలరు.

- అలీమ్ బేగ్, జాయింట్ సెక్రెటరీ, తలసేమియా సికిల్ సొసైటీ, శివరాంపల్లి.

ప్రజల కోసం ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ధరణి : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శరవేగంగా పరుగులు పెడుతున్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఆధునిక సంస్కరణలే పునాదిరాళ్లు అని మంత్రి కేటీఆర్ తెలిపారు. టీఎస్ఐపాస్ విధానంతో పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గధామమైందని కొనియాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి కేటీఆర్ ట్వీట్ చేశారు. "భూమి చుట్టూ అల్లుకున్న సవాలక్ష చిక్కుముళ్లను విప్పేందుకు ప్రజల కోసం ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ధరణి పోర్టల్. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ నుంచి నూతన కలెక్టరేట్ల నిర్మాణం వరకు.. తండాలు, గ్రామ పంచాయతీల నుంచి నూతన రెవెన్యూ డివిజన్లు, మండలాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల వరకూ తెలంగాణలో తీసుకొచ్చిన ప్రతి సంస్కరణ భవిష్యత్ తరాలకు వెలకట్టలేనిది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అధ్యక్షతన శనివారం విద్యార్థి సంఘాల అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలనీ, ఆ దిశగా విద్యార్థి సంఘం నాయకులు పని చేయాలనీ సూచించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఆంధ్రా కార్పొరేట్ కాలేజీలను రాష్ట్రం నుంచి తరిమికొడతామని చెప్పిన సీఎం కేసీఆర్, రాష్ట్రం ఏర్పడ్డాక అదే కాలేజీల్లో ఫీజులు అధికమైనా పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యా వ్యవస్థను ఈ కళాశాలలు భ్రష్టు పట్టిస్తున్నాయన్నారు. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, విద్యా ప్రమాణాలను పాటించకుండా తల్లిదండ్రులను హింసిస్తున్నాయన్నారు. కార్పొరేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజు స్కీంను పునరుద్ధరించాలన్నారు. ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ తదితర కోర్సులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించాలన్నారు. పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ ఎస్టీ, బీసీ కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని కోరారు. రాష్ట్రంలో కాలేజీలు, హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరారు. జూనియర్ అడ్వకేట్‌లకు ఇచ్చే స్టైఫండ్ నెలకు రూ.1000 నుంచి రూ.20వేలకు పెంచాలన్నారు. ఈ సమావేశంలో మాదిగ స్టూడెంట్ నాయకులు శాంతి కుమార్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు వేల్పుల సంజయ్ కుమార్, టీజేఎస్ నాయకులు కొత్తపల్లి తిరుపతి, ఆమ్ ఆద్మీ విద్యార్థి విభాగం నాయకులు పరిరక్షణ్ రాజ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రాంతి, కుమార్ బీసీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అవగాహన లేమితోనే భట్టి నిందారోపణలు

- ప్రభుత్వాస్పత్రుల్లో నడిచే దారి వెంట కేసీఆర్ చేసిన అభివృద్ధిని గమనించాలి : విలేకర్ల సమావేశంలో గుత్తా



నవతెలంగాణ-నల్లగొండ

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శలు ఆయన అవగాహన లేమికి నిదర్శనమని, ఆయనకు మధిర నియోజకవర్గం తప్ప రాష్ట్రంలో ఏ జిల్లాలో ఎన్ని ప్రాజెక్టులు, నదులు, వాగులు, వంకలు ఉన్నాయో తెలియదని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తాను, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి ఏమీ చేయలేదన్న భట్టి విక్రమార్క విమర్శలపై శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకర్ల సమావేశంలో గుత్తా మాట్లాడారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ పాదయాత్రలు చేసి అలసిపోయారని, భట్టికి కూడా అలుపు తప్ప మరేమీ మిగలదన్నారు. జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 600 గ్రామాలకు తాగునీటి వసతితోపాటు హైదరాబాదులో భట్టి నివాసానికి అందుతున్న కృష్ణాజలాలు కూడా తాను మంజూరు చేయించిన ఏఎంఆర్పీ ఎత్తిపోతల పథకం పుణ్యమేనని భట్టి గ్రహించాలన్నారు. ఆయన పాదయాత్ర చేస్తున్న రోడ్లు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసినవేనని, జడ్చర్ల-కల్వకుర్తి, సిరివెంచ-సాగర్ రహదారుల విస్తరణ కూడా తన కృషితోనే జరిగాయన్నారు. కాంగ్రెస్ అసంపూర్తిగా వదిలేసిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి డిండి ప్రాజెక్టు కింద రెండు పంటలకు నీరందిస్తున్నామని, తమ కృషితో వచ్చిన రోడ్ల పైన, సాగు కాబడిన పంటల వెంట భట్టి పాదయాత్ర సాగుతుందన్నారు. నడిచే దారిలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం, తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుంటే చూసీ చూడనట్టుగా భట్టి రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఎం కేసీఆర్ మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.6,190 కోట్లతో డిండి ఎత్తిపోతల చేపట్టి రిజర్వాయర్లు, కాలువల నిర్మాణంకు ఇప్పటికే రూ.2,221 కోట్లతో పనులు జరిపించారన్నారు. కాంగ్రెస్ మాత్రం ప్రాజెక్టులపై ఎన్జీటీలో కేసులు పెట్టి స్టేలు తెచ్చి పనులకు అడ్డం పడిందన్నారు. కాంగ్రెస్ అసంపూర్తిగా వదిలేసిన కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ పనులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందిస్తుందని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పాలనలో నామమాత్రంగా మిగిలిన ఎస్సారెస్పీ రెండో దశ కాలువలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలందిస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు..

- ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- కేపీహెచ్‌బీలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కేపీహెచ్‌బీలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల ఎర్రగడ్డలో వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రెండేండ్ల నుంచి సీఎం, తన వెంట పడుతూ తన నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. నేడు దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పథకాల అమలులో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. నిరుపేద గర్భిణులకు ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు ఏం కావాలో పుట్టుక నుంచి వారి ఎదుగుదల వరకు అన్నీ ఆలోచించిన గొప్ప మహా నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఈ 100 పడకల ఆస్పత్రిలో 35 మంది డాక్టర్లు, 89 మంది సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని, అతి త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు అక్కడి ప్రజలను అడిగితే 10 రోజులకోసారి మంచినీరు వస్తుందని చెప్పారని తెలిపారు. నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, ఇంధన ధరలను చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెంచి పేదవాడిపై భారం మోపింది బీజేపీ సర్కార్ అని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సతీష్ గౌడ్, ముద్దం నరసింహ యాదవ్, జూపల్లి సత్యనారాయణ, మహేశ్వరి శ్రీహరి, సబియా గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, పగడాల బాబురావు, నరేంద్ర చారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఏఐఏసీఈడబ్ల్యూఏ అధ్యక్షునిగా ఆర్.సుజిత్ గాంధీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆల్ ఇండియా ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐఏసీఈడబ్ల్యూఏ) నూతన అధ్యక్షునిగా తెలంగాణకు చెందిన ఆర్.సుజిత్ గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ సంజీవ్ మిశ్రా ఒక ప్రకటన విడుదల చేశారు. అసోసియేషన్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. సుజిత్ గాంధీ ఇప్పటి వరకూ జాతీయ కార్యదర్శిగా కొనసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీలు, అహ్మదాబాద్, చెన్నై మున్సిపల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీల్లో పని చేస్తున్న 21 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

పదేండ్లుగా అటవీ అనుమతులు పెండింగ్

అమలుకాని ప్రధాని సడక్ యోజన

- రోడ్లు వేయకుండా కేంద్రం అడ్డగింత
- చట్టాల పేరుతో ఆలస్యం
- ఎనిమిది జిల్లాల్లో అవస్థలు
- అమీతుమీకి పీఆర్ ఇంజినీరింగ్ శాఖ సన్నద్ధం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

లకేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా ప్రజారవాణాను అడ్డుకుంటున్నది. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో రోడ్లు వేయడానికి ఆటంకాలు సృష్టిస్తున్నది. చట్టాల అమలు పేరుతో ఆయా జిల్లాల్లోని స్థానిక ప్రజలు, గిరిజనులను ముండ్లబాటలో నడిపిస్తున్నది. రవాణా సౌకర్యాన్ని దూరం చేస్తున్నది. మార్గదర్శకాలను పాటించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, వాటి అమలుపేరుతో ఏండ్ల తరబడి అనుమతులు జాప్యం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానమంత్రి సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలుచేయడం లేదు. కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ యాక్ట్, వైల్డ్ లైఫ్ యాక్ట్ పేరుతో కేంద్ర అటవీ శాఖ కొర్రీలపై కొర్రీలు వేస్తూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మించే అవకాశం లేకుండా చేస్తున్నది. పైపెచ్చు ఉమ్మడి రాష్ట్రంలో 'మా అనుమతి లేకుండా మట్టిరోడ్లు, బ్రిడ్జీలు కట్టారంటూ కేసులు పెడతామని బెదిరిస్తున్నది. దీనిపై రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ యంత్రాంగం తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. ఇక అమీతుమీ తేల్చుకోవడానికి సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రత్యేక నివేదిక తయారుచేసే పనిలో నిమగ్నమైంది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించాక కేంద్ర అటవీ శాఖతో సంప్రదింపులు చేయడం ద్వారా సమస్యను వీలైనంత వేగంగా పరిష్కరించేందుకు రంగం సిద్ధంచేస్తున్నట్టు వినికిడి.

44 రోడ్లు..

కేంద్ర ప్రభుత్వం గత పదేండ్లల్లో రాష్ట్రానికి ప్రధానమంత్రి సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) కింద మూడు సార్లు రోడ్లు మంజూరు చేసింది. ఎనిమిది జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ శాఖ సంబంధిత పీఎంజీఎస్‌వై రోడ్లను నిర్మించడానికి ఏండ్ల తరబడి ప్రయత్నాలు చేస్తున్నది. పీఎంజీఎస్‌వై-1, పీఎంజీఎస్‌వై-2, పీఎంజీఎస్‌వై-3 ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఇందులో పీఎంజీఎస్‌వై-2 రోడ్ల నిర్మాణం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తయ్యాయి. మిగతా రెండు ప్రాజెక్టులకు సంబంధించి మాత్రం తీవ్ర ఆలస్యమవుతున్నాయి.

ఉమ్మడి రాష్ట్రం నుంచే ఈ మేరకు కొంత కసరత్తు జరుగుతున్నా, ఇంకా సాగదీస్తూనే ఉండటం గమనార్హం. కేంద్ర అటవీ శాఖ మాత్రం నిబంధనల పేరుతో ఎటూతేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నది. చట్టాన్ని గౌరవించాల్సి ఉన్నా, చర్చించకుండా సాకులు చెబుతూ ఆలస్యం చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఎనిమిది జిల్లాల్లోని 44 రోడ్లు ఏండ్లతరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ యాక్ట్ కిందకు వచ్చేవి 18 రోడ్లు కాగా, వైల్డ్ లైఫ్ యాక్ట్ కిందకు వచ్చేవి మరో 26 ఉన్నాయి. సుమారు 138 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించకుండా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖను నిలువరిస్తున్నది.

రిజర్వ్ ఫారెస్ట్‌ను కాపాడాల్సిందే. అడవుల్లో జంతుజాతి జీవనానికి ఆటంకం కలగకుండా చూడాల్సిందే. పర్యావరణ సమతుల్యతను సంరక్షించాల్సిందే. అయితే చట్టం అమలు చేసే సాకుతో రోడ్లు వేయకుండా ఆలస్యం చేయడాన్ని ఉన్నతాధికారులు తప్పుబడుతున్నారు.

ఎనిమిది జిల్లాల్లో..

రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల్, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రోడ్ల నిర్మాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. మార్గదర్శకాల పేరుతో పీఎంజీఎస్‌వై-1, పీఎంజీఎస్‌వై-3 ప్రాజెక్టులను అమలుకాకుండా ఇబ్బంది పెడుతున్నది. ఈమేరకు పలుమార్లు కేంద్ర అటవీ శాఖకు పీఆర్ ఇంజినీరింగ్ శాఖ లేఖలు రాసినా ప్రయోజనం ఉండటం లేదు. పైగా సంబంధిత శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకే అల్టీమేటమ్ ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. 2012 ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు చేసిన రోడ్ల నిర్మాణాలను కేంద్ర అటవీ శాఖ తప్పుపడుతున్నట్టు సమాచారం. ఆయా జిల్లాల్లోని మారుమూల గిరిజన, ఇతర ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కత్తిమీద సాముగా మారింది. దాదాపు 138 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం కోసం దాదాపు పది సంవత్సరాలుగా ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. అయితే స్థానిక ప్రజలు, గిరిజనులతోపాటు ప్రజాప్రతినిధుల నుంచి త్వరితగతిన రోడ్ల నిర్మాణం చేపట్టాలంటూ ఇంజినీరింగ్ శాఖ ఒత్తిడి చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది సాధారణ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం ఉన్నతాధికారులపై పదే పదే కలుస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు అటు కేంద్రం నుంచి, ఇటు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, ఒత్తిళ్లను తట్టుకోవడం ఒకింత కష్టంగా ఉన్నట్టు సమాచారం. దీనిపై రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ సైతం కేంద్ర అటవీశాఖతో సంప్రదింపులు చేశారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యం లో సమస్య పరిష్కారానికి పీఆర్ ఇంజినీరింగ్ అధికా రులు నడుం బిగించారు. ఈనెల ఐదున కేంద్ర పంచా యతీరాజ్ మంత్రి శైలేంద్రకుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన సడక్ యోజన అమలుపై చర్చించనున్నారు. ఇందులోనే పీఎంజీఎస్‌వై రోడ్ల నిర్మాణానికి పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావంతో పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నట్టు తెలిసింది.

వంద రోజులకు చేరువలో కంటి వెలుగు

- 94 పనిదినాల్లో కోటి 60 లక్షల 89 వేల 744 మందికి కంటి పరీక్షలు: సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆలోచనతో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం వంద రోజులకు చేరువవుతున్నది. 94 పని దినాల్లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి 60 లక్షల 89 వేల 744 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ మేరకు శనివారం సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి 22 లక్షల 44 వేల 267 మందికి ఉచితంగా కండ్లద్దాలు, ఔషధాలు అందజేశారు. 15 లక్షల ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేశారు. పరీక్షలు చేసిన వారిలో 75 లక్షల 62 వేల 259 మంది పురుషులు, 85 లక్షల 6 వేల 175 మంది స్త్రీలు, 11,584 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. కోటి 20 లక్షల 42 వేల 218 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు. మొదటి దఫా కంటి వెలుగు కార్యక్రమంలో కోటి 50 లక్షల మందికి పరీక్షలు చేయగా ఈసారి 94 పని దినాల్లో 10 లక్షలకు పైగా అదనంగా నిర్వహించడం జరిగింది. 12,501 గ్రామపంచాయతీల్లో, 3,666 మున్సిపల్ వార్డులలో కంటి పరీక్షలు పూర్తి కాగా, మొత్తంగా ఇప్పటికే 15 జిల్లాల్లో స్క్రీనింగ్ పూర్తయింది.

నివారింపదగిన అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం : మంత్రి హరీశ్ రావు

నివారింపదగిన అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల్లో పరీక్షలు ఎక్కువగా చేయాలని సూచించారు. అందుకోసం ప్రచారం కల్పించి ప్రజలకు అవగాహన పెంచాలని ఆదేశించారు. కంటి వెలుగు విజయవంతంగా నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి, సహకరిస్తున్న ఇతర శాఖలు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నది అభివృద్ధి చెందిన దేశాలే. 'పర్యావరణ సంక్షోభానికి కారకులూ వాళ్లే. అంటే పెట్టుబడిదారీ విధానమే దీనికి కారణం. ఎందుకంటే మితిమీరిన పారిశ్రామిక సరుకుల ఉత్పత్తి ద్వారా అత్యధిక లాభాలు సంపాదించడమే వారి లక్ష్యం. లాభాలు కోసం వారు ఎంతకైనా తెగిస్తారు. అవసరాల కోసం కాక లాభాల కోసమే ఉత్పత్తి చేస్తారు' అని మార్క్స్ ఏనాడో చెప్పారు. అయితే ప్రజల్లో చైతన్యం రావాలి. కాలుష్య కారక విధానాలను ప్రతిఘటించాలి. ప్రతి ఒక్కరూ పూనుకుంటే కాలుష్యాన్ని నివారించవచ్చు. భద్రమైన భూమిని భావితరానికి అందించవచ్చు.

ఇదేనా మనమిచ్చే బహుమతి!

సంపాదకీయం

పిల్లల గురించి ఆలోచించటమంటే... వారికెంత ఆస్తులు కూడబెట్టి ఇస్తున్నామో అని లెక్కేసుకోవడమేనా! మన తరువాతి తరానికి ఎలాంటి భవిష్యత్తును అందిస్తున్నామో, ఎలాంటి భూమిని కానుకగా ఇస్తున్నామో, ఎంత స్వచ్ఛమైన వాతావరణాన్ని కానుక చేశాము! ఇప్పుడన్నా ఓ క్షణం ఆలోచన చేస్తున్నామా! 'మెండైన బ్రాహ్మణుడు మెట్టభూమి ఒకటే, చండాలుడుండేటి సరిభూమి ఒకటే' అని అన్నమయ్య అన్నట్టు. నేలపైన, ఫుట్‌పాత్‌పైన జీవితం కొనసాగించే పేదకూ, అద్దాల అంతస్తుల్లో పెరిగే వాడికీ ఇదొక్కటే భూమి. ఆవరణమూ ఇదే. మన భావితరానికి దీన్నెలా అందిస్తున్నాము. భద్రంగా ఉందానేలా, నీరూ, గాలీ! ఎంత భయంకరంగా ఈ భూమిని, ఆవరణాన్ని మార్చేసామో వివరాలు తెలుసుకుంటే మనకు మనమే వణికిపోతాము. టీవీల్లో, సెల్లుల్లో సుందరమైన దృశ్యాలను, స్వచ్ఛమైన నీలపురంగులోని నీటి ప్రవాహాలను, రంగు రంగుల పూల అందాలను, హాయిగా గాలి ఊయల ఊపుతున్న చిత్రాలను చూసి మన ఆవరణమంతా ఎంత స్వచ్ఛంగా ఉందోనని భ్రమపడుతున్న మనకు పర్యావరణ అధ్యయన నివేదిక భయం గొల్పుతుంది.

ఇటీవలనే జూన్ 5 పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకున్నాం. ఈసారి ప్లాస్టిక్ కాలుష్యాన్ని గురించి, దాని నిరోధించడం ఎలాగనో చర్చించారు. "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్" అనే నినాదాన్నీ ఇచ్చారు. 150 దేశాలకు పైగా ఈ పిలుపునిచ్చాయి. ఎందుకంటే "ఇందు కలడందు లేడను సందేహంబు' లేకుండా ప్లాస్టిక్ ఎందెందు వెదికినా అందందు కలదని తేల్చి చెప్పారు పరిశోధకులు. సూక్ష్మమైన ప్లాస్టిక్ పదార్థాలు మన ఊపిరితిత్తుల్లోను, కిడ్నీల్లోను, రక్తంలోనూ, తల్లిపాలల్లోనూ ఉన్నట్టు సైంటిస్టులు కనుగొని వెల్లడించారు. అంతేకాదు, మనం తినే తిండిలో, తాగే నీటిలో, ముఖ్యంగా బాటిల్ నీళ్లల్లో, పీల్చే గాలిలోనూ సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థం విస్తరించిందని తేల్చేశారు. నదులు, సముద్రాలు కాలుష్యంతో నిండిపోయాయని, ఇది జీవావరణానికి పెనుముప్పుగా మారనుందని వారు హెచ్చరించారు. గత యాభైయేండ్ల క్రితం ప్లాస్టిక్ వాడకం ఇంతలా లేదు. మా చిన్నతనంలోనయితే ప్లాస్టిక్ వస్తువులను చాలా అరుదుగా వాడేవాళ్లము. ఇప్పుడు ప్లాస్టిక్ విప్లవమే వచ్చింది. ఏ వస్తువు చూసినా ప్లాస్టికే. గుడ్డసంచుల అలవాటే పోయింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 430 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో మూడింట రెండు వంతులు వ్యర్థాలుగా మారుతున్నాయి. ఈ వ్యర్థాలన్నీ సముద్రాలలోకి, మానవ ఆహార గొలుసులోకి ప్రవేశిస్తున్నాయని, 2060 నాటికి ప్లాస్టిక్ వ్యర్థాలు మూడురెట్లు పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రతి సంవత్సరం 80లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయి. మనమిప్పుడు వైజాగ్ సముద్రతీరంలో నిలబడి సముద్ర అలలను చూస్తూవుంటే గవ్వలు, ఆల్చిప్పలు, శంఖాలు తీరానికి వచ్చి ఇసుకతిన్నెల్లో మెరవవు, ఇప్పుడన్నీ ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లు దర్శనమిస్తాయి. సముద్రాల్లో, నదుల్లో ఉండే జీవాలన్నీ కలుషితమైపోతున్నాయి. జీవావరణానికి పెద్ద ముప్పు వీటివల్ల కలుగుతోంది.

ప్లాస్టిక్ కాలుష్యంతో 'ప్లాస్టికోసిస్' అనే వ్యాధి వస్తుందని వైద్యులు తెలుపుతున్నారు. ఈ వ్యాధిని మొదట పక్షుల్లో కనుగొన్నారు. దీనివల్ల జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మితిమీరిన ప్లాస్టిక్ వాడకంతో భూమి, గాలి, నీరు, పర్యావరణం కలుషితమై విషవాయువులు వ్యాపించడంలో ఉష్ణోగ్రత పెరిగి గ్లోబల్ వార్మింగ్ జరిగి ధృవాల వద్ద మంచు పర్వతాలు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. దీంతో కొన్ని దీవులే కనుమరుగువుతున్నాయి. అనేకమైన జీవజాతులు అంతరించాయి. మానవ మనుగడకు పెద్ద ముప్పు పొంచివున్నది. చర్మవ్యాధులు, ఊపిరి తిత్తుల క్యాన్సర్, జీర్ణకోశవ్యాధులు విపరీతంగా ప్రబలే ప్రమాదముంది.

అయితే ప్లాస్టిక్ ఉత్పత్తిని, వాడకాన్ని తగ్గించుకోవాలి. ఇందుకు రీసైక్లింగ్ పెరగాలి. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న దాంట్లో కేవలం 9శాతం మాత్రమే రీసైక్లింగ్ జరుగుతోంది. మిగతాది వ్యర్థంగా మిగులుతోంది. ఒక అరటిపండు తొక్క భూమిలో కలిసిపోవటానికి 27రోజులు పడుతుంది. కానీ ఒక ప్లాస్టిక్ బ్యాగు భూమిలో కలిసిపోవటానికి వందలయేండ్లు పండుతుంది. ఈ ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నది అభివృద్ధి చెందిన దేశాలే. 'పర్యావరణ సంక్షోభానికి కారకులూ వాళ్లే. అంటే పెట్టుబడిదారీ విధానమే దీనికి కారణం. ఎందుకంటే మితిమీరిన పారిశ్రామిక సరుకుల ఉత్పత్తి ద్వారా అత్యధిక లాభాలు సంపాదించడమే వారి లక్ష్యం. లాభాలు కోసం వారు ఎంతకైనా తెగిస్తారు. అవసరాల కోసం కాక లాభాల కోసమే ఉత్పత్తి చేస్తారు' అని మార్క్స్ ఏనాడో చెప్పారు. అయితే ప్రజల్లో చైతన్యం రావాలి. కాలుష్య కారక విధానాలను ప్రతిఘటించాలి. ప్రతి ఒక్కరూ పూనుకుంటే కాలుష్యాన్ని నివారించవచ్చు. భద్రమైన భూమిని భావితరానికి అందించవచ్చు.

తెలుగు రాష్ట్రాలతో సహా దక్షిణాదిన బీజేపీ బలం పరిమితమే గనక ఎన్ని ఎత్తుగడలు పన్నినా అధికారంలోకి రావడం గాని, దేశవ్యాపితంగా బలాబలాల మార్పులో గాని పెద్ద ప్రభావం ఉండదు. హిందీ రాష్ట్రాలు మరీ ముఖ్యంగా యూపీ, గుజరాత్ వంటి చోట్ల బీజేపీని నిలవరించడం కీలక కర్తవ్యమవుతుంది. బీజేపీ, ఆరెస్సెస్ కూటమి తమ బలహీనతను గుర్తించిందని వారి కదలికలు చెబుతున్నాయి. మరి కాంగ్రెస్, ఇతర లౌకిక ప్రాంతీయ పార్టీలు కూడా పైన చెప్పకున్నట్టు అవగాహన పెంచుకుని అడ్డుకునే దిశలో సాగుతాయా అన్నదే భవిష్యత్తును నిర్దేశిస్తుంది.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఈ ప్రత్యేక కోణాన్ని అలావుంచితే దేశవ్యాపితంగా బీజేపీ నూతన వ్యూహాన్ని తీసుకుందని చెప్పే ఉదాహరణలు ఇంకా ఉన్నాయి. మూడో సారి కూడా తన్నుకుంటూ వచ్చేస్తామని పైకి చెబుతున్నా తాము నమ్ముకున్న బ్రాండ్ మోడీ పలచబడిపోయిందనీ, ఓట్లను రాబట్టే శక్తి చాలడం లేదని, సంఘ్ పరివార్ గ్రహించిన కారణంగానే ఈ కొత్త హడావుడి అంటున్నారు. ఆరెస్సెస్ అధికార పత్రికలోనే ఈ విషయం పరోక్షంగా అంగీకరించారు. మోడీ జనాకర్షణ హిందూత్వ భావజాలం మాత్రమే అధికారం తెచ్చిపెడతాయనుకుంటే పొరబాటని ఆ పత్రిక పేర్కొంది.

అడుగు జారుతున్న మోడీ అగచాట్లు


తెలకపల్లి రవి


మే 28వ తేదీన అంగరంగ వైభవంగా ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించారు. అయితే ఆ వెనువెంటనే బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులందరినీ పిలిపించి ఉపన్యాసం ఇచ్చి పంపారు. కాకుంటే లోక్‌సభ ఎన్నికలు రానుండగా జరిగిన ఈ సమావేశంలో ఆయన యుద్ధానికి దూసుకుపోదామని పిలుపిస్తారను కుంటే ఆ ఉపన్యాస పాఠం మారింది. మీ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలతో మంచి సంబంధాలు పాటించేలా జాగ్రత్తపడాలని ఉపదేశించారు. వారు ప్రాంతీయ సమస్యల విషయంలో వారి భావాలకు బీజేపీ కూడా అండగా ఉంటుందనే సంకేతం వెళ్లాలన్నారు. వాస్తవానికి పార్లమెంటు భవన ప్రారంభ సభలో మోడీ స్వయంగా తానే మాజీ ప్రధాని జేడీఎస్ అధినేత దేవగౌడను అత్యంత ఆప్యాయంగా పలకరించారు. అత్యధిక ప్రతిపక్షాలు బహిష్కరించిన ఈ కార్యక్రమానికి దేవగౌడతో పాటు ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టీడీపీ ఎంపీలు కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఇదంతా వూరికే పోలేదని గమనించాలి. కర్నాటకకు తిరిగివెళ్లిన దేవగౌడ బీజేపీ ఏమీ అంటరాని పార్టీ కాదని ప్రకటించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దానితో పొత్తు పెట్టుకోవడం గురించి ఆలోచించవచ్చునన్నారు. ఇక ఏపీకి ఎంతో కాలంగా శూన్యహస్తం చూపిస్తున్న కేంద్రం హఠాత్తుగా రెవెన్యూలోటు కింద రూ.10వేల కోట్లు విడుదల చేసింది. ఇంతకాలం నిరాకరించిన అన్యాయాన్ని ప్రశ్నించేబదులు ఇది వైసీపీ లొంగిపోయిన ఫలితమేనని టీడీపీ విమర్శించింది. మోడీ, అమిత్ షాలను జగన్ పలుసార్లు కలుసుకోవడాన్ని తప్పు పట్టింది. కాని మరో రెండు రోజుల తర్వాత చంద్రబాబు నాయుడు స్వయంగా తానే వెళ్లి కలసి వచ్చారు. ఇది వచ్చే ఎన్నికల్లో పొత్తు కోసమని కథనాలు వస్తే ఇరుపక్షాలూ మౌనం పాటిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45మీటర్లు కాగా 41.5కు తగ్గించి తొలిదశ పేరిట పూర్తిచేస్తామన్నట్టు కేంద్రం ప్రకటిస్తే దానిపై పరస్పరం కీచులాడు కుంటున్నాయి. ఇందుకోసం 17వేల కోట్లు మంజూరు చేస్తానని కేంద్రం తెలియజేసినట్టు రాష్ట్రం ప్రకటించింది. ప్రజలు ఘోషిస్తున్నట్టు పునరావాసానికి సంబంధించిన ప్రకటనేదీ వెలువర్చలేదు. ఇది కేంద్రానికి లొంగుబాటు అని టీడీపీ అంటుంటే తమ ఘనత అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. అంతేగాని ఎత్తు తగ్గింపుతో నిధుల కోత, పునరావాసానికి ఎగనామం గురించి పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో తెలంగాణకు సంబంధించి లిక్కర్ కుంభకోణంలో బీఆర్ఎస్‌తో ఏదో రాజీకి రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. గత వారం రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాల్లో బీజేపీపై విమర్శ బదులు కాంగ్రెస్‌పై దాడి పెరిగిందని పరిశీలకులు అంటున్నారు.

అడుగు వెనక్కు

తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఈ ప్రత్యేక కోణాన్ని అలావుంచితే దేశవ్యాపితంగా బీజేపీ నూతన వ్యూహాన్ని తీసుకుందని చెప్పే ఉదాహరణలు ఇంకా ఉన్నాయి. మూడో సారి కూడా తన్నుకుంటూ వచ్చేస్తామని పైకి చెబుతున్నా తాము నమ్ముకున్న బ్రాండ్ మోడీ పలచబడిపోయిందనీ, ఓట్లను రాబట్టే శక్తి చాలడం లేదని, సంఘ్ పరివార్ గ్రహించిన కారణంగానే ఈ కొత్త హడావుడి అంటున్నారు. ఆరెస్సెస్ అధికార పత్రికలోనే ఈ విషయం పరోక్షంగా అంగీకరించారు. మోడీ జనాకర్షణ హిందూత్వ భావజాలం మాత్రమే అధికారం తెచ్చిపెడతాయనుకుంటే పొరబాటని ఆ పత్రిక పేర్కొంది. ఆయన ఒక్కసారి ప్రచారానికి వస్తే ప్రజలు ఓట్లు గుమ్మరిస్తారనే భ్రమలు కర్నాటక అంతకు ముందు హిమచల్‌ప్రదేశ్ తొలగించాయి. ఫిబ్రవరిలో ఎన్నికల తేదీలు ప్రకటించడానికి ముందునుంచే మోడీ అక్కడ కాలికి బలపం కట్టుకు తిరిగారు. 19 సభలు, ఆరు రోడ్ షోలు నిర్వహించారు. ప్రతిజ్ఞలు చేయించారు. ఇది గాక జెపి నడ్డా 16 రోడ్‌షోలు. స్మృతి ఇరానీ 19, రాజ్‌నాథ్ సింగ్ 4, హిమంత్ బిస్వాస్ శర్మ16 రోడ్‌షోలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ తదితరులు కూడా విస్తారంగా తిరిగారు, అయితే విజయం సంగతి అటుంచి ఆ పార్టీ 31 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. మరి అమిత్ షా అదే పనిగా చెప్పుకున్న సోషల్ మీడియా నెట్‌వర్క్, సోషల్ ఇంజనీరింగ్, పన్నా ప్రముఖ్‌ల ప్రచారం ఏమైంది? అంతకుముందు మీడియా తన వంతు ప్రచారం చేసింది. ఆఖరుకు ఫలితాల తర్వాత కూడా కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి ఎంపికపై సిద్దరామయ్య, శివకుమార్ తగాదా చీలిక వరకూ వెళుతుందన్న వాతావరణం కల్పించింది. ఇవన్నీ ఎన్ని చేసినా వీటన్నిటిని బట్టి బ్రాండ్ మోడీ బలహీనమైందని తేలింది. ఆయన 46 సభల్లో పాల్గొంటే అందులో 15 మాత్రమే గెలవగలిగారు.

పెరిగిన హడావుడి

కళ్లముందు కనిపించే ఈ వాస్తవాలను రాజకీయంగా ఒప్పుకోవడం బీజేపీకి మరీ ముఖ్యంగా మోడీకి తెలియనివని. ప్రచార పటాటో పంకొనసాగించడమే వారి మార్గంగా ఉంటుంది. అందుకే ఆయన నమ్మకస్తుల ముఠా లోపాయికారిగానే చర్చచేసి చెప్పకుండా చేయాలనుకున్నది చేస్తుంది. తొమ్మిదేండ్ల పాలన వార్షికోత్సవాలను ఆర్భాటంగా చేయాలన్న ఆలోచనకు కొత్త ట్విస్టుతో ముందుకు తెచ్చింది. దేశవ్యాపితంగా 500నియోజకవర్గాల్లో సభలు తలపెట్టింది. ఓటర్లను ప్రభావితం చేయగల ఐదు లక్షల ప్రముఖ కుటుంబాలను కలుసుకో వలసిందిగా రాష్ట్రాల విభాగాలకు ఆదేశాలు వెళ్లాయి. నటీనటులను, సెలబ్రిటీలను కలుసుకోవడం ఇందులో భాగమే. దేశంలోని మొత్తం నియోజకవర్గాలను 144 క్లస్టర్లుగా విభజించి ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి ఎనిమిది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తారట. మోడీ హయాంలో హైవేలు ఇతర మౌలిక సదుపాయాలు గొప్పగా పెంచినట్టు చెప్పడానికి వికాస్ తీర్థ జరుపుతారు. గతంలో చాయ్‌పే చర్చ లాగే ఇప్పుడు టిఫిన్‌పే చర్చ ప్రహసనం సాగిస్తారు. దేశంలో 51 జాతీయ స్థాయి ర్యాలీలు జరుపుతారు. ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాలలో మోడీ మరోసారి ప్రచారంపై



కేంద్రీకరిస్తారు. గతంలో ముఖ్యమంత్రులను మార్చడంలో కాంగ్రెస్‌ను గుర్తుచేసిన మోడీ నాయకత్వం ఆ పని విరమించింది. మరోవైపున రాష్ట్రాలలో మరీ దూకుడుగా ఉన్న అధ్యక్షులను మార్చే కార్యక్రమం ప్రారంభమైంది. ఉదాహరణకు తెలంగాణలో ఉత్తరాది తరహా పద్ధతులతో ఉద్రిక్తతలకు కారణమైన బండి సంజయ్‌ని మార్చడం గురించిన చర్చ వాస్తవరూపం దాల్చుతుందంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చినా ప్రయోజనం లేదని వాపోతున్న డికె అరుణ, ఈటెల రాజేందర్ వంటివారికి పదవులు ఇచ్చి సంతృప్తిపర్చే తతంగం తప్పదంటున్నారు. ఏపీలోనూ టీడీపీ నుంచి వచ్చిన నేతల ఒత్తిడి మేరకే చంద్రబాబును కలుసుకున్నట్టు చెబుతున్నారు.

సర్వేల సారం

అదానీ వ్యవహారంతో మొదలు పెట్టి అంతర్జాతీయంగానూ మోడీ ప్రభ మసకబారింది. అంతర్జాతీయ మీడియాలో వ్యతిరేక కథనాలను ఖండించడం ఒక పెద్ద కార్యక్రమంగా మారింది. ఇతర రాష్ట్రాలలో సర్వేలలో కూడా మోడీకి మద్దతు నలభై శాతం మించి ఉండటం లేదు. అదే సమయంలో వ్యతిరేకులు అసంతృప్తితో ఉన్నవారి శాతం అంతకంటే ఎక్కువగా ఉంటున్నది. మహారాష్ట్రలోనూ అదే అంచనా వచ్చింది. మరోవైపున మైనార్టీలలో అభద్రత సామాజిక శక్తుల చలనం ప్రతిపక్షాల ఐక్యత పెరుగుతున్నది. బీజేపీ మతతత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఓట్లు చీలకుండా చూడాలనే బావన బలపడుతున్నది. బీహార్ రాజధాని పాట్నాలో జరిగే శిఖరాగ్ర సమావేశం దీనిపై స్పష్టమైన సంకేతాలివ్వచ్చు. 450 స్థానాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థి నిలిచేలా చూడాలన్న నినాదం ఇందులో భాగమే. సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నా ఇది దేశంలో రాజకీయ వాతావరణాన్ని సూచిస్తున్నది. బీజేపీకి అనుకూలంగా ఉండే ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా పార్లమెంటు ప్రారంభంలో స్వయంగా పాల్గొనకపోవడం యాదృచ్ఛికం కాదు. అదే సమయంలో వైసీపీ, టీడీపీ, జనసేన మూడు ప్రాంతీయ పార్టీలు తనకు అనుకూలంగానే ఉన్నాయి గనక ఏం చేయాలనే వ్యూహమథనం సాగిస్తున్నట్టు కనిపిస్తుంది. అందరినీ అందుబాటులో ఉంచుకోవాలనేదే అంతిమంగా తమ రాజకీయ అవసరమనేది బీజేపీ దాచుకోవడం లేదు. ఎటొచ్చి ఈ పార్టీలే తమ వైరుధ్యాలను తీర్చుకోవడానికి దానికి సాగిలబడుతుండటం రాష్ట్రానికి హానికలిగిస్తున్నది. ఇప్పట్లో ఇది ఎలా ముగిసేది ఇంకా స్పష్టం గాకున్నా వారి వైఖరిలో మాత్రం మార్పు వచ్చే సూచనలు లేవు. తెలంగాణలోనూ రాజకీయ దృశ్యం ఎలాంటి మార్పులకు లోనవుతుందనేది జాగ్రత్తగా గమనించాల్సిన విషయం. అయితే తెలుగు రాష్ట్రాలతో సహా దక్షిణాదిన బీజేపీ బలం పరిమితమే గనక ఎన్ని ఎత్తుగడలు పన్నినా అధికారంలోకి రావడం గాని, దేశవ్యాపితంగా బలాబలాల మార్పులో గాని పెద్ద ప్రబావం ఉండదు. హిందీ రాష్ట్రాలు మరీ ముఖ్యంగా యూపీ, గుజరాత్ వంటి చోట్ల బీజేపీని నిలవరించడం కీలక కర్తవ్యమవుతుంది. బీజేపీ, ఆరెస్సెస్ కూటమి తమ బలహీనతను గుర్తించిందని వారి కదలికలు చెబుతున్నాయి. మరి కాంగ్రెస్, ఇతర లౌకిక ప్రాంతీయ పార్టీలు కూడా పైన చెప్పకున్నట్టు అవగాహన పెంచుకుని అడ్డుకునే దిశలో సాగుతాయా అన్నదే భవిష్యత్తును నిర్దేశిస్తుంది. అదే సమయంలో అడుగు జారుతున్న సంఘ్ పరివార్ ముందుకుతెచ్చే విభజన రాజకీయాలను విద్వేష ప్రయత్నాలను కూడా విఫలం చేయవలసి ఉంటుంది. ■

సెంగోల'

నజర్

సాయంత్రం ఆరున్నర కావస్తోంది! కాని భర్త ఇంకా రాలేదు. వాణి గేటు వద్ద నిల్చుని ఎదురు చూస్తోంది. భర్త రాలేదు. కాని ఆడుకోవటానికి బయటకి వెళ్లిన నానిగాడు వచ్చేశాడు.

"ఏంటి మమ్మీ నాన్న ఇంకా రాలేదా?" అడిగాడు నాని. "అవునా! రోజూ ఈపాటికే వచ్చేవారు! ఈ రోజు బాగా లేటయ్యింది! నీవుమొహం కడుక్కో! తినటానికి ఏదైనా పెడతాను" అంటూ కొడుకును పంపి తానూ ఇంట్లోకి వెళ్ళింది. వాని లోపలికి వెళ్ళగానే గేటు వద్ద చప్పుడైంది. వాణి, నానీ ఇద్దరూ బయటకి వచ్చారు.

ఆటోలో నుండి ఏదో తీస్తున్నాడు డ్రైవర్! "మెల్లిగా తీయి! అది ఎంతో విలువైంది! జాగ్రత్త" అంటున్నాడు సురేష్. పొడుగ్గా ఉన్న సన్నటి డబ్బాను జాగ్రత్తగా బయటకు తీసి సురేష్ చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు డ్రైవర్.

ఆ డబ్బాను కళ్ళకద్దుకుంటూ తీసుకెళ్ళి దేవుడి గదిలో పెట్టాడు సురేష్. వాణి, నానీ ఆశ్చర్యంగా అనుసరించారు.

"ఏంటది?" ఒకేసారి అడిగారు తల్లీ కొడుకులు.

"అది బింగోల్!" గొప్పగా చెప్పాడు సురేష్.

"బింగోలా?" అంటేఏమిటీ? "మళ్ళీ అడిగారు తల్లీ కొడుకులు.

"మొన్న పార్లమెంటులో మా పెద్దాయన, స్వాములు వెంటరాగా తీసుకెళ్ళి ప్రతిష్టించి దేశ గౌరవాన్ని ప్రపంచంలో ఎంతో ఎత్తుకు తీసుకెళ్ళాడు. అదేంటో తెలుసా?" ఛాతి గర్వంతో ఉప్పొంగు తుండగా ప్రశ్నించాడు సురేష్. వాణీ ఆశ్చర్యంగా చూస్తోంది!

"నాకు తెలుసు! అది సెంగోల్!" అన్నాడు నాని గట్టిగా. "చూశావా నా కొడుకు తెలివితేటలు! వాడికి అన్నీ నా తెలివి తేటలే అబ్బాయి" మరింత గర్వంగా అన్నాడు సురేష్. సురేష్ గర్వపడుతున్న కొద్దీ ఛాతి ఉప్పొంగుతూనే ఉంది. దాంతో షర్ట్ గుండీ ఒకటి తెగిపోయింది.

"నాన్న ఛాతి 56 ఇంచుల దాకా పెరిగినట్లుంది" అన్నాడు నానిగాడు ఆశ్చర్యంగా.

"నోర్ముయ్! 56 ఇంచుల ఛాతి మా పెద్దాయనకు తప్ప ప్రపంచంలో మరెవ్వరికీ ఉండటానికి వీల్లేదు. ఆయన భక్తుడిని కాబట్టి నాకు ఓ నాలుగించులు తక్కువే ఉంటుంది" అన్నాడు సురేష్.

చాలించండి మీ వెధవ ఛాతి గోల. 56 ఇంచుల ఛాతి పెట్టుకుని మీ పెద్దాయన అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా వాడు రోడ్లేస్తుంటే ఆపలేకపోతున్నాడు. 52 ఇంచుల ఛాతి పెట్టుకుని మీరేమో రాత్రిపూట కరెంటు లేకపోతే గేటుకూడా దాటరు అంది వాని విసురుగా.

సురేష్ ఏదో చెప్పబోయాడు.

"అది సరేగాని, ఇంట్లో తెచ్చిన డబ్బా సంగతి ఏమిటి? ఆ డబ్బాలో ఏముంది." ప్రశ్నించింది వాణి.

"ఇందాక చెప్పాను కదా! పార్లమెంటులో "సెంగోల్" అని ఒక రాజదండాన్ని పెద్దాయన ప్రతిష్టించాడు కదా! ఆ సెంగోల్ తయారు చేసిన తమిళనాడు మఠం దగ్గర నుండే దీన్ని తెప్పించాను. దీనిపేరు "చింగోల్" అంటె చిన్న సింగోల్ అన్న మాట!" అన్నాడు సురేష్ మళ్ళీ గర్వపడుతూ. ఈ సారి షర్టు యొక్క రెండో గుండీ కూడా ఫట్ మని తెగిపోయింది.

"చిన్న సెంగోల్‌ను, చింగోల్ అంటారా. మరి ఇక్కడ చిన్న పార్లమెంటు లేదు కదా? ఇక్కడికెందుకు తెచ్చారు? అనుమానంగా అడిగింది వాణి.

"మన ఇంట్లో ప్రతిష్టించటానికి రేపు దివ్యమైన ముహూర్తం ఉంది! అందువల్ల రేపే మన ఇంట్లో చింగోల్‌ను ప్రతిష్టించాలి. తమిళనాడు నుండి ఒక అయ్యగారు కూడా వస్తారు. శాస్త్రోక్తంగా పూజలు, పునస్కారాలు జరిపి, ఈ బింగోల్‌ను మన ఇంట్లో ప్రతిష్ఠించిన తర్వాత నేను ఆ గౌరవనీయ చింగోల్‌కు సష్టాంగ నమస్కారాలు చేస్తాను. దాంతో అధికార మార్పిడి పూర్తి అవుతుంది!" అన్నాడు సురేష్ ఎంతో ఉత్సాహంగా.

"రేపు ముహూర్తాలు ఏవీ లేనట్టు గుర్తు. కానీ మీరేమో మంచి ముహూర్తం అంటున్నారు! ఎలాగబ్బా!" అంటూ ఆలోచనలో పడింది వాణీ.

"నాకు తెలుసు మమ్మీ! రేపు వచ్చే తేదీనే వీరసావర్కర్ తనకు క్షమాభిక్ష పెట్టి



అండమాన్ జైలు నుండి విడుదల చేస్తే, తాను స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన బోనని, బ్రిటిష్ వాడికి పత్రం రాసిన రోజు. అందుకే నాన్న దాన్ని గొప్ప ముహూర్తం అన్నాడేమో?" అన్నాడు నానిగాడు.

వాణి కిలకిలా నవ్వింది. "చూశారా మీ అబ్బాయి! అన్నీ మీ తెలివితేటలే!" అన్నది.

సురేష్‌కి షర్టు ఒక్కసారిగా వదులుగా అయిపోయింది! మళ్ళీ కొత్తగా అధికార మార్పిడి అంటున్నారేమిటీ! కొంపతీసి మీ పేరున ఉన్న ఈ ఇల్లు నా పేరిట రాస్తారా ఏమిటి?" అన్నది వాణి నవ్వుతూ.

"ఆడవాళ్ళు అధికారానికి, అధికార కార్యక్రమాలకు అనర్హులు. అందుకే పార్లమెంటు ప్రారంభోత్సవానికి ముర్మును పిలవలేదు. అలాంటిది ఈ ఇంటిని నీ పేరిట ఎట్లా రాస్తాననుకున్నావు? ఈ ఇల్లు కొన్న తర్వాత శాస్త్రోక్తంగా అధికార మార్పిడి జరగలేదు కదా! అందుకే ఈ ఏర్పాటు!" అన్నాడు సురేష్.

"ఇల్లు కొని పదేళ్ళు అవుతుంది! చక్కగా సంసారం చేసుకుంటున్నాము. మన అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా నానిగాడు కూడా ఉన్నాడు కదా! ఇప్పుడీ చింగోల్ గొడవ ఏమిటండీ? కొంపతీసి ఇల్లు ఎవరికైనా డబుల్ రిజిస్ట్రేషన్ అయ్యిందా ఏమిటి?" అన్నది ఆందోళనగా వాణి.

"లేదు! రిజిస్ట్రేషన్ సమస్యలేవీ లేవు! పెద్దాయన చేశాడు కదా! నేనూ నా స్థాయిలో చేయాలని నిర్ణయించు కున్నాను" అన్నాడు సురేష్.

"బాగుంది మీ వరస! పెద్దాయనకు అధికారం ఉంది. ఏదైనా చేస్తాడు. ఆయన 6లక్షల రూపాయల రేబాన్ కళ్ళద్దాలు పెట్టుకుంటాడు. మీరు వెయ్యి రూపాయల కళ్ళద్దాలు కూడా పెట్టుకునేందుకు మీ జీతం సహకరించదు! పెద్దాయనతో మీరు పోల్చుకోకండి" అనునయంగా చెప్పింది వాణి.

"లేదు! బింగోల్ ప్రతిష్టించాల్సిందే!" పట్టుపట్టాడు సురేష్.

"పెద్దాయన్ను అనుసరించాలనే తాపత్రయంలో మీరు సింగోల్ యొక్క ప్రభావాన్ని అర్థం చేసుకోవటం లేదు!" అన్నది వాణి.

ఏమిటన్నట్టు చూశాడు సురేష్.

"సెంగోల్ ప్రతిష్ఠించినప్పటి నుండి దేశంలో పరిస్థితులు అల్లకల్లోలంగా తయారయ్యాయి! మహిళా రైజర్లు చేస్తున్న పోరాటానికి అంతర్జాతీయ రైజర్ల సంఘం మద్దతు ప్రకటించింది. అంటే అంతర్జాతీయంగా మన దేశ పరువు పోయింది. మరో విషయం ఏమిటంటే, పెద్దాయన నల్లధనాన్ని అరికట్టడానికి ప్రవేశపెట్టిన రెండువేల రూపాయల నోటును ఆర్‌బిఐ వారు రద్దు చేశారు. అటు నల్లధనం బయటకు రాలేదు! రెండు వేల నోటులోని చిప్ పనిచేయనందునే నల్లధనం బయటకురాలేదని, మన వేదాల్లోని టెక్నాలజీలో ఏదో లోపం ఉందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయట. పెద్దాయన తెచ్చిన రెండువేల నోటుని ఆఫ్టరాల్ ఆర్‌బిఐ తీసేయటమంటే పెద్దాయన పరువే పోయినట్లుందని, అమెరికా కూడా అనుకుంటున్నదంట! అన్నింటికి మించి సింగోల్ వచ్చిన తర్వాతనే ఒడిసా ఘోర రైలు ప్రమాదం జరిగిందని, సెంగోల్ మన దేశానికి అచ్చిరాదని అనుకుంటున్నారంట! అందుకే మన ఇంట్లో బింగోల్ వద్దండీ... అంటూ ప్రాధేయపడింది వాణి.

"సెంగోల్ ప్రతిష్ఠించినప్పటి నుండి దేశంలో పరిస్థితులు అల్లకల్లోలంగా తయారయ్యాయి! మహిళా రైజర్లు చేస్తున్న పోరాటానికి అంతర్జాతీయ రైజర్ల సంఘం మద్దతు ప్రకటించింది. అంటే అంతర్జాతీయంగా మన దేశ పరువు పోయింది. మరో విషయం ఏమిటంటే, పెద్దాయన నల్లధనాన్ని అరికట్టడానికి ప్రవేశపెట్టిన రెండువేల రూపాయల నోటును ఆర్‌బిఐ వారు రద్దు చేశారు. అటు నల్లధనం బయటకు రాలేదు! రెండు వేల నోటులోని చిప్ పనిచేయనందునే నల్లధనం బయటకురాలేదని, మన వేదాల్లోని టెక్నాలజీలో ఏదో లోపం ఉందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయట.

- ఉషాకిరణ్

వీరికీ.. వారికీ.. అందరికీ గుబులే...

జూన్ వచ్చేసింది. రెండో వారం కూడా దాటిపోతోంది. ఈ క్రమంలో 'కేరళను తాకిన రుతు పవనాలు.. మరో రెండు రోజుల్లో విస్తారంగా వర్షాలు...' అంటూ పేపర్లలో ఒకటే వార్తలు. టీవీలు, యూ ట్యూబుల్లో వీడియోల మీద వీడియోలు. మొన్నటిదాకా 46, 47 డిగ్రీల ఎండతో ఇస్సో.. అస్సో అనుకుంటూ వేడిమి, ఉక్కపోతతో సతమతమైపోయిన మనందరికీ 'రుతు పవనాల రాక' వార్త ఉపశమనం, అంతకు మించిన సంతోషం కలిగించేదే. హమ్మయ్య... ఈ ఏడాది ఎండల నుంచి బయటపడ్డాం, బతికి బట్టకట్టాం అనుకునే పెద్దవారు,వృద్ధులు సైతం లేకపోలేదు. వారందరూ ఇలా సంతోషపడుతున్న తరుణంలో... ఇద్దరు మాత్రం తెగ గుబులు, అంతకుమించిన ఆందోళన చెందుతున్నారు. వారెవరంటూరా..? ఒకటి బడికి పోవాల్సిన బుడతలు.. రెండోది వారిని బడికి పంపాల్సిన తల్లిదండ్రులు. 'మే నెల ఆసాంతం అమ్మమ్మ, నాయనమ్మ, తాతల ఇండ్ల దగ్గర, ప్రశాంతమైన పల్లెటూళ్లలో హాయిగా ఆటపాటలతో గడిపిన మాకు మళ్లీ ఈ బడి గోలేంట్రా బాబూ...' అనుకూంటూ పోరలు బాధపడుతున్నారు. మళ్లీ టైలు, షూలు, పుస్తకాలు, బ్యాగులు అంటూ, రోజూ వాటిని మోసుకుంటూ పోయి పంజరంలో చిలకల్లా ఉండాల్సొస్తున్నందుకు భావి భారత పౌరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి పరిస్థితి ఈ విధంగా ఉంటే... జూన్ వచ్చేసిందంటే పుస్తకాలు, బ్యాగుల కొనుగోలు, స్కూల్, ట్యూషన్ ఫీజుల మోత మోగిపోతోందంటూ తల్లిదండ్రులు గుబులు చెందుతున్నారు. వేల రూపాయలు, లక్షలకు లక్షలు ఫీజులు చెల్లించాల్సి రావటంతో... ఏం చేయాలో పాలు పోక వారు దిక్కులు చూస్తున్నారు.ఈ రకంగా జూన్ నెల ఇటు బుడతలకు, అటు తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తోంది. ఎంతలా అంటే మే నెలలో ఉండే మండు వేసవి కంటే ఎక్కువగా...

-బి.వి.యన్.పద్మరాజు

ఇండ్లిచ్చేందుకు అడ్డెవ్వడు...?

'వాడెవ్వడు.. వీడెవ్వడు.. తెలంగాణకు అడ్డెవ్వడు...' తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ నినాదం ఎల్లడెలా మార్మోగింది. అప్పట్లో అందరికంటే ఎక్కువగా టీఆర్ఎస్ నేతలు, ప్రస్తుత అధికార బీఆర్ఎస్ నేతలు... ఈ నినాదాన్ని బాగా వాడుకున్నారు. ఆ మేరకు ఫలితం కూడా పొందారు. ఆ క్రమంలో వారితోపాటు అందరి నినాదాలు, ఆందోళనలు, ఉద్యమాలు, రాస్తారోకోలు, ధర్నాల వార్తలను కవర్ చేసి, వాటిని ప్రపంచానికి చాటి చెప్పటంలో జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు ఎంతో క్రియాశీలక పాత్రను పోషించారు. ఆ క్రమంలో పోలీసుల లాఠీ ఛార్జీలు, ఉద్రిక్తల్లో ఎంతో మంది విలేకర్లు, ఫొటోగ్రాఫర్ల కాళ్లు, చేతులూ విరిగాయి.. తలలు పగిలాయి. అయినా వృత్తి ధర్మాన్ని విడనాడకుండా వారు తమ పాత్రను సమర్థవంతంగా పోషించారు. ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. తొమ్మిదేండ్లు కూడా పూర్తయింది. కానీ విచిత్రమేమంటే... ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఎక్కడా 'జర్నలిస్టుల కోసం' ఒక రోజంటూ లేకపాయే. కనీసం ప్రస్తావన కూడా లేకపాయే. గీ ముచ్చట గిట్లుంటే... అన్ని కుల సంఘాలకూ ఆత్మగౌరవ భవనాలు కట్టిస్తున్న బీఆర్ఎస్ సర్కార్... జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల గురించి నోరు మెదకపోవటం నిజంగా విచిత్రమే. దాదాపు 20 ఏండ్ల కిందటే హౌజింగ్ సొసైటీల్లో డబ్బులు కట్టి... ఇప్పటిదాకా కండ్లు కాయలు కాసేలాగా ఎదురు చూస్తున్న సీనియర్ పాత్రికేయులు సర్కారు వైఖరితో తీవ్ర నిరాశలో కూరుకుపోయిన పరిస్థితి. వారిలో కొందరు ఆవేదనతో...'సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత ఇండ్లు ఇవ్వట్లే. ఇప్పుడు ఇండ్లివ్వటానికి నిజంగా సర్కారు అడ్డెవ్వడు..ఎందుకివ్వట్లేదు...?' అంటూ బాధపడుతున్నారు.

-కేఎన్ హరి

ఫన్ అండ్ ఫ్రస్టేషన్

హీరో వెంకటేష్, వరుణ్‌తేజ్ నటించిన ఎఫ్2, ఎఫ్3 చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. నవ్వించాయి. తాజాగా బీజేపీలో కూడా ఎఫ్2 మొదలైంది. పార్టీలో భారీ మార్పులు జరుగుతాయన్న వార్తలు వస్తున్నాయి. మీడియాలో కథనాలు వస్తున్నాయి. డీకే అరుణ బీజేపీ అధ్యక్షులు అవుతారట కదా? అంటూ ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావును మీడియా ప్రతినిధులు అడిగారు. ఆయన ఒక్కసారిగా ఫ్రస్టేషన్‌కు గురయ్యారు. 'మీరే రాస్తారు. మీరే ప్రసారం చేస్తారు. మీరు మమ్ముల్ని అడుగుతారు' అంటూ విలేకర్లపై అసహనాన్ని ప్రదర్శించారు. ఆయన ఫ్రస్టేషన్స్‌ను గమనించిన మరో విలేకరి కలుగజేసుకుని 'సార్ మీరు చెప్పకుండా మాకెలా తెలుస్తుంది. మీ నాయకులు లీకులు ఇస్తేనే కదా మాకు తెలిసేది. విలేకరికి తెలిసిన విషయాన్ని వార్త రాయకుండా ఎలా ఉంటారని' కాస్త గట్టిగా అనడంలో ఆయన వెనక్కి తగ్గారు. అదీ కాదండీ పార్టీని బదనాం చేసేందుకు లేనిది ఉన్నట్టు రాస్తున్నారని మరో పల్లవి అందుకున్నారు. మొత్తంగా బీజేపీలో జరుగుతున్న అంతర్గత పోరు మాత్రం ఆ పార్టీని కొంత ఇబ్బందికి గురి చేస్తున్నట్టు కనపిస్తున్నది. అందుకే ఆ పార్టీ నేతలు ప్రశ్నలను తట్టుకోలేకపోతున్నారు. చిన్న ప్రశ్నకు కూడా తుఫానులా లేస్తున్నారు. అప్పుడే నవ్విస్తున్నారు. అప్పుడే ఏడిపించేస్తున్నారు. ఇది తాజాగా కమలం పార్టీ ఫన్ అండ్ ఫ్రస్టేషన్ అని విలేకర్లు జోకులు వేసుకుంటూ మీడియా సెంటర్ నుంచి జారుకున్నారు.

-గుడిగ రఘు

మానవి
www.navatelangana.com
ఆదివారం
11 జూన్ 2023



శ్రీదేవి మంత్రి... తెలంగాణ భాషను ఎగతాళి చేస్తే తట్టుకోలేకపోయారు. తన యాసను, సంస్కృతిని కాపాడుకోవాలనే దృఢ సంకల్పంతో ఉద్యమంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక తెలంగాణ కోసం మలిదశ పోరాటంలో అలుపెరుగని కృషి చేశారు. ఇప్పుడు తెలంగాణ అధికార భాషా సంఘం తొలి అధ్యక్షురాలిగా చరిత్ర సృష్టించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉత్తర్వులన్నీ తెలుగులో విడుదలయ్యేలా కృషి చేస్తున్న ఆమె తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తన ఉద్యమ అనుభవాలను మానవితో ఇలా పంచుకున్నారు...

భాష కోసమే ఉద్యమించాను

నేను పుట్టింది మహబూబ్‌నగర్ జిల్లా, సిరిసినగండ్ల. మా అమ్మ మంత్రి రాధా దేవి, నాయిన మంత్రి శశి భూషణ్ రావు. మాది బ్రాహ్మణ కుటుంబం. అయినా నాయిన ప్రభావంతో విప్లవ, అభ్యుదయ భావాలతో పెరిగాను. నాన్న రెవెన్యూ ఉద్యోగి. ఆయన ఉద్యోగ రీత్యా నల్లగొండలో స్థిరపడ్డాం. నా చదువంతా నల్లగొండలోనే కొనసాగింది. చదువుకూడా సర్టిఫికేట్లు, మార్కులు, ర్యాంకుల కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం, పేదల అభ్యున్నతి కోసం చదివాను. సంస్కారవంతమైన చదువు చదవాలని, మనిషికి వాగ్భూషణమే సుభూషణమని, ఏ అలంకారాలు మనిషిని మనిషిగా నిలబెట్టలేవని నాయినా ఎప్పుడూ అంటుండేవాడు. అటువంటి కుటుంబం నుండి వచ్చిన నాకు సమాజసేవంటే ఎంతో ఇష్టం. మా నాన్న, చిన్నాన్నలు 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.

నాయిన వల్లనే...

సంగీతం, నృత్యంలో కూడా నాకు ప్రవేశం ఉంది. ఎన్నో ప్రదర్శనలిచ్చాను. ఎన్నో బహుమతులు కూడా అందుకున్నాను. పువ్వు పుట్టగానే పరిమళించినట్టు బాల్య దశలోనే అన్ని రంగాలలో ముందుండాలని సాహిత్య, సామాజిక రంగాలలో మక్కువ కల్పించిన మా గురువు కీ.శే.కట్టా రామచంద్రా రెడ్డిని నేనెప్పుడూ మర్చిపోలేను. బాల్యంలోనే కలం పట్టి కవితలల్లి పలువురి ప్రశంసలను పొందటం నాలో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పెంచింది. అంతేగాక మా నాయిన కవి, గాయకుడు, రచయిత, నటుడు తెలుగు భాషాభిమాని. నాయిన వల్ల కూడా తెలుగు భాషపై మక్కువ ఏర్పడింది.

తగిన గౌరవం కోసం...

డిగ్రీ పూర్తయ్యాక పెండ్లి చేశారు. తర్వాత హైదరాబాద్ వచ్చేశాను. అమీర్‌పేట్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నడుపుతూ పీజీ పూర్తి చేశాను. అప్పట్లో ఒకామె తెలంగాణ భాషను వెక్కిరిస్తుంటే తట్టుకోలేకపోయాను. నా భాషను కాపాడుకోవాలని, తగిన గౌరవం దక్కాలని తపించాను. అప్పటికే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నా భాషకు, సంస్కృతికి సముచిత గౌరవం దక్కాలంటే నేనూ ఉద్యమంలో భాగస్వామిని కావాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. రాష్ట్రం వచ్చినా రాకున్నా నా జీవితం తెలంగాణ ఉద్యమానికే అంకితం అనుకున్నాను.

అలుపెరుగని పోరాటం

మా నాయిన తెలంగాణను ఎప్పటికీ సాధించుకోలేమని నిరాశతో ఉండేవాడు. దాదాపు ఆ తరం వారు అందరూ ఆశలు వదులుకున్న వేళ బాపు కేసీఆర్ రూపంలో ఆ లోటు భర్తీ అయింది. ఆయన నాయకత్వంలో 2003 నుంచి తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేశాను. అయితే నేనెప్పుడూ పదవుల గురించి ఆలోచించలేదు. సామాన్య ఉద్యమ కారిణికి ఇంత గొప్ప బాధ్యతను ఇచ్చారంటే దానికి కారణం బాల్యం నుండి సాహిత్య రంగంలో నిబద్ధతతో కృషి చేయడంతో పాటు ఓ ఉద్యమకారిణిగా నాకు దక్కిన గౌవంగానే భావిస్తాను. మా నాయిన కల తెలంగాణ. ఆయన కలను నిజం చేశారు మన ముఖ్యమంత్రి. అందుకే నేను ఆయన్ని గౌరవంగా బాపు కేజీఆర్ అని పిలుచుకుంటాను. దేశ చరిత్రలో ప్రత్యేకంగా గుర్తించుకోదగిన మహోద్యమాన్ని సాగించి పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా దూసుకెళ్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అతి తక్కువ కాలంలోనే సమగ్రమైన ప్రగతి పరుగులు పెడ్తున్నది.

సాహితీ విలువలు పెరుగుతాయి

చిన్నప్పటినుండి పిల్లలకు మాతృభాష మీద అవగాహన, అభిరుచి కలిగించాలి. యువతకు సాహిత్యం పట్ల మక్కువ కలిగించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలి. సాంస్కృతికోద్ధరణ వైపుగా వారిలో ఆసక్తిని పెంపొందించాలి. ఆ విషయంలో కొన్ని అవార్డులు, రివార్డులు ప్రకటించాలి. దీనివల్ల కూడా సాహితీ విలువలు పెరుగుతాయి. ఇంట్లో తెలుగు మాట్లాడటం, తెలుగు పుస్తకాలు చదవటం వంటివి అలవాటు చేయాలి. తెలుగు సాహిత్యంలో ఎన్నో కొత్త ప్రక్రియలు, సంప్రదాయాలు మన తెలంగాణ కవుల నుంచే మొదలయ్యాయి. మల్లియ రేచన, పంపన, పాల్కురికి సోమన, బమ్మెర పోతన, బండారు అచ్చమాంబ వంటి తెలంగాణ సాహితీ మూర్తులు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. కావున ఇక్కడి బిడ్డలు కళాకారులై విశ్వానికి వెలుగులు నింపాలని నా ఆకాంక్ష. నేను వివిధ పత్రికలకు సాహితీ వ్యాసాలు చాలా రాశాను. వాటిని త్వరలో పుస్తకరూపంలో మీ ముందుకు తీసుకురాబోతున్నాను.

తమ ప్రతిభను చాటుకుంటున్నారు

ఆధునిక మహిళ సమాజంలో కీలకపాత్ర వహిస్తున్నది. అన్ని రంగాల్లో సత్తా చాటుకుంటున్నది. అన్ని శాస్త్రాలను ఔపాసన పట్టి, అద్భుత విజ్ఞానాన్ని సంపాదించి, మహోన్నతంగా విశ్వ వేదిక మీద తన ప్రతిభను చాటుతున్నది. "ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్" అన్నట్లు ఆఖరికి వేదాధ్యయన కాలంలో వేదాలు కూడా నేర్చి, దీటుగా నిలబడుతున్నది. ఉదాహరణకు గార్గి, మైత్రి వంటివారు. మీరాబాయి భక్తి ఉద్యమంతో ప్రాశస్త్యం పొందింది. అట్లాగే అక్క మహాదేవి. ఆధునిక కాలంలో చూసు కుంటే అన్నా చాందీ కేరళ హైకోర్టు ప్రథమ మహిళా న్యాయమూర్తిగా పేరు తెచ్చుకుంది. సుచేతా కృపలాని ఉత్తర ప్రదేశ్ తొలి మహిళా ముఖ్య మంత్రిగా పేరు తెచ్చు కుంది. అలానే విజయలక్ష్మి పండిట్ ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ లో స్థానం సంపాదించుకున్న తొలి మహిళగా గొప్ప స్థానాన్ని పొందింది. ఇక సరోజినీ నాయుడు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి మహిళ. కిరణ్ బేడీ తొలి ఐపీఎస్ అధికారిణి. ఇలా ఎందరో మహిళలు ఇంకెందరో గొప్ప స్థానాన్ని తమ జ్ఞాన సంపదతో సంపాదించడమే కాకుండా చరిత్రలో ఆదర్శమూర్తులుగా నిలిచిపోయారు.

ఏరికోరి కోడలిగా చేసుకున్నారు

మా వారు పిండిప్రోలు లక్ష్మణమూర్తి. ప్రస్తుతం వ్యాపార రంగంలో ఉన్నారు. వీరి సొంతూరు చిత్తూరు జిల్లా. అయితే వారి కుటుంబం కూడా ఉద్యోగరీత్యా ఎప్పుడో నల్లగొండ వచ్చి స్థిరపడింది. మా అత్తమ్మ నన్ను ఏరి కోరి కోడలిగా చేసుకున్నారు. సొంత తల్లిలా నన్ను చూసుకుంటారు. ఆమె కేసీఆర్‌కు వీరాభిమాని. మా అమ్మాయి నైమిష ప్రీతమ్, మెడిసిన్ చదువుతోంది. అయితే తెలంగాణ కోసం ఎంతో తపించిన మా నాన్న 1998లో చనిపోయారు. తాను కోరుకున్న తెలంగాణను, నా ఎదుగుదలను చూడలేకపోయారనే బాధ నాలో మిగిలిపోయింది.



తెలుగు తల్లికి నీరాజనాలు

అధికారభాషా సంఘం అధ్యక్ష పదవిని నేను ఓ అధికారంగా భావించడం లేదు. అభ్యర్థనే నా అభిమతం. చిన్నారులు, విద్యార్థినీ, విద్యార్థులు, యువత... ఇలా అన్నింటా మన తెలంగాణ భాషా వికాసం ఆమనిగా విరబూస్తే, ఈ కోయిలలన్నీ తెలుగు పలుకులు గానం చేస్తుంటే అప్పుడు నా కృషి ఫలించినట్టుగా భావిస్తాను. అనునిత్యం తెలంగాణ తెలుగు తల్లికి నీరాజనాలు అర్పిస్తాను. భరతమాత బిడ్డగా గర్విస్తాను. తెలుగు భాషపై ఆమోఘమైన పట్టు ఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రి. నాకు ఈ బాధ్యత అప్పగించడమే ఎనలేని ఒక గొప్ప ప్రశంసా పత్రంగా భావిస్తున్నాను. నాకు ఇచ్చిన ఈ భాధ్యతను తెలుగు భాషాభివృద్ధి కోసం నా శాయశక్తులా కృషి చేస్తాను.

సమాజం భయపడుతుంది

స్త్రీలు ఎంతగా అభివృద్ధి చెందినా బానిసలుగా చూస్తున్న వారు కూడా చాలా మంది ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాదం మరింత పెరిగింది. భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి సిసలైన వారసులమని చెప్పుకునే బీజేపి నిజస్వరూపం రెజ్లర్ల విషయంలో బట్టబయలైంది. బిల్కిస్ బానో అనే గుజరాత్ ముస్లిం మహిళ కుటుంబంలో ఎనిమిది మందిని హత్యచేసి, ఏడు నెలల కూతురును బండకేసి కొట్టి చంపి, ఆమెపై లైంగిక దాడి చేసిన నిందితులకు బీజేపి నేతలు సన్మానం చేసిన తీరుకు యావత్ సభ్య సమాజం తలదించుకుంది. గుజరాత్ ఫైల్స్ రచయిత, జర్నలిస్టు రానా అయూబ్‌ను సంఘ్ పరివార్ వేధిస్తున్న తీరు చూసి సమాజం భయపడుతోంది. సోషల్ మీడియా వేదికగా ఆమెను వేధిస్తున్నారు. కథువాలో ఎనిమిదేండ్ల గిరిజన బాలికను గుడిలో బంధించి, బలవంతంగా మద్యంతాపి ఎనిమిది రోజులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ నిందితులకు మద్దతుగా బీజేపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. యుపి ఉన్నావ్‌లో ఒక యువతిపై ఏకంగా బీజేపి ఎంఎల్‌ఏనే దాడికి పాల్పడ్డాడు. ఇది మహిళల పట్ల వీళ్ళకున్న గౌరవం. ప్రజలంతా ఏకమై ఇలాంటి వాళ్ళను తరిమి కొట్టాలి. దేశాన్ని కాపాడుకోవాలి.



రెజ్లర్లపై దౌర్జన్యం అమానుషం

బంగారు పతకాలు సాధించి, మన భారత్ కీర్తిని విశ్వమంతా చాటిచెప్పిన రెజ్లర్లను లైంగికంగా వేధించడం దుర్మార్గం. బీజేపి ప్రభుత్వం దోషులను కాపాడుతున్న తీరు మరింత జుగుప్సాకరం. న్యాయంకోరిన మహిళా రెజ్లర్లపై చేయిస్తున్న దౌర్జన్యం అమానుషం. దిక్కుతోచని మహిళా రెజ్లర్లు గంగమ్మకు మొరపెట్టుకోవడం మన దైన్యస్థితిని తెలియజేస్తుంది. నిజంగా బీజేపి నేతలకు మన భారతీయ సంస్కృతిపై గౌరవంలేదు. కేవలం రాజకీయ ప్రయోజనంకోసమే వీటిని వాడుకుంటున్నారు. వారి కపటప్రేమను నిరూపించే అనేక సంఘటనలను మనం చెప్పుకోవచ్చు.

– సలీమ

ఫొటోలు : వెంకటేష్

సర్వే ప్రాతిపదికనే టికెట్లు

(మొదటిపేజీ తరువాయి)

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర 1000 కి.మీ పూర్తయిన సందర్భంగా ఆయన్ను అభినందిస్తూ సమావేశంలో తీర్మానం చేసినట్టు రేవంత్ ఈ సందర్భంగా వివరించారు. పార్టీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు ఇంచార్జీలుగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒక నివేదిక పంపాలని కోరారు. అందరం కలిసికట్టుగా పని చేస్తేనే విజయం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాస్తవాలను ప్రజలకు వివరించండి : రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే

సీఎం కేసీఆర్ ప్రజలకు చెబుతున్న అబద్ధాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే పిలుపునిచ్చారు. నాయకులు క్షేత్ర స్థాయిలో గట్టిగా పని చేయాలన్నారు. 'కేసీఆర్ రోజూ ప్రజలకు అబద్ధాలు చెబుతూ ప్రచారం చేస్తున్నారు. తనకు పేపర్, ఛానల్స్ ఉన్నాయి. తాను రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్టు, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నారు' అని ఎద్దేవా చేశారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలనీ, వాటిని అవగాహన చేసుకుని వాస్తవాలను జనంలోకి తీసుకెళ్లాలని కోరారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈనెలాఖారులోపు మండల కమిటీలను పూర్తి చేయాలన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. డిజిటల్ మెంబర్ షిప్ ఉన్న ప్రతి ఒక్కరిని కలవాలన్నారు. రాష్ట్రానికి కొత్తగా ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథన్, మన్సూర్ అలీ ఇంచార్జులుగా వచ్చారని తెలిపారు.

మల్లు రవితో జూపల్లి భేటీ

మాజీ ఎంపీ మల్లు రవి, పార్టీ సీనియర్ నేత కొల్లాపూర్ నియోజకవర్గ నాయకులు జగదీశ్వర్‌రావుతో మాజీ మంత్రి జూపలి కృష్ణారావు శనివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. సుదీర్ఘంగా వారితో చర్చలు జరిపారు. జూపల్లి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం నేపథ్యంలో వారి భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఖమ్మం మార్కెట్లో అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్పే అవకాశం ఉండేది స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన అరగంట తర్వాత ఖమ్మం, నేలకొండపల్లి నుంచి ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పాయి.

మార్కెట్‌ను సందర్శించిన సీపీఐ(ఎం) బృందం

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో అగ్నిప్రమాదంలో కాలిపోయిన పత్తి వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీపీఐ(ఎం) నాయకులు మార్కెట్‌ను సందర్శించారు. 2000కు పైన బస్తాలు పత్తి కాలిపోవడానికి మార్కెట్లో ఫైరింజన్ అందుబాటులో లేకపోవడమే కారణమన్నారు. ఇక్కడ ఉన్న ఫైర్ ఇంజన్ నేలకొండపల్లికి మార్చడం సరైంది కాదన్నారు. పర్మినెంట్ సెక్యూరిటీని నియమించాలని కోరారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి రుద్రాక్షల మల్లేశాన్ని కలిసి ప్రమాదానికి కారణాలను విశ్లేషించారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ నాయకులు సైతం సందర్శించారు. మార్కెట్‌ను సందర్శించిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, నాయకులు తుషాకుల లింగయ్య, బండారు యాకయ్య, సుధీర్, బజ్జురి రమణారెడ్డి, పగడాల మోహన్ రావు తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా

(మొదటిపేజీ తరువాయి)

ఎకౌంట్లలో వారం రోజుల వ్యవధిలో రైతు బీమా మాదిరిగా జమ చేస్తామని ప్రకటించారు. ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు, లైసెన్సు, నామిని వివరాలను ఎక్సైజ్ శాఖ అధికారులకు వారం రోజుల వ్యవధిలో అందజేయాలని మంత్రి సూచించారు. గీత కార్మికుల బీమాను సమర్థవంతంగా అమలయ్యేలా విధివిధానాలు పూర్తి చేయాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫారాజ్ అహ్మద్‌ను మంత్రి ఆదేశించారు.

పరిధులు గీసుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

మారిందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రతి రోజూ 8 వేల మెట్రిక్ టన్నుల చెత్తను లిఫ్ట్ చేస్తున్నామని, పొడి చెత్త ద్వారా కరెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. తడి చెత్త ద్వారా రూ.200 కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో మురుగునీటిని శుద్ధి చేస్తున్నామని, అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

దేశంలో 3శాతం కంటే తక్కువ జనాభా ఉన్న తెలంగాణ జాతీయ అవార్డుల్లో 30శాతం సాధించిందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 150 వార్డు కార్యాలయాలు అమలులోకి వస్తాయన్నారు. వార్డు కార్యాలయాల్లో అన్ని శాఖలకు చెందిన 10 మంది అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అధికారి వార్డ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని, ఈ అధికారి పర్యవేక్షణలో పారిశుధ్యం, రోడ్డు మెయింటెనెన్స్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, యూబీడీ, యూసీడీ, జలమండలి, విద్యుత్, తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తాయన్నారు. ఆ వార్డు నా పరిధి కాదని ఎవరూ చెప్పొద్దనీ, వచ్చిన ప్రతి ఫిర్యాదునూ స్వీకరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగాగానీ సోషల్ మీడియా, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించాలని, నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కరమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు వాటి పరిష్కార వివరాలను తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గార్బేజ్, స్ట్రీట్ లైట్, వాటర్ లీకేజీలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వచ్చే అవకాశముందన్నారు. ఎలాంటి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయో దృష్టి సారించాలన్నారు.

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం కోసం నగరంలో పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ వార్డు కార్యాలయాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ వార్డు వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదన్నారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా 150 వార్డు కార్యాలయాలకు 1000 చదరపు గజాలలో ఓకే విధమైన రూల్స్‌తో వార్డు వ్యవస్థను నెలకొల్పామన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధంగా 1000 చదరపు అడుగులున్న భవనాలను గుర్తించి సిద్ధం చేసిననట్టు తెలిపారు. వార్డు కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వార్డు పరిపాలన అధికారిగా వార్డులో నియమించిన వివిధ విభాగాల సిబ్బందికి అస్కి ద్వారా శిక్షణ అందించామన్నారు. సీడీఎంఏ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజలు పరిపాలనకు చేరువ కావడానికి జిల్లాలు, మండలాలు, ఆర్డీవో కార్యాలయాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వార్డు అధికారులు ప్రభుత్వానికి కండ్లు, చెవులు వంటి వారు అన్నారు. జలమండలి ఏం.డీ దానకిషోర్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఇంజినీరింగ్ చీఫ్ జియావుద్దీన్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగం ద్వారా అడ్వాన్స్ ప్లానింగ్ ద్వారా మైనర్ వర్క్స్, ప్యాచ్ వర్క్స్, క్యాచ్ పిట్ వర్క్స్ 24గంటల్లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు. విపత్తు సమయంలో మాన్సూన్ రెస్క్యూటీమ్‌లు వేగవంతంగా పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వార్డు అధికారులు, సిబ్బంది, విద్యుత్, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రెజ్లర్ల అల్టిమేటం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది జరగబోయే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటామని, లేదంటే వాటిని బహిష్కరిస్తామని హెచ్చరించారు. హర్యానాలోని సోనిపట్‌లో ఖాప్ నేతలు శనివారం నిర్వహించిన మహాపంచాయతీలో రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పునియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాక్షి మాలిక్ మాట్లాడుతూ.. 'మా సమస్యలన్నీ పరిష్కారమైతేనే మేం ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటాం. మేం ప్రతిరోజూ ఎంతో మానసిక వేదనను అనుభవిస్తున్నాం' అన్నారు. బ్రిజ్ భూషణ్ లైంగిక ఆరోపణల కేసులో నిరసనలు కొనసాగిస్తున్న తమపై తీవ్ర ఒత్తిడి ఉందని తెలిపారు. రాజీకి రావాలని నిందితుని మనుషులు బెదిరిస్తున్నారని చెప్పారు. ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేసినందునే మైనర్ రెజ్లర్ తండ్రి మాట మార్చారని అన్నారు. 'నిందితున్ని అరెస్టు చేసి దర్యాప్తు చేయించాలని మొదటి నుంచి కోరుతున్నాం.. బయట ఉండడం వల్ల కేసును తప్పుదోవ పట్టిస్తున్నాడు' అని తెలిపారు. బజరంగ్ పునియా మాట్లాడుతూ.. ప్రభుత్వంతో జరిగిన చర్చల గురించి ఖాప్ నేతలకు వివరించనున్నట్టు తెలిపారు. ఇక, ఆందోళన చేస్తున్న రెజ్లర్ల మధ్య ఐక్యత లోపించిందంటూ వస్తున్న వార్తలను సాక్షి మలిక్ తోసిపుచ్చారు. తామంతా ఒక్కటేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా సమస్య పరిష్కారం కాకపోతే మళ్లీ కలిసికట్టుగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలనేది రెజ్లర్ల ప్రధాన డిమాండ్‌గా ఉండగా, 15న దర్యాప్తు నివేదిక వస్తుందనీ, ఛార్జిషీటు నమోదయ్యేంత వరకూ వేచిచూడాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15 తర్వాతే వారి తదుపరి కార్యాచరణను నిర్ణయించే అవకాశముంది.

కాగా, చైనాలో వచ్చే సెప్టెంబర్‌లో ఏషియన్ గేమ్స్ జరుగనున్నాయి. గత ఒలంపిక్స్-2018లో జరిగిన ఏసియన్ గేమ్స్‌లో బజరంగ్ పూనియా, వినేష్ ఫోగట్‌లు బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో కొద్దికాలంగా నిరసన సాగిస్తున్న రెజ్లర్లు ఏషియన్ గేమ్స్ నుంచి వైదొలిగితే ఆ ప్రభావం ఇండియా పతకాలపై పడే అవకాశాలుంటాయి.

రుణాలివ్వడమూ సాయమేనా ?

బీజేపీ నేతలకు మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రైతులకు రుణాలివ్వడాన్ని కూడా బీజేపీ నేతలు సాయం చేసినట్టుగా చెబుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో స్క్రిప్టు తయారు చేస్తే హైదరాబాద్‌లో చదువుతున్నారని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. వ్యవసాయ రంగానికి రాష్ట్రంలో రూ.20లక్షల కోట్ల రుణాలు అందాయని పేర్కొన్నారు. గొర్రెలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23,948 వేల కోట్ల రుణం ఇవ్వడం కేంద్ర ప్రభుత్వ గొప్పతనమా? అని ప్రశ్నించారు. ఒక కేంద్ర మంత్రి రుణాలను గొప్పగా చెప్పుకోవడం సమంజసమా? అని ప్రశ్నించారు. రూ. 6300 కోట్లతో ప్రారంభించిన రామగుండం యూరియా ఫ్యాక్టరీ నుంచి అరబస్తా యూరియా రైతులకు ఉత్పత్తి చేశారా? దానిని వాణిజ్య మార్కెట్‌లోకి పంపించారా?అని నిలదీశారు. మరి ఇందులో కేంద్రం రైతాంగానికి చేసిన మేలేంటని ప్రశ్నించారు. వాస్తవాలను మరుగు పరుస్తూ కేంద్ర మంత్రి రైతులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కర్నాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చి నిధులు కేటాయించాలంటూ బీజేపీ నేతలు అడగలేదని గుర్తు చేశారు.

మంత్రి సత్యవతి రాథోడ్ చేతిపై కేసీఆర్ పేరు పచ్చ బొట్టు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో మంత్రి సత్యవతి రాథోడ్ తన చేతిపై కేసీఆర్ పేరు పచ్చబొట్టుగా వేయించుకున్నారు. గిరిజన యోధుడు కొమురం భీమ్ సహచరుని వారసులతో పచ్చబొట్టును వేయించుకున్నారు. బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో జరుగుతున్న గిరిజన సంస్కృతి ఉత్సవాల్లో శనివారం మంత్రి పాల్గొన్నారు. ఆదివాసీ బంజారాలు సిద్ధం చేసిన వివిధ రకాల ఉత్పత్తులు, ఫోటోఎగ్జిబిషన్, స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతులను ప్రోత్సాహించాలని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.గిరిజన సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారని గుర్తు చేశారు.

మణిపూర్ హింసపై మౌనమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. హింసాత్మక సంఘటనలతో రాష్ట్రం ఉడికిపోతుంటే గత 36 రోజులుగా ప్రధాని మౌనం వహించడాన్ని తీవ్రంగా ఖండించింది. కాగా మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం కాంగ్రెస్ పార్టీ ఐదు పాయింట్ల అజెండాను రూపొందించింది. మణిపూర్‌లో ఇలాంటి భీతావహ వాతావరణాన్ని ఎన్నడూ చూడలేదని పీసీసీ ఉపాధ్యక్షుడు హెచ్.గోస్వామి వ్యాఖ్యానించారు.

కేరళలో అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్

(మొదటిపేజీ తరువాయి)

20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తాయి. సైన్స్ ఫెస్టివల్‌కు సన్నాహకంగా 2016 నవంబర్‌లోనే అతి పెద్ద ర్యాలీ నిర్వహించారు. దీనికి పాఠశాలలు, కళాశాలల నుండి విశేష స్పందన లభించింది. అయితే కోవిడ్ కారణంగా ఫెస్టివల్ నిర్వహణలో జాప్యం జరిగింది. ఫెస్టివల్ కోసం గత కొంత కాలంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఫెస్టివల్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు కేటాయించింది. రెండు నెలల పాటు జరిగే ఫెస్టివల్‌లో వివిధ అంశాలపై కూలంకషంగా చర్చలు జరుగుతాయి. దీనికి పది లక్షల మంది హాజరవుతారని అంచనా.

భద్రతా నిధి పక్కదారి

(మొదటిపేజీ తరువాయి)

రూ.15,775 కోట్ల (78.9%) లోటు కన్పిస్తోంది. ప్రయాణికుల భద్రత కోసం అరకొర నిధులు కేటాయించడంతో పాటు అందించిన మొత్తాన్ని కూడా వేరే అవసరాల కోసం ఖర్చు చేశారు. జామాఖర్చులకు సంబంధించిన సమాచారాన్ని రైల్వే శాఖ ఏనాడూ ప్రజలకు బహిర్గతం చేయలేదు.రైల్వే అధికారులు ప్రాధాన్యత లేని అవసరాల కోసం నిధిని ఖర్చు చేశారని కాగ్ ఎత్తిచూపింది. 2017-18లో ప్రాధాన్యత లేని అవసరాల కోసం 2.76శాతం ఖర్చు చేస్తే 2019-20లో ఆ వ్యయం 6.36శాతానికి పెరిగింది. మరోలా చెప్పాలంటే ప్రాధాన్యేతర అవసరాల కోసం అక్షరాలా రూ. 1,004 కోట్లు ఖర్చు చేశారు. ప్రాధాన్యత-1 పద్దు కింద ట్రాక్ పునరుద్ధరణ సహా సివిల్ ఇంజినీరింగ్ పనుల కోసం రూ.1,19,000 కోట్లు కేటాయించాల్సి ఉండగా లక్ష కోట్లు మాత్రమే కేటాయించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ట్రాక్ పునరుద్ధరణ పనుల కోసం కేటాయింపులు క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. 2018-19లో ఈ పనుల కోసం రూ.9,607.65 కోట్లు కేటాయించగా 2019-20లో కేటాయించింది రూ.7,417 కోట్లు మాత్రమే.

నేడు గ్రూప్-1 పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోకి వచ్చేటప్పుడు హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

2.75 లక్షల మంది డౌన్‌లోడ్...

గ్రూప్-1 పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,80,052 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 2.86 లక్షల మంది హాజరయ్యారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో పరీక్షను రద్దు చేసిన కమిషన్ ఆదివారం తిరిగి నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు 2.75 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 994 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసింది. అభ్యర్థికి ఇచ్చిన ప్రశ్నాపత్రం ఇతర భాషలో ఉంటే వెంటనే ఇన్విజిలేటర్‌ను సంప్రదించి మరొకటి తీసుకోవాలని కమిషన్ వర్గాలు సూచించాయి.

హైకోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 218 కేసులు పరిష్కారం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్ణయం మేరకు శనివారం హైకోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ బెంచ్‌లకు హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జి యతిరాజులు, జస్టిస్ జి.శ్రీదేవి అధ్యక్షత వహించగా...మొత్తం 218 కేసులు పరిష్కారమయ్యాయి. 650 మందికి సుమారు రూ.12కోట్ల పరిహారం అందనుంది.

' గౌడ కులస్తులకు సీఎం కేసీఆర్ భరోసా'



నవతెలంగాణ-చైతన్యపురి

గౌడ కులస్తులకు సీఎం కేసీఆర్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌లు ఎంతో భరోసా కల్పిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమల్ల రామ్ నర్సింహ గౌడ్ అన్నారు. ఆర్కేపురం డివిజన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకే ప్రమాదబారిన పడిన గీత కార్మికుల ఎక్స్ గ్రేసియో 12 కోట్ల 50 లక్షల రూపాయలను అధికారులు విడుదల చేయడం చాలా శుభసూచకం అని అన్నారు. గీత కార్మికులకు రైతు బీమా మాదిరిగా గీత కార్మికుల బీమా రాష్ట్రంలో అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం ద్వారా లక్షలాది మంది గౌడ కుటుంబాలు తెలంగాణ ప్రభుత్వానికి ఋుణ పడి ఉంటారని రామ్ నర్సింహ గౌడ్ తెలిపారు.

యువత వ్యాపార రంగంలో ముందుండాలి : కౌన్సిలర్ రమాదేవి



నవతెలంగాణ- ఘట్కేసర్

యువత వ్యాపార రంగంలో ముందుంటూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మైపాల్ గౌడ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్ 2వ వార్డ్ లో మార్కెట్ రోడ్డు సమీపంలో శనివారం బిస్మిల్లా చికెన్ సెంటర్‌ను కౌన్సిలర్ ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన చికెను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ వడ్లకొండ శివయ్య, బీఆర్ఎస్ వార్డ్ ప్రెసిడెంట్ జనగామ యాదగిరిరావు, సల్లా శివ, గణేష్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-ఘట్కేసర్

పోచారం మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో సుపరి పాలన దినోత్సవంలో భాగంగా చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి శనివారం కౌన్సిల్ సభ్యులు, అధికారులు, కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీలలో బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఇండ్ల నిర్మాణ పర్మిషన్లు, పెన్షన్ ప్రతిదీ పారదర్శకంగా అవినీతి లేకుండా పరిపాలనా నడుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేష్, కౌన్సిలర్స్ గొంగాళ్ల మహేష్, నర్రి దాన లక్ష్మి, చింతల రాజశేఖర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, బైరా హిమా, అకిటి శైలజ, మెట్టు బల్ రెడ్డి, నల్లవెల్లి లక్ష్మి, సామల శ్రీలత, అబ్బవతి సరిత, మోటుపల్లి పోచమ్మ, సుర్వి సుదా లక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ అలి, శకుంతల, శంకర్ ఏఈ నరేష్, మేనేజర్ నర్సింహులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పది'లో సరిత విద్యానికేతన్ స్కూల్ విజయకేతనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాలలో సరిత విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ భేరి క్రిస్టల్, వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా స్కూల్ నందు విద్యార్థులకు విద్యాబోధన సరికొత్త పద్ధతిలో అర్థమయ్యే విధంగా బోధిస్తున్నట్లు తెలిపారు. ఇండోర్, అవుట్డోర్ గేమ్స్, ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమయ్యే విధంగా పిల్లలకు అన్ని రంగాలలో సలహాలు, సూచనలు ఇస్తూ.. వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు మానసికంగా ఇబ్బంది కాకుండా ఆటలు, పాటలతో కూడిన అంశాలను నేర్పిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతున్నామని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వారి యొక్క లక్ష్యాలను ఏ విధంగా నిర్దేశించుకోవాలో తెలియజేస్తున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షా ఫలితాలలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వి. అక్షిత 10/10, ఎం. భవిష్ 10/10, కే. భవ్య రెడ్డి 10/10, గౌతమ్ 10/10, రమా వైష్ణవి 10/10, శ్రీశాంత్ రెడ్డి 10 / 10 ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మున్సిపాల్టీకి రెండు జాతీయ అవార్డు రావడం సంతోషం'



నవతెలంగాణ-ఘట్కేసర్

కౌన్సిలర్లు, కార్మికుల సహకారంతోనే ఘట్కేసర్ మున్సిపల్‌కు రెండుసార్లు జాతీయ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఘట్కేసర్ మున్సిపల్ చెర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సంక్షేమ సంబరాల్లో భాగంగా శనివారం ఘట్కేసర్ మున్సిపాలిటీ కార్యక్రమంలో సుపరిపాలన వేడుకలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఘట్కేసర్ గతంలో కంటే మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత బీటీ, సీసీ రోడ్లు, ఇలా అనేక అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ ప్రజలు మున్సిపల్ అభివృద్ధికి ముమ్ముందు కూడా సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సిలర్లు బొక్క సంగీత, కడుపోల్లా మల్లేష్ , మున్సిపల్ మేనేజర్ అంజి రెడ్డి, స్వచ్ సర్వేక్షన్ ఇంచార్జి యోగేష్, ఎంవోరల్మెంట్ ఇంచార్జి రాజేష్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'పేదల పాలిట పెన్నిధి సీఎం కేసీఆర్'



నవతెలంగాణ -ఉప్పల్

పేదల పాలిట పెన్నిధి సీఎం కేసీఆర్ అని మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ రామంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్‌ను రూ.3116 నుండి రూ. 4116 పెంచే నిర్ణయం తీసుకోవడం హర్షణీయం అన్నారు. మరోసారి తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, భిక్షపతి అధ్యక్షులు, రాఘవేంద్ర, బాలకృష్ణ, సరిత, శంకర్, ఫాతిమా, నరేష్, శైలాజ , యాదగిరి, శ్రావణ్ కుమార్ పద్మ, చిన్న రావు, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరరావు, మధుసూదన్ రెడ్డి, తుట్ నరసింహ, శ్రీనివాస రెడ్డి, మనీష్, మద్దూరి శ్రీనివాస్, నందు పాల్గొన్నారు.

'18న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు'



నవతెలంగాణ - సంతోష్ నగర్

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కొనసాగింపుగా ఈ నెల 18న నిర్వహించే రాజీవ్ గాంధీ ఆన్లైన్ క్విజ్ పోటీలలో విద్యార్థులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని మలక్‌పేట్ నియోజకవర్గ ఇంచార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సేకోలేఖర్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ జిల్లా ముసరాంబాగ్ డివిజన్లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోని సాయి చైతన్య జూనియర్ కాలేజ్, నారాయణ కాలేజీలో విద్యార్థులను కలిసి బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీలో విజేతలైన వారికి మొదటి బహుమతిగా లాప్టాప్, రెండో బహుమతిగా స్మార్ట్ ఫోన్, మూడో బహుమతిగా ట్యాబ్ మరియు 10 కన్సలేషన్ బహుమతులను అందజేస్తున్నట్లు వివరించారు. ఈ పోటీలో పాల్గొనే వారు ఈ నెల 17 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు ఆన్లైన్ పరీక్ష ఉంటుందని చెప్పారు. పూర్తి సమాచారం కోసం 76618 99899 ఫోన్ నెంబర్ కు మిస్ కాల్ ఇచ్చి రిఫరల్ కోడ్ వన్ 15011 ఈ నెంబర్‌కు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు, నారాయణ కాలేజీ ఇంచార్జి మురళి, నాయకులు భాస్కర్, సాయిరాం, శివ, వెంకట్, చైతన్య, రక్షిత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే మైనార్టీల అభివృద్ధి'

నవతెలంగాణ-చైతన్యపురి

సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తోనే మైనార్టీలకు పూర్తి న్యాయం జరుగుతుందని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు వాజీద్ పటేల్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని షాదీ ముబారక్, మైనార్టీ గురుకుల పాఠశాలలు, రంజాన్ తోఫా లాంటి పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మహేశ్వరంలో ఫార్మసిటి ఏర్పాటుతో నియోజకవర్గం రూపురేఖలు మారిపోతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు.

'58, 59 జీవోలతో అధిక ఫీజులు వసూలు'



నవతెలంగాణ - హయత్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం 58, 59 జీవోలతో నోటిఫైడ్ స్లమ్ స్థలాల రిజిస్ట్రేషన్ కోసం అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, బీజేపీ పార్టీ శ్రేణులు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం 58, 59 జీవోను తీసుకువచ్చి ప్రజలను మోసపూరిత చర్యలకు పెనుగొల్పిందని విమర్శించారు. 10% నోటి ఫైడ్ స్లమ్ ఏరియాలలో ఉన్న స్థలాలకు ఫీజులు వసూలు చేస్తున్నామని చెప్పి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయలను అనవసరంగా ఖర్చు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లించే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. 120 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగానే చర్యలు చేపట్టాలన్నారు. కానీ 59 జీవో కింద డబ్బులు కట్టాలని పేదలకు నోటీసులు పంపి, వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఆ నోటీసులకు భయపడి పేదలు అప్పులు చేసి..ఎవరు కూడా డబ్బులు చెల్లించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, కార్పొరేటర్లు రంగ నరసింహ గుప్తా, కొప్పుల నరసింహ రెడ్డి, కళ్లెం జీవన్ రెడ్డి, వెంకటేశ్వరా రెడ్డి, లచ్చి రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, పవన్ కుమార్, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కటకం నరసింహారావు, కృష్ణవేణి, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ధనం అంటే లెక్కలేదా..?





- రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపం
- రాత్రి రోడ్డేశారు.. పొద్దున్నే తవ్వేశారు..

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ప్రజా ధనం అంటే లెక్క లేకుండా పోతుంది. ప్రతి ఏటా ప్రజల నుండి వివిధ పన్నుల రూపంలో వసూళ్ల చేసే పన్నులతో ప్రణాళిక బద్ధంగా రూపొందించే పనులలో సదరు శాఖ అధికారుల పర్యవేక్షణ లేక లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథా అవుతుంది. ఇక వివరాల్లోకి వెళితే...బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ హై టెన్షన్ లైన్ వద్ద గత మంగళవారం రాత్రి బీటీ రోడ్డు వేశారు. ఆ మర్నాడు బుధవారం ఉదయం నాటికే ఇష్టానుసారంగా ఆ రోడ్డును తవ్వేశారు. ఇదేంటని స్థానికులు ఆరా తీయగా.. ఇది జలమండలి అధికారులు చేసిన నిర్వాహకమని తెలిసింది. రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం ఇలా వృథాగా పోయింది. అదే ప్రాంతంలో జలమండలి అధికారులు వేయాల్సిన పైప్ లైన్ పనులను బీటీ రోడ్డు వేయడం కంటే ముందే చేసి ఉంటే ఈ పరిస్థితి దాపురించి ఉండేది కాదని స్థానికులు వాపోతున్నారు. ఒక వేళ రాత్రి వేసిన బీటీ రోడ్డును పొద్దున్నే తవ్వాల్సిన అవసరం వచ్చినప్పుడు కనీసం సంబంధిత అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదో తవ్విన అధికారులే సమాధానం చెప్పాలి. ఇంత జరిగినా బోడుప్పల్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. మాకేంటి ప్రజల సొమ్మే కదా అన్నట్లుగా ఆ ఇంజనీరింగ్ అధికారులు వ్యవహరించడం చూస్తుంటే..ప్రజాధనంపై వారికున్న చిత్తశుద్ధి ఎంటో అర్థం అవుతుంది.

ధ్వజస్తంభ రాజగోపురం ప్రతిష్ట మహోత్సవం



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మారుతీ నగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి వారి దేవాలయం నందు ధ్వజస్తంభం రాజగోపురం ప్రతిష్ట మహోత్సవ వేడుకలను శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మారుతీ నగర్ కాలనీ, ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గా ప్రసాద్, క్రాంతి కిరణ్, మూర్తి, రవి కిరణ్, శ్రీనివాస్, వెంకట రెడ్డి, బ్రహ్మాజీరావు, సరస్వతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరిచిన యోధ్‌రాజ్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అండర్-14 ఎయిర్ రైఫిల్ షూటింగ్ లో రాష్ట్ర స్థాయిలో దేరంగుల యోధ్ రాజ్ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ నాదర్‌గుల్ గ్రామంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం యోధ్ రాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంగూడ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న యోధ్ రాజ్ భవిష్యత్ లో ఉన్నతస్థాయిలో క్రీడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం, మనోధైర్యం కల్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోధ్ రాజ్ తండ్రి గణేశ్ రాజ్, స్వీకృత్ రెడ్డి, సచిన్ మిశ్రా, బాలాపూర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.


'దశాబ్ది ఉత్సవాల లెక్కలు బహిర్గతం చేయాలి'



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల లెక్కలను బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గం తీరు చారాణ కోడికి భారణ మసాలా వేసినట్లుగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉత్సవాలకు తీర్మానాలు చేసిన నిధులు ఎన్ని.. అందులో కేటాయించిన నిధులు ఎన్నో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఖర్చుల వివరాలను సమాచార హక్కు చట్టం ప్రకారం కోరినట్లు తెలిపారు. కార్పొరేషన్‌లో నిధులు లేవని అభివృద్ధి పనులను ఆపుతున్నారు..కానీ దశాబ్ది ఉత్సవాల పేరుతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నారని విమర్శించారు. అనంతరం కార్పొరేషన్ మేనేజర్ పద్మాలతకు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా దూదు చౌహాన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- సంతోష్ నగర్

భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదు చౌహాన్ జన్మదిన వేడుకలను సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఇష్ట బిల్డర్స్ సీఎండీ జయప్రకాష్ జైన్ పప్పు సెట్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, కడ్తాల్ మండలం పార్టీ అధ్యక్షులు నేనావత్ భీక్య నాయక్, జర్పుల టికులల్ నాయక్, కార్యకర్తలు, అభిమానులు, యువకులు కలిసి దూదు చౌహాన్‌కు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి కార్పొరేటర్ పూజలు



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభం రాజగోపురం ప్రతిష్టాపన కార్యక్రమానికి శనివారం డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, క్రాంతి కిరణ్, బ్రహ్మాజీ రావు, శ్రీనివాస్, రవి కిరణ్, చంద్రధర్, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా గంధం ఫౌండేషన్



నవతెలంగాణ -ఉప్పల్

ఎంతోమంది అభాగ్యులకు గంధం ఫౌండేషన్ అండగా ఉంటుందని ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరావు అన్నారు. శనివారం రామాంతపూర్ డివిజన్ శాంతి నగర్ నివాసి చెరక తిరుపతి(77) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు గంధం నాగేశ్వరావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పు నర్సింగ్ రావు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్ల కండ్లకు అభివృద్ధి కనిపించడం లేదా..?




నవతెలంగాణ- బడంగ్‌పేట్

డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ నాయకుల కండ్లకు కనిపించడం లేదా అని కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి విమర్శించారు.శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ 24వ డివిజన్ పరిధిలో రూ.కోట్లాది నిధులతో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు కనిపించడం లేదా అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. ఆనాటి స్వర్గీయ మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ గృహ కల్ప సముదాయాన్ని 2008లో ప్రారంభించిన సమయంలో ఉన్న ప్రజలకు అనుగుణంగా డ్రైనేజీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 45 కాలనీలు పెరగటంతో 23, 28, 25, 26, 24, 4 డివిజన్లకు సంబంధించిన డ్రైనేజీల నీరు అవుట్ లేట్ లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మేయర్ పారిజాత నర్సింహా రెడ్డిల దృష్టికి తీసుకెళ్లడంతో ఆ డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ పథకంలో రూ. కోటీ35లక్షల నిధులతో ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశంతో శివాజీ చౌక్ నుండి మధురా నగర్ వరకు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు మరో రూ.60లక్షల నిధులు కేటాయించారని..త్వరలో ఆ 3పనులను పూర్తి చేయిస్తామని చెప్పారు. కొత్త మున్సిపల్ కార్పొరేషన్ భవనం నుండి అల్మాస్ గూడ వరకు, శివాజీ చౌక్ నుండి బీఎన్‌రెడ్డి వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ మంత్రి సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోచ్చమ్మ కుంట, కోమటి కుంటల సుందరీకరణ పనుల కోసం హెచ్ ఎండీఏ నిధుల నుండి మరో రూ.2కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. అదేవిధంగా కోట్లాది రూపాయల నిధులతో ప్రధాన రహదారులను బీటీ రోడ్లుగా, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ కోతలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రజల సౌకర్యం కోసం అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను మంత్రి సహకారంతో త్వరలో పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, నాయకులు కర్రె సంజీవ, రాము, కందుకూరు శ్రీనివాస్, ప్రదిఫ్, వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు




నవతెలంగాణ-బడంగ్ పేట్

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ ఘోరంగా విఫలమయ్యారని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాములు యాదవ్ సమక్షంలో శనివారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాషాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వరికుప్పల వెంకటేష్, పలువురు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలి

తెలంగాణ ఎయిడెడ్ కాలేజ్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్



నవతెలంగాణ-హయత్ నగర్


2018 సంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని ఎయిడెడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, ఎయిడెడ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ ఎయిడెడ్ కాలేజీస్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హయత్ నగర్ లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న టీచింగ్, ఎయిడెడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఎయిడెడ్ నాన్ టీచింగ్ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎయిడెడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, ఎయిడెడ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్‌పై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎయిడెడ్ కాలేజెస్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ చైర్మన్ జి.నరసింహులు, అడ్వైజర్స్ పి.ప్రభాకర్, ఉత్తమ్ తుల్జాపుర్కర్, చీఫ్ అడ్వైజర్ వి.వీర నారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వీ.కృష్ణారావు, ఉపాధ్యక్షులు ఎం.డీ నయీం, డి.రజిత, షేక్ మొహమ్మద్ పాషా,జనరల్ సెక్రటరీ ఎస్.అజయ్ కుమార్, కార్యదర్శులు హరీషన్, సుమన్, జాయింట్ సెక్రటరీ పి.సోమనాథ్, ఎం.సత్యనారాయణ, కోశాధికారి కె.సంపత్ బాబు రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.కలీం, ఎ.రాజేందర్, టీ.శ్రీధర్ గౌడ్, ఏ.శ్రీనివాస్ నాక్, జిల్లా కార్యదర్శులు కె.రాజేష్ బాబు, సిహెచ్.నర్సింహులు, మహిళా ప్రతినిధులు పి.వి.లక్ష్మి, సి.హెచ్.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శ్రీనివాస్ గుప్తా

నవతెలంగాణ - నాగోల్

హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్, లలితానగర్ లోని వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ఏక వింశతి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హెూమం, పూజా కార్యక్రమంలో ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూర నర్సింహులు గుప్త, ఆలయ పూర్వ చైర్మన్ చకిలం రమణయ్య, పూర శ్రీనివాస్, వేణు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





లోక్ అదాలత్‌లో 2434 కేసులు పరిష్కారం

నవతెలంగాణ-హయత్ నగర్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మెగా లోక్ అదాలత్ లో భాగంగా శనివారం హయత్ నగర్ కోర్ట్ లో వనస్థలి పురం, హయత్ నగర్, అబ్దుల్లా పూర్ మెట్ పోలీస్ స్టేషన్ ల పరిదిలలో ఉన్న రాజీ కేసుల్లో 2434 కేసులు పరిష్కారం అయ్యాయని 24వ అదనపు జడ్జి సల్మాన్ ఫాతిమా, 7వ అదనపు సంకేత్ మిత్ర, సుజాతలు కక్షిదారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ విలువైన తమ సమయాన్ని, డబ్బును కోర్ట్ ల చుట్టూ తిరిగి వృథా చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీపీలు నూతన్, హయత్ నగర్, వనస్థలిపురం, అబ్దుల్లా పూర్ మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, జలెందర్ రెడ్డి, మన్మోహన్ యాదవ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం కీసర మండలం కరీంగూడ గ్రామంలోని నూతన పంచాయతీ కార్యాలయంను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా తమ ప్రభుత్వం గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. కరీంగూడ గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ కౌకుంట్ల గోపాల్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.వెంకటేష్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మి నారాయణ, కరీంగూడ సర్పంచ్ కౌకుంట్ల గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాధవ రెడ్డి, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కందికంటి అశోక్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-నాచారం

టీడీపీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి కందికంటి అశోక్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాచారం టీడీపీ నాయకులు కనకమెడల రాంబాబు ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయిలో నిలిచి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరింత శక్తివంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్జం రాజేష్, గౌడేల్లి సావిత్రి, ఇస్మాయిల్, చారి, ఏర్పుల నాగరాజు, భాస్కర్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.



కొత్త జిల్లాల ఏర్పాటుతో సుపరిపాలన

- మేడ్చల్ జిల్లా ఏర్పాటుతో ఎంతో అభివృద్ధి
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- కలెక్టరేట్‌లో తెలంగాణ సుపరిపాలనా దినోత్సవం



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత ప్రజలకు మంచి పాలన అందుతోందనీ, ఈ విషయంలో సీఎం కేసీఆర్ కార్యదక్షత, ముందు చూపుతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జిల్లాల పునర్విభజన చేశారని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ సుపరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పటు తర్వాత ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పారదర్శకమైన పరిపాలన అందించేందుకు ఆయా శాఖలను పునర్వ్యవస్థీకరించి, సిబ్బంది, అధికారాలు, అవసరమైన నిధులు అందజేస్తూ బలోపేతం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి మన్ననలు పొందేలా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏర్పాటు నుంచి అన్ని రంగాల్లో రాష్ట్రం, దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటుతో పరిపాలన మరింత సులభమైందన్నారు. ప్రజలు వ్యయప్రయాసాలకోర్చి దూర ప్రాంతాలకు వెళ్ళే పరిస్థితి తప్పిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గం ఏర్పాటుతో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మేయర్లు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు అయ్యే అవకాశం కూడా లభించిందన్నారు. రాష్ట్రంలో 12,751 గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి వాటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కేవలం పరిపాలనా వికేంద్రీకరణ వల్లనే జరిగిందనీ, అందుకే ఈ రోజును సుపరిపాలనా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏర్పాటుతో కీసర రెవెన్యూ డివిజన్, తొమ్మిది మున్సిపాలిటీలు, నాలుగు కార్పొరేషన్లు, ఏడు మండలాలు, 14 గ్రామపంచాయతీలు ఏర్పాటై అందరికీ అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయని చెప్పారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు అన్ని కార్యాలయాలు ఒకే చోటు ఉండాలనీ, ఆయా పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తవద్దనే ఉద్దేశంతో అన్ని కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయ భవనాలను నిర్మించినట్టు తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయా రంగాల్లో ఆరు అవార్డులు రావడం ఎంతో ఆనందకరమనీ, అదే తీరున ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం పాలన వ్యవస్థను వికేంద్రీకరించి అందిస్తున్న సుపరిపాలనను దేశం మొత్తం ఆశ్చర్యం వ్యక్తం చేస్తుందన్నారు. జిల్లాకు త్వరలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులో రానున్నాయనీ, అప్పుడు మరింత అభివృద్ధి పథంలో ముందుకెళ్తామని తెలిపారు. పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాల స్వరూపం మారిందన్నారు. ఈ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. సింగిల్ విండో విధానాల ద్వారా త్వరితగతిన అనుమతులు మంజూరు అవుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అభివృద్ధి, సంక్షేమ ఫలితాలు, వాటి సంస్కరణలు నేడు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమలకు, టీఎస్‌బీ పాస్ ద్వారా భవన నిర్మాణా లకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకుంటే నిర్దిష్ట సమయంలో అనుమతులు వస్తున్నాయని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ, ఈ గవర్నెన్స్, సింగిల్ విండో అనుమతుల జారీ వంటి విప్లవా త్మకమైన సంస్కరణల వల్ల మంచి ఫలితాలు సాధించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలనాకష్తురు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం సుపరిపాలనా దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దేవా సహాయం, డీసీపీ జానకి, ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్స్ డ్రయినేజీ నిర్మాణంతో వరద నీటి ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బాక్స్ డ్రయినేజీ నిర్మాణంతో కాలనీలో నెలకొన్న డ్రయినేజీ, వరద నీటి ముంపు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి మైనంపల్లి హనుమంతరావు హమీనిచ్చారు. శనివారం ఆయన అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్, భారతీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా పై కాలనీల్లో నుంచి వర్షపు నీరు, మురుగు నీరు దిగువ ఉన్న శ్రీనివాస్ నగర్‌కు చేరి మడుగుగా తయారై ఇండ్ల నుంచి బయటకి వెళ్ళకుండా రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇదే కాలనీలో గీత స్కూల్ ఉందనీ, మురుగు నీరు చేరుతుండటంతో విద్యార్థులు రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నట్టు, ఈ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. రెండు మ్యాన్ హెూల్స్ ఉండి కూడా మురుగు నీరు బయటకు వెళ్ళడం లేదనీ, బాక్స్ డ్రైన్ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. భారతినగర్‌లో కూడా డ్రయినేజీ అంతర్గత రోడ్లు ఇబ్బందిగా ఉన్నాయనీ, సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రశాంతి, విజయ రామారావు, సుధీర్ కాలనీ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, హరినాథ్ రావు, వైకుంఠవాస, నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, దయాకర్, రావు నాయకులు ఉదయ్, రాజసింహారెడ్డి, నాగేశ్వర రావు, దేవేందర్, మధు, ప్రవీణ్, కవిత, తదితరులు పాల్గొన్నారు

జాతీయ లోక్ అదాలత్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార స్వంస్థ, మల్కాజిగిరిలో శనివారం చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.మధుసూదన్ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంబించారు. ఈ కార్యక్రమం ఉదయం 10:30 నుంచి ప్రారంభమైంది. ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్, మోటార్ ప్రమాద, గృహ హింస, చెక్ బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 19 బెంచులలో 33,225 కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయి. ఈ లోక్ అదాలత్‌లో రూ.59,81,505 పరిహారం కింద చెల్లించబడినట్టు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డీ.కిరణ్ కుమార్, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ మల్కాజిగిరి ప్రెసిడెంట్ కోట రామచంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాజు యాదవ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జానకి పాల్గొన్నారు.

డీపీఎస్, పల్లవి స్కూల్ ఉద్యోగుల స్పోర్ట్స్ టోర్నమెంట్



నవతెలంగాణ-నాచారం

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఇన్నోవేటివ్ హబ్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మోడల్ స్కూల్ మేనేజ్మెంట్ సహకారంతో ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 8, 9 తేదీల్లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించినట్టు డీపీఎస్, పల్లవి గ్రూప్ విద్యావ్యవస్థల సీఓఓ మల్కా యశస్వి తెలిపారు. స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయన్నారు. ఉద్యోగులు నిత్యం విధి నిర్వహణలో ఉంటూ మానసిక ఒత్తిడి నుంచి దూరమై ఉల్లాసంగా, ఉత్సాహంగా పనిచేసేందుకు క్రీడలు ఎంతో ఉత్సాహానిస్తాయన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ బ్యాట్మెంటల్ స్పోర్ట్స్ మీట్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మోడల్ స్కూల్ ఉద్యోగులు హాజరయ్యారు. బోయిన్‌పల్లి పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేణు చక్రవర్తి, అల్వాల్ పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిమినాగి, గండిపేట పల్లవి ఇనిస్టిట్యూట్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమ మాడభూషి, సికింద్రాబాద్ ఏవీఐఎస్ ప్రిన్సిపాల్ వనజ, కీసర పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రోజ్, బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తనూజ పాల్గొని క్రీడల నిర్వహణ, స్పోర్ట్స్ మీట్‌ను పర్యవేక్షించారు. స్పోర్ట్స్ మీట్‌లో నాచారం డీపీఎస్ బ్యాట్మెంటల్ సుజాత, పంబతి, నీతూ పాండే మొదటి స్థానంలో విజేతగా నిలవగా, రెండో స్థానంలో డీపీ ఎస్ ఎయిరోసిటీ నుంచి మాచర్ల చైతన్య బిందు ప్రియ విజయం సాధించారు. మూడో స్థానంలో నాచారం డీపీఎస్ నుంచి అశ్వాతి రాజగోపాలం, ఇంద్రజిత్తు కౌరిక్ గెలుపొందారు. క్రికెట్‌లో 12 టీంలు తలపడి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఇన్నోవేటివ్ నుంచి మల్కా యశస్వి గెలుపొందగా గండిపేట పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గౌరవ్ నిలిచారు. క్రీడల్లో ప్రతిపాదన పరిచిన వారందరినీ చైర్మన్ మల్కా కొమరయ్య ఘనంగా సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మోడల్ స్కూల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సికింద్రాబాద్ కోర్టులో థ్రాడ్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భగా వివిధ బ్యాంకులకు సంబంధించి 65 సివిల్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా థర్డ్ సీనియర్ సివిల్ జడ్జి కె.స్వప్న మాట్లాడుతూ ఇలాంటి అవకాశాన్ని కక్షిదారులు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



దోబీఘాట్ ఏర్పాటు చేయండి



నవతెలంగాణ-కంటోన్మెంట్

మాజీ సభ్యుడు ప్యారాసాని శ్యామ్ కుమార్ అధ్వర్యంలో వార్డ్-7కు చెందిన రజక, నాయీ బ్రాహ్మణ సామాజికవర్గాల వారు శుక్రవారం బీఆర్ఎప్ మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కూడా ఇప్పించాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. గన్‌రాక్ కాలనీలో రోడ్లు, డ్రయినేజీ, పార్కును డెవలప్ చేయాలని కోరారు. సాధ్యమైనంత కృషి చేస్తానని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా సుపరిపాలనా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిదనీ, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ ఉద్యోగులను కడపులో పెట్టుకుని చూసుకుంటున్నారని మేయర్ మేకల కావ్య అన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సుపరిపాలన దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కమిషనర్ రామలింగం, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆర్వో ప్రభాకర్ యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టరేట్ : దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో భాగంగా చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వామి, వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, వెంకటేశం, కౌన్సిలర్లు కొత్త సురేఖ, వరగంటి వెంకటేష్, వసుపతి రమేష్, రామారం శ్రీహరి గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు వహిదా బేగం, నాయకులు వసుపతి శ్రీకాంత్ గౌడ్, సంపన్ బోల్ హరి గౌడ్, కొత్త భాస్కర్ గౌడ్, మహ్మద్ ఖాజా మియా, ప్రజా ప్రతినిధులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు పాల్గొన్నారు.



నాగారం మున్సిపాల్టీలో..

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వాణి, వైస్ చైర్మెన్ బండారి మల్లేశ్ యాదవ్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కార్యాలయ మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక చేయూత



నవతెలంగాణ-నాచారం

ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం నేనున్నానంటూ వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి సహకారంతో నాచారంకు చెందిన వెంకటేష్ కుమార్తె పల్లవి ఉదేయిని ఇంటర్మీడియట్ ట్యూషన్ ఫీజును అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థుల చదువులకు అండగా నిలుస్తూ అన్ని తానై చూసుకుంటున్న బండారి లక్ష్మారెడ్డి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఉప్పల్ నియోజకవర్గానికే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేయడం అభినందనీయం అన్నారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సాయం అందించడం ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, నాయకులు కట్టబుచ్చి గౌడ్, గద్ద యుగేందర్, శంకర్ పాల్గొన్నారు.

భవన్స్ కళాశాల రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ భవన్స్ స్కూల్ వద్ద పర్యటించారు. ఈ సందర్భంగా స్కూల్ మెయిన్ గేట్ దగ్గర రూ.29 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వేలాది మంది విద్యార్థులు భవన్స్ కళాశాలకి వెళ్లడానికి అనువుగా ఉంటుందని చెప్పారు. కాలనీ వాసులకి చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఈ రోడ్డు పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఆర్ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, మహేష్, కె.వి.రావు, చౌదరి, ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్, మహేష్, సాయిగౌడ్, రాజేష్, రాజు, రఘుపతి రెడ్డి, నారాయణ రెడ్డి, కిషోర్, ఉత్తమ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, దేవేందర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల నిర్మాణంలో నాణ్యత డొల్ల



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ శాంతి గార్డెన్ వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా చేపడుతున్న పైపులైన్ల నిర్మాణం పనులు డొల్లతనంగా ఉన్నాయని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌కు స్థానికులు ఫిర్యాదు చేయగా శనివారం పైపులైన్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వకుండా పైప్ లైన్లు ఏర్పాటులో అక్రమంగా డ్రయినేజీ కనెక్షన్లను ఇచ్చారు. దీంతో వర్షాకాలం వస్తే మంచినీటిలో డ్రయినేజీ కలుషితమై ప్రజలు ఇబ్బందులకు గురవుతారనీ, తక్షణమే వర్షపు పైపు లైన్ నిర్మాణానికి దూరంగా మంచినీటి పైప్లైన్ ఏర్పాటు చేయకపోతే నాచారం మరో బోలకపూర్‌గా మారుతుందన్నారు. తక్షణమే జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పర్యవేక్షించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని పైప్లైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, చంద్రశేఖర్, కట్టబుచ్చి గౌడ్, రఫీక్, లక్ష్మణ్, శేఖర్ యాదవ్, శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలు, ఇతర సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోండి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తాజాగా బీసీ రుణాల మంజూరులను దృష్టిలో ఉంచుకుని నేరుగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మల్కాజిగిరి మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. రాబోయే పాఠశాలలు/కళాశాలల పునర్ ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ ల కోసం ప్రభుత్వం నిర్దేశించిన రుసుంతో నేరుగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులం ఆదాయం, నివాసం, ఓబీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను పొందవచ్చన్నారు.

రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వద్దు : ఏసీపీ శంకర్‌రాజు



నవతెలంగాణ-అంబర్‌పేట్

వాహనదారుల్లో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారనీ, మరికొందరు రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడంతో రోడు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని ఏసీపీ జి.శంకర్ రాజు తెలిపారు. ప్రతి వాహనదారుడూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శనివారం కాచిగూడలోని 'టీఎక్స్ ఆస్పత్రి'లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. యువకులు వాహనాలపై అతివేగంగా దూసుకెళ్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగితే వాహనదారునితోపాటు ఎదురుగా వచ్చేవారికి సైతం నష్టం కలుగుతుందన్నారు. కొన్ని సమయాల్లో పాదాచారులు మృతి చెందుతున్నారని గుర్తు చేశారు. సెల్‌ఫోన్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనాలు నిలుపాలని కోరారు. మైనర్లకు వాహనాలిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఆస్పత్రి హెచ్ఆర్ పద్మ, సీఓఓ కిషోర్, ఇన్‌చార్జి సమీర్, నర్సింగ్ సూపరెంటెండెంట్ సరోజా, రిజ్వాన్, రాజేష్ ఆయా విభాగాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పథకాల అమలులో తెలంగాణ అగ్రస్థానం

జాగృతి నాయకురాలు రాధ



నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర ప్రజల సంక్షేమే లక్ష్యంగా తెలం గాణ ప్రభు త్వం పని చేస్తుందని, సీఎం కేసీఆర్ దూరదృష్టి ఫలి తంగా అభివృద్ధి, సం క్షేమ పథకాలలో దేశంలోనే తెలం గాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని జాగృతి మహిళా నాయకురాలు తొలి దశ మలిదశ ఉద్యమ నాయకురాలు రాధా అన్నారు. శనివారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మా ట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి కేటీఆర్ నగరంలో నూతన సచివా లయం అంబేద్కర్ విగ్రహం రాష్ట్రంలో పేదల సంక్షేమ కోసం దేశంలో ఏ రాష్ట్రం లో అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు అవుతున్నాయని, వికలాంగులకు రూ.1000 పింఛన్ అదనంగా పెంచడంపై హర్ష వ్యక్తం చేశారు.

అప్సరను నమ్మించి హత్య చేసిన సాయి కృష్ణను కఠినంగా శిక్షించాలి

ఐద్వా నేత శశికళ డిమాండ్

నవతెలంగాణ-ధూల్‌పేట్

సరూర్‌నగర్‌లో యువతి అప్సరను అతి క్రూరంగా హత్య చేసిన సాయి కృష్ణను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) హైదరబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై ఆమె మాట్లాడుతూ.. మహిళా లోకానికి తీవ్ర ఆందోళన కలిగించే ది గా ఉన్నదని తక్షణమే రాష్ట్ర హెూం శాఖ మంత్రి జోక్యం చేసుకొని ఈ ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి నిందితునికి త్వరితగతిన శిక్ష పడేలా చేయా లనిఆమె కోరారు. భార్య,పిల్లలు ఉన్న పూజారి దైవ భక్తి తో దేవాలయానికి వచ్చే 30 సంవత్సరాల యువతి అప్సర ను నమ్మించి, మోసం చేసి,తన పరువు కాపాడుకోవడానికి సదరు యువతిని క్రూరంగా హత్యా చేయడం సభ్య సమాజం తలదిం చుకునేలా ఉన్నదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందినక పోతే జిల్లా వ్యాప్త ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు. ఆది వారం బాధి త కుటుంబాన్ని ఐద్వా రాష్ట్ర ప్రతినిధి బృందం కలనున్నట్లు ఆమె తెలిపారు.

బడి పరిశుభ్రత ఎలా..?

- స్కూళ్లలో స్కావెంజర్లు, స్వీపర్లు లేక ఇబ్బందులు
- పాఠశాలల ప్రాంగణాలకే పరిమితమైన జీహెచ్ఎంసీ
- అపరిశుభ్రంగా గదులు, మరుగుదొడ్లు
- పాఠశాలలు ప్రారంభమైతే ..ఇబ్బందులే..!





నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, శానిటేషన్ ప్రశ్నార్థకంగా మారాయి. ఈనెల 12 నుంచి స్కూళ్లు రీ ఓపెన్ నేపథ్యంలో సర్కారు బడుల్లో పారిశుధ్య సమస్య విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో ఆందోళనకు గురిచేస్తుంది. ప్రభుత్వ బడుల్లో పారిశు ధ్య పనులను గతంలో స్కావెంజర్లు, స్వీపర్లు చూసుకునేవారు. అ యితే స్కావెంజర్లు, స్వీపర్లను కరోనా టైంలో ప్రభుత్వం తొలగి ంచ డంతో పాఠశాలల్లో స్వచ్ఛత అధ్వానంగా తయారైంది. మరోవైపు పారిశుధ్య పనులను జీహెచ్ఎంసీకి అప్పగించినా అసలే సిబ్బంది కొరత, ఇంటింటి చెత్త సేకరణతోనే సదరు కార్మికులు సతమతమ వుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు బడుల్లోని ప్రాంగణాలను మాత్రం శుభ్రం చేస్తున్నారు. గదులు, మరుగుదొడ్ల జోలికి పోవడం లేదు. దీంతో ఈ పనుల కోసం ప్రధానోపాధ్యా యులు ఇతరులపై ఆధారపడాల్సిన వస్తుందని చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలో 690 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 1.17లక్షల మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. ప్రభుత్వ పాఠాశాలల్లో పారిశుధ్య పనులకోసం స్కాం ెంజర్లను నియమించింది. పాఠశాలలో 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2500 చొప్పున వేతనంతో నియమించా రు. అతితక్కువ వేతనంతోనే ఈ కార్మికులు నిత్యం పాఠశాలల ప్రాంగణాలు, గదులు, టాయిలెట్లను శుభ్రం చేస్తున్నారు.ఉన్నత పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు కీలకంగా మారాయి. కానీ రెండేండ్ల క్రితం ప్రభుత్వం సర్కారు బడుల్లో స్కావెంజర్లను తొలగించడంతో సుమారు 821 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దీంతో పాఠశాలల్లో శుభ్రత కొరవడింది. స్కూల్స్ ఆవరణ, మరుగు దొడ్లలో దుర్గంధం వ్యాపిస్తోంది. మొన్న టి వరకు పాఠశాలల్లో పరిశుభ్రత ఉపాధ్యాయులదేనని చెప్పిన సర్కారు తర్వాత జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. వారి సిబ్బంది చేతులెత్తేయడంతో బడుల్లో స్వచ్ఛత ప్రశార్థకంగా మారింది. ఉపాధ్యాయులకు పారిశుధ్య నిర్వహణ కష్ట తరంగా మారింది. అయితే టీచర్ల ఒత్తిళ్ల మేరకు పారిశుధ్య నిర్వహ ణను ప్రభుత్వం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఈ పనులను అప్పగించింది. కానీ అప్పటి నుంచి ఎక్కడ కూడా జీహెచ్ ఎంసీ సిబ్బంది అధిక పనిభారంతో నామమాత్రంగానే చేస్తున్నారు. ఇక మరుగుదొడ్ల పరిశుభ్రత తమకు సంబంధమే లేదని తేల్చిచెప్పారు. చేసేదేమిలేక గతంలో ఇదే స్కూళ్లో పనిచేసిన వారిని తిరిగి పిలిచి ఎంతో కొంత డబ్బులు వారికి చెల్లించుకుంటూ పనులు చేపించుకుంటున్నట్టు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు వివరిస్తున్నారు.

స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరిస్తేనే మేలు..

పాఠశాలలను స్వచ్ఛతగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వ పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించిన విషయం తెలిసిందే. గతంలో ఈ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులు చూస్తూ.. దీనికి పాఠశాల గ్రాం టు నుంచి ఖర్చు చేసేవారు. సకాలంలో నిధులు అందక పారిశు ధ్యం అంతంత మాత్రంగా ఉందని గుర్తించిన ప్రభుత్వం సవరిం చిన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ బాధ్యతలను జీహెచ్ ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలు చేపట్టాలని ఉత్త ర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే జీహెచ్ఎంసీకి ఈ అదనపు బాధ్యతలు భారంగా మారాయి. ఇప్పటికే పట్టణ ప్రగ తిలో భాగంగా పారిశుధ్యం, హరితహారం, తదితర పనుల్లో జీహెచ్ ఎంసీ కార్మికులు తీరిక లేకుండా ఉన్నారు. వీరికి బడుల బాధ్యత అప్పగించడంతో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో అమలుకాక అపరిశుభ్రంగా మారుతున్నాయి. సిబ్బంది కొరత, అదనపు పని భారం వల్ల పాఠశాలలకు వచ్చిన కేవలం బడి ఆవరణ మాత్రమే క్లీన్ చేస్తున్నారు. అదికూడా కొన్నిచోట్ల మాత్రమే జరుగుతోంది. దీంతో పాఠశాలల ప్రాంగణాలు, గదులు, మరుగుదొడ్లు అధ్వా నంగా తయారైవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పాఠశాలలు ప్రారంభమైతే ఎలా..?

పాఠశాలలో ఇటు స్వచ్ఛ కార్మికులు లేక.. అటు జీహెచ్ఎంసీ కార్మికులు రాక బడుల ప్రాంగణాలు చెత్తచెదారంతో నిండిపోతు న్నాయి. మూత్రశాలల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పా టు దుర్గంధం వ్యాపిస్తోంది. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారుతున్నాయి. వాస్తవానికి ఈ స్కావెంజర్లు ఆవరణాలు, తరగతి గదులు, మూత్రశాలల పరిశుభ్రతలో కీలకంగా ఉండేవారు. ప్రభుత్వం వీరిని తొలగించడంతో ప్రస్తుతం స్కూళ్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఎల్లుండి నుంచి పాఠశాలలు ప్రారంభమైతే పరిశుభ్రత ఎట్లా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరణ అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

న్యాయం కోసం కోర్టుకు 'క్యూనెట్' బాధితులు

- క్యూ నెట్ బాధితుల జేఏసీ కన్వీనర్, ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిరుద్యోగులను మోసగించే ఉద్దేశ్యంతో 'క్యూనెట్' కం పెనీ మోసపూరిత కార్యకలాపాలను నిషేధించి దాని యాజ మాన్యంపై కఠిన చర్యలు తీసుకుని తాము పెట్టిన పెట్టుబ డులను వాపసు ఇప్పించి న్యాయం చేయాలని జేఏసీ కన్వీ నర్, ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు.శనివారం రాష్ట్రంలోని క్యూనెట్ బాధి తులు హైద రాబాద్, సిటీ క్రిమినల్ కోర్ట్‌ను ఆశ్రయిస్తున్నా ంని క్యూనెట్ బాధితుల హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యా లయంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ స భ్యులు, ప్రముఖ న్యాయవాది డా.సోలొమన్ రాజు న్యాయ వాదుల బృందం క్యూనెట్ బాధితులకు ఉచిత న్యాయ సలహా అం దించారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో దాదాపు 300 మంది క్యూ నెట్ బాధితులు న్యాయం కోసం కోర్ట్‌కు వెళ్లా లని నిర్ణయించి వ్యక్తిగతంగా తమ పిటిషన్లను డా.సోలొ మన్ రాజుకు అందజేశారు. డాక్టర్ దిడ్డిసుధాకర్ మాట్లా డుతూ..కోట్లాది రూపాయల క్యూ నెట్ భారీ కుంభకోణం కేసులో హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు వేగంగా స్పందించి, విచారణ జరిపి క్యూ నెట్ అధికా రు లను అరెస్ట్ చేయడం అభినందనీయమని, అరెస్ట్ అనం తరం బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి బాధితుల పెట్టుబ డులను వాపసు ఇప్పించాలని కోరారు. బాధితులు సత్వర న్యాయం కోసం సిటీ క్రిమినల్ కోర్ట్ ఇంప్లీడ్ పిటిషన్‌లను దాఖలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.అనంతరం డా.సోలొ మన్ రాజు మాట్లాడుతూ..ఎలాంటి ఫీజులు తీసు కోకుండా మొత్తం క్యూ నెట్ బాధితులకు న్యాయం జరిగే వరకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామని తెలి పారు.ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు మాథ్యూ, సుందర్ జేమ్స్, ఆప్ నేతలు జావీద్ షరీఫ్, ఎండి.మజీద్, పాల్గొన్నారు.

చిట్ ఫండ్స్‌లకు అధికారులు వత్తాసు పలకడం ప్రభుత్వ తప్పిదమే



తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

నవతెలంగాణ-బంజారాహిల్స్

చిట్ ఫండ్స్ చీట్స్ ప్రభుత్వ తప్పిదమేనని, కనకదుర్గ, అక్షర ఇతర చిట్ ఫండ్స్ వానిరి అధికారులు, నాయకులకు వత్తాసు పలుకుతూ కేసులు నమోదు చేయకుండా కాల యాపన చేయడం సమంజసం కాదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. లక్షల వసూలు చేసుకొని ఎవరితో చెప్తారో చెప్పండి అంటూ బెది రిం పులు చేయడం ఏంటని ప్రశ్నించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో బాధితులతో కలిసి మాట్లాడారు.చిట్ ఫండ్స్ చీట్స్ ప్రభుత్వ తప్పిదమేనని ఆమె అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చీట్స్ నడిపే వారు ఇతర వ్యాపారాలు చేయడానికి ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. కావలసిన నగదు ఇవ్వమంటే చిట్టి ఎత్తకుండా వచ్చిన మొత్తాన్ని డిపాజిట్ చేస్తే వడ్డీ ఇస్తామని చెప్పిన వారు అసలు వడ్డీ రెండు ఇవ్వ లేము కేవలం తమ వద్ద ఉన్న ప్లాట్స్ తీసుకోవాల న్నా రు.అది కూడా మార్కెట్ రేటుకంటే ఎక్కువ ఉంది ఇంతటి దారుణం చోటు చేసుకుంటే ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్న బాధితులకు న్యాయం చేయాలని దీనిపై ప్రత్యేక పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేసి దోషులను త్వరగా పట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పశ్య పద్మ, కరీం నగర్ జిల్లా బాధి తులు జి రజిత,జి రవిందర్, వరంగల్ నుంచి అనిల్కు మార్, గీత, నరేష్, మల్కాజ్ గిరి అరుణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

భవన నిర్మాణ కార్మికులకు, ఇతర కార్మికులకు పనులు లేకుండా పోయాయని, ప్రభుత్వం కార్మికులకు అందరికీ పట్టణ ఉపాధి చట్టాన్ని వెంటనే అమలుపరచి పనులు కల్పించాలని, జూబ్లీహిల్స్ జోన్ సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. అశోక్ మాట్లాడుతూ, దేశంలో మాం ద్యం, సంక్షోభం అనేక ఇబ్బందికర పరిస్థి తులు రాబోతు న్నాయని, భవన నిర్మాణ కార్మికులకు పను లు లేకుండా పోయాయి. పట్టణ ఉపాధి పథకాన్ని ప్రభు త్వం వెంటనే కల్పించాలని, హైదరాబాదు నగరంలో ఉన్న కార్మికులం దరికీ పనులు కల్పించాలని కోరారు. అనంతరం కృష్ణానగర్ లేబర్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకో వడం జరి గింది. యూనియన్ అధ్యక్షులుగా రఘు, ఉపాధ్య క్షులుగా బి.కుమార్, బి.నాయుడు కార్యదర్శిగా సుమన్, సహాయ కార్యదర్శిగా బ్రహ్మయ్య ,రాంబాబు, కోశాధికారిగా సురేష్ కమిటీ సభ్యులుగా శ్రీను, టి.బాబు, సిహెచ్ కుమార్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పసి బాలుడిని రోడ్డుపై వదిలి వెళ్లిన తల్లి

నవతెలంగాణ-బంజారాహిల్స్



14సంవత్సరాల బాలిక 7నెలల బాలుడికి జన్మనిచ్చిన సంఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. శనివారం పురిటినొ ప్పు లతో నిలోఫర్ ఆస్ప త్రిలో బాలిక జాయిన్ అయ్యింది. ప్రసవం అయిన అనంతరం ఓ ఇంటి వద్ద ఎజు పుట్టి న పసిబిడ్డను ఓ ఇంటి ముందు రోడ్డుపై పడేసి ఏమీ తెలియనట్లు బాలిక వెళ్లిపోయింది. బొడ్డు పేగుతో శిశువు అలానే పడి ఉండడంతో స్థానికుల సమాచారంతో ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నందమూరి బాలకృష్ణ సేవాగుణం కలిగిన వ్యక్తి



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.మానవజన్మ మళ్లీమళ్లీ రాదు వచ్చిన జన్మలోనే సేవ చేయని వారు అసలు వ్యక్తిత్వం ఉన్న వ్యక్తే కాదని నటుడు ఎమ్మెల్యే క్యాన్సర్ ఆస్పత్రి చైర్మెన్ నంద మూరి బాలకృష్ణ అన్నారు. ముందుగా ఆస్పత్రిలోని బసవ తారకం స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహా లకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన ఆస్పత్రి లోని రోగులు చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న సమయంలో ఓ మహిళ తనకు సహకారం అందించాలని కోరగా వెంటనే ఆమెకు కావలసిన వైద్య సేవలను ఆసు పత్రిలో ఉచితంగా నిర్వహించాలని కోరారు. ఆరోగ్యశ్రీలో కొంతమేరకే ఇస్తున్న నిధులు అందరికీ సరిపడలేకపోవ డం తో ఆసుపత్రిలో దాతల సహకారంతో కొనసాగుతున్న ఈ ఆసుపత్రి వారికి అత్యంత ఖర్చుతో కూడిన వైద్యం కూడా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం కార్య క్రమానికి హాజరైన సిబ్బంది, వైద్యులు, రోగులు, అభిమా నుల నుద్దేశించి మాట్లాడుతూ ప్రతి పుట్టిన రోజు తనకున్న బాధ్యతలను గుర్తు చేస్తుందన్నారు.పేదవారికి అందుబాటు ధరలలో నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో నెలకొ ల్పిన ఈ ఆస్పత్రిలో లాభాపేక్ష లేకుండా కేవలం సేవాదృక్ప ధంతో సేవలు అందిస్తోందని అంటూ భవిష్యత్తులోనూ నిరంతరాయం ఈ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు.ఈ కార్యక్రమాలలో సీఈఓ డా.ఆర్.వి.ప్రభా కరరావు, అసోసి యేట్ డైరెక్టర్, అకడమిక్స్, యాడ్ లైఫ్, డా.కల్పన రఘునాథ్,ఎం ఎస్,డా.ఫణి కోటేశ్వర రావు, మెడికల్ సూపరింటెండెంట్,హెడ్, మెడికల్ ఆంకాలజీ విభాగం, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



- పీసీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్
- స్థానికులకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని మాణిక్‌రావు ఠాక్రే కు విన్నపం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ పీసీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రేను కలిసి గోషామహల్ నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని వివరించారు. గోషామాల్ నియోజకవర్గంలో పార్టీనే నమ్ముకుని గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ కోసమే పని చేస్తున్నామన్నారు. స్థానికులకే గోషా మహల్ నియో జకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆయ నకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూ లంగా స్పందించారని తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రె స్ బలంగా ఉందని కార్యకర్తలు అందరూ పార్టీ అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పాదయాత్ర చేపడుతామని వెల్లడిం చారు. గోషామహల్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

డ్రయినేజీ సమస్యలపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

నవ తెలంగాణ. అంబర్ పేట: డ్రైనేజీ సమస్యలపై అధికారులు దృష్టి సారి ంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజ య్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని ఎంసీహెచ్ కాలనీలో స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్ కార్పొరేటర్ దృష్టికి కాలనీ ప్రజలు డ్రయినేజీ సమస్యను వివరించగా వెంటనే సమస్యను పరిశీలించి సంబంధిత సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ ఉమేష్, స్థానిక బస్తీ ప్రజలు రహీం,లాహపూర్, జహంగీర్, నజీమ్, గని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రంగు సతీష్ గౌడ్, రఫిక్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో అగ్రగామిగా సికింద్రాబాద్ : పద్మారావు

నవతెలంగాణ-ఓయూ

అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్ర మాల్లో కుడా సికింద్రాబాద్‌ను అగ్రస్థానంలో నిలుపుతున్నా మని, గత ఏడాది కాలంలో జీహెచ్ఎంసీ ద్వారా రూ.67 కోట్లు, జలమండలి ద్వారా రూ.6 కోట్ల నిధులతో వివిధ పనులను ప్రారంభించామని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మా రావు గౌడ్ అన్నారు.మెట్టుగూడ, సితాఫలమండీ డివిజన్ ల పరిధులలో శనివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రారంభించారు. లైన్ బజా ర్ మసీద్ సమీ పంలో రూ.6 లక్షల ఖర్చుతో సివర్ లైన్, మైలారగడ్డలో రూ.6.18 ఖర్చుతో సివర్ లైన్, జోషి కాం పౌండ్‌లో రూ.6.5 లక్షల ఖర్చుతో పవర్ బోరింగ్ ఏర్పాటు పనులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ప్రారంభించారు. కార్పొరేటర్లు కుమారి సామల హేమ, రాసూరి సునీత కంది శైలజ, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.కృష్ణ బీఆర్ఎస్ యువనేత కిషోర్‌కుమార్‌గౌడ్‌లతో పాటు అన్ని విభాగాల అధికారులు, నేతలు, స్థానిక సంఘాల ప్రతిని ధులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 50 సంవత్సరాల్లో ఎన్నో పనులను కేవలం గడచిన ఎనిమిదేళ్ళ వ్యవధిలోనే చేప ట్టా మని, తుకారం గేటు ప్రాంతంలో ఆర్‌యుబీ నిర్మించిన ఘ నత తమదే నన్నారు. మనికేశ్వరి నగర్, చిలకలగుడా ఆర్ యుబీల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరయ్యాయని తెలి పారు. సికింద్రాబాద్‌తో పాటు నగరంలో ఆదర్శంగా నిలి చేలా సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని సితాఫలమండీలో ఏర్పాటు చేశామని తెలిపారు.

సీతాఫల్‌మండిలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, బోయ బస్తీ, మధుర నగర్ కాలనీలో ఫంక్షన్ హా ల్‌లను నిర్మించి, కళ్యాణ వేదికలను అధునాతన హంగు ల తో నిర్మించామన్నారు. రూ.6 కోట్ల ఖర్చుతో స్విమ్మింగ్ పూ ల్ నిర్మిస్తున్నామని, ఇప్పటికే ప్రారంభించిన వివిధ పనుల ను వాటిని వెంటనే పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశిం చారు.జోషికాంపౌండ్‌లో తన పర్యటన సందర్భంగా స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిని మార్చొద్దు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

పోలీస్ స్టేషన్ నూతన జోన్లను ఏర్పాటు చేయడంలో ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిని మార్చవద్దని స్థానిక బస్తీ వాసులతో పాటు టీఆర్ఎస్ కాంటెస్ట్ కార్పొరేటర్ రాఘ వేంద్ర రాజు బీజేపీ సీనియర్ నాయకుడు సిమెంట్ శ్రీని వాస్, ఉప్పుగూడ మహంకాళి దేవాలయం చైర్మెన్‌లు అన్నా రు. శనివారం ఉప్పు కూడా జెండా చబ్రాస్తా వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేయడంతో చాంద్రా యణగుట్ట, ఛత్రినాక, శాలిబండ, ఫలకనుమ, సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలు మార్పినట్లు, ఈ మార్పుల వల్ల కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని బస్తీ వాసులు వాపోతున్నారన్నారు. బస్తీవా సులు చిత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిని సంతోష్‌నగర్‌లోకి చంద్రన్నగుట్టలోకి మార్చడంతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రుద్ర రాఘవేంద్ర రాజు మాట్లాడుతూ.. ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మా బస్తీలకు చాంద్రాయణ గుట్ట నాలుగు కిలోమీటర్ల అవుతుం దని, ఛత్రినాక పోలీస్ స్టేషన్ తమ సమీపంలో కూత వేట దూరంలో ఉంటుందని మాకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెళ్లి చెప్పుకోవడానికి దగ్గరలో ఉంటుందని తెలిపారు. మా బస్తీలను రాఘవేంద్ర నగర్, ఉప్పు గుడా, లలితాబాగ్, శివ సాయి నగర్, అరుంధతి కాలనీ, హనుమాన్ నగర్ ప్రాం తాలను ఛత్రి నాక పరిధిలోనే ఉంచాలన్నారు. సిమెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొన్ని దశబ్దాలుగా ఛత్రినాక పోలీ స్‌స్టేషన్ బస్తీలో ఉంటూ ఇక్కడ బోనాలు గణేష్ మండ పా లు నిర్వహణ ఊరేగింపు వంటి వాటితో పాటు బస్తీవా సులకు ఎలాంటి సమస్యలు ఉన్న మాకు అతి దగ్గరలో ఉం దన్నారు. ప్రస్తుతం ఉన్న ఈ పోలీస్ స్టేష న్ వదిలి ఎక్కడో దూరంలో ఉన్న చాంద్రాయణ గుట్టలో మా సెక్టర్ ను కల పడం సరికాదన్నారు. ఈ స్టేషన్‌లో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో విభజించడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్ర మంలో మసూదన్ గౌడ్,పెండెంలక్ష్మణ్, బస్తీ వాసులు లతో కలిసి ఛత్రినాక పోలీస్ స్టేషన్ కు బయ లుదేరి సౌత్ జోన్ డీసీపీ చైతన్య కుమార్, ఫలక్ నుమా ఏసీపీ జహం గీర్, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ సమక్షంలో వినతి పత్రం అందజేశారు.

దేశంలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్

స్వరాష్ట్రంలో తొలిగిన తాగునీటి కష్టాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఈ ఏడాది ఆగస్టు చివరినాటికి హైదరాబాద్ నగరంలో ఉత్పన్నమ య్యే ప్రతి మురుగునీటి చుక్కను శుద్ధి చేయ బోతున్నామని పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు తెలి పారు. ఫలితంగా దేశంలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్ అవతరిస్తుందని పునరు ద్ఘాటించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనున్న వార్డు కార్యాలయాల సిబ్బం దితో హైటెక్స్‌లో ఇంటరాక్షన్ సెషన్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండీ దాన కిశోర్, ఇ.డీ.డాక్టర్ సత్యనారాయణతో పాటు ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ నగరంలో గతంలో తాగునీటి కష్టాలు ఉండేవని, స్వరాష్ట్రంలో ఆ బాధలన్నీ తొలగి పోయాయ న్నారు. జలమండలి ఆధ్వర్యంలో రూ.3866 కోట్లతో కొత్తగా 31 ఎస్టీపీలు నిర్మిస్తున్నామని, ఇవి అందుబాటులోకి వస్తే మురుగు శుద్ధి సామర్థ్యం 2 వేల ఎంఎల్డీలకు చేరుతుందన్నారు. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 9 శాతం మాత్రమే మురుగు శుద్ధి చేస్తున్నారన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇందులో జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్తు బోర్డు, తదితర ప్రధాన విభాగాల నుంచి ఒక్కరు చొప్పున మొత్తం 10 మంది అధికారులు ఉంటారని, వారు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారః పేర్కొన్నారు. అందులో పనిచేసే సిబ్బంది ప్రజలతో మమేకమై ముందుకెళ్లాలనికోరారు.జలమండలి ఎండీ దానకిశోర్ మాట్లాడారు. దేశంలో ఏ నగరానికి లేని తాగునీటి వసతులు మన హైదరాబాద్‌లో ఉన్నాయ న్నారు. వార్డు కార్యాలయాల్లో జలమండలి తరపున పనిచేసే సిబ్బంది (వార్డు అసిస్టెంట్లు) ప్రజల పట్ల బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జీహెచ్ఎంసీ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పురపాలకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, సీడీఎంఏ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాగర్జన పోస్టర్ ఆవిష్కరణ

తార్నాక డివిజన్ కార్యదర్శి షేక్ లతీఫ్



నవతెలంగాణ-ఓయూ

బీజేపీ హటావో దేశ్ బచావో అంటూ సీపీఐ జాతీయ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి సీపీఐ కార్యక్ర మం ముగింపు బహిరంగసభ 11వ తేదీన కొత్తగూడెంలో జరుగుతున్నదని సిపిఐ తార్నాక డివిజన్ కార్యదర్శి షేక్ లతీఫ్ తెలిపారు. బహిరంగ సభ పోస్టర్ తార్నాక డివిజన్ లాలపేట లేబర్ అడ్డాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ లతీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తిరోగమన నిర్ణయాలతో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని తద్వారా భవిష్యత్తులో ప్రజలు అనేక ఇబ్బందు లకు గురవుతారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కర్ణాటక ప్రజల లాగా బిజెపికి కర్రు కాల్చి వాత పెట్టి దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపు ఇచ్చారు. కొత్తగూడెం బహిరంగ సభకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్ర మంలో సిపిఐ తార్నాక డివిజన్ సహాయ కార్యదర్శి గువ్వల మల్లేశ్, నం ంసింహ, దస్తగిరి, సారయ్య, లక్ష్మయ్య, గోపాల్, ఉపేం దర్, శీను,నరసయ్య,కృష్ణయ్య, యాకయ్య, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.

ప్రమాద రోగులకు ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ కోర్సు దోహదం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఎద్దైన ప్రమాదం జరిగినప్పుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వెను వెంటనే నయం చేసేందుకు ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ కోర్సు ఎంతగానో దోహద పడుతుందని ఏపీ మాజీ డీజీపీ సయ్యద్ అన్వర్ ఉల్ హు దా అన్నారు. నాంపల్లి కేర్ ఆసుపత్రిలో ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ కోర్సు రెండు రోజుల జాతీయ సదస్సును సయ్యద్ క్షమాన్ హుస్సేన్తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ కోర్సు నేర్చుకున్న వైద్యులు, నర్సులు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కోర్సుపైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ-2003 పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వు ల ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయా లని ఎమ్మెల్సీలు రఘోత్తమ్ రెడ్డి, ఏవీఎం రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీ-2003 పాత పెన్షన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రఘో త్తమ్ రెడ్డి, ఏవీఎం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2004 జనవరి ఒకటో తేదీ నుండి కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని అమలులోకి తెచ్చిందని 2004 జనవరి 1 తేదీకి ముందే రాత పరీక్ష ఫలితాలు పూర్తయి నియామక ప్రక్రియలో జాప్యం కార ణంగా సీపీఎస్ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని శాఖల్లో అమలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపా ధ్యాయులను పాత పెన్షన్ విధానంలోనే కొనసాగించాల న్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాప్యం వల్ల ఆల స్యంగా ఉద్యో గాలలో సిపిఎస్ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెసులుబాటు కల్పించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు.డ అధ్యక్షులు వినోద్ ,ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర నాయకులు శంకర్ ,రవీందర్, రమేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలందించాలి

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోగల లహరి ఎస్టేట్స్, ప్రగతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు అయిన గండికోట దోశ ఫ్లేవర్స్ ఆఫ్ రాయలసీమ బ్రేక్ఫాస్ట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను, నీలా గోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్ , సురేష్ రెడ్డి , సినీ దర్శకులు అనీల్ రావిపూడితో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు అంజన్ రెడ్డి వారి స్నేహితులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి, స్థానిక నాయకులు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు పై ఏర్పడ్డ గుంతలు పూడ్చివేత

- ట్రాఫిక్ సీఐ నర్సింహ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ చెక్ పోస్ట్ నుండి మజీద్‌పూర్ ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను డబర్ కాంక్రీట్‌తో ట్రాఫిక్ సీఐ నర్సింహ రెడ్డి శనివారం సిబ్బంది సహాయంతో పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఏలాంటి ఇబ్బందులు పడకుండా రోడ్డు ప్రమాదాలు నివారిం చడానికి రోడ్డుపై గుంతలను పూడ్చి మరమ్మత్తులు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. తనే స్వయంగా పారతో గుంతలను పూడ్చడం చూసి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నర్సింహ రెడ్డి, ఏఎస్ఐ వెంకటేష్ గౌడ్, కానిస్టేబుల్ యాదగిరి పాల్గొన్నారు.

ఆహ్లాదం.. పచ్చదనం పరవల్లు..'జూ వైవిధ్యం'

- ఆకట్టుకుంటున్న ఎంక్లోజర్లు
- సందర్శకుల సందడి
- రాష్ట్ర, నగరానికి తలమానికం

నవతెలంగాణ-ధూల్‌పేట్



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవనంలో హాయిగా చక్కటి ప్రకృతిలో సేద తీరడం అనేది మానవుడికి అతి కష్టంగా మారుతోంది. బిజీలైఫ్‌లో ప్రతీ విషయం దాదాపుగా కృత్రిమ పరిస్థితుల్లో జరుగుతోంది. ఎల్ఈడీ లైట్ల మధ్య ఆఫీసుల్లో, ఇళ్లల్లో నే కాలం వెల్లదీయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అడవిలో పచ్చటి వాతావరణంలో జీవిస్తున్న వన్యప్రాణులను చూస్తే మనసుకు ఎంత ఉల్లాసం కలుగుతుందో మాటల్లో వర్ణిం చనక్కర్లేదు. అలా ప్రకృతి వనంలో దొరికే అనుభూతులను హాయిగా ఆనందించడంతో పాటు ఆ జ్ఞాపకాలను మదిలో బంధించాలనుకుంటే మీరు తప్పకుండా సందర్శించాల్సిన ప్రదేశం 'నెహ్రూ జూ లాజికల్ పార్కు'. హైదరాబాద్ నగరంలోని ఈ అరుదైన జంతు ప్రదర్శనశాల నగరానికి తలమానికంగా నిలుస్తోంది. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరు మీదున్న ఈ జంతు ప్రదర్శనశాలకు 26 అక్టోబర్ 1959న శంకుస్థాపన చేశారు. అక్టోబరు 12, 1963 నుంచి ఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. వన్యప్రాణుల ఆలవాలంగా, జీవవైవిధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న 'నెహ్రూ జులాజికల్ పార్క్' 380 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. ఈ జంతు ప్రదర్శనశాలలో దాదాపు 1,500 రకాల జాతుల జంతువులు, పక్షులు ఆవాసం ఉండగా, ఇందులో 196 భిన్న జాతులుండటం విశేషం. మొత్తంగా 2,200 వన్యప్రాణులు ఈ పార్కులో ఉన్నాయి.

వినోదం, విజ్ఞానం...

అడవిలో ఉండే వన్యప్రాణులన్నింటినీ దాదాపుగా ఈ నెహ్రూ జూ పార్కులో సందర్శకులు వీక్షించొచ్చు. పిల్లలతో పాటు పెద్దలు పార్కులోని సరీసృపాలు, పక్షులు, జింకలు, ఇండియన్ రైనో, ఒంటెలు, హిప్పోపోటోమస్, చిలుకలు, టైగర్, లయన్, పైథాన్, మొసళ్లు, కొండ చిలువ వంటి ఎన్నో వైవిధ్యమైన జాతుల జంతువులన్నింటినీ హాయిగా చూడొచ్చు. నేచరల్ అట్మాస్పియర్‌లో అవి హాయిగా అటు ఇటు తిరుగుతుండగా సందర్శకులు వాటిని చూసి ఫొటోలు తీసుకోవచ్చు. ఉల్లాసంగా కేరింతలు కొట్టవచ్చు. ముఖ్యంగా పిల్లలకు వన్యప్రాణులకు సంబంధించిన చిత్రాలను తల్లిదండ్రులు సోషల్ మీడియాలోనో, ఇంటర్ నెట్‌లోనో కాకుండా చక్కగా రియల్ గా చూపించొచ్చు. అలా వారికి విజ్ఞానం, వినోదం రెండూ ఒకే చోట లభిస్తాయి.

లిబుల్లి ట్రైన్‌లో జూ అంతటా షికారులి

నెహ్రూ జూపార్కులో ఏనుగు మీద స్వారీలు, టైగర్ సఫారీ కూడా అందుబాటులో ఉన్నాయి. జూ ప్రాంగణంలోని 'నేచురల్ హిస్టరీ మ్యూజియం' సందర్శకులకు విజ్ఞానాన్ని అందిస్తోంది. వివిధ రకాల ఎన్‌క్లోజర్లలోని వన్యప్రాణులను చూసి పిల్లలు ఎంజాయ్ చేయొచ్చు. బటర్ ఫ్లై పార్క్, స్నేక్ పార్క్ పిల్లలను బాగా అలరిస్తాయి. ఈ జూలో స్వదేశీ జంతువులే కాక విదేశీ జంతువులు కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. మధ్య ఆఫ్రికాకు చెందిన చింపాంజీలు, ఆఫ్రికా సింహం, రకరకాల కోతులు, ఖడ్గమృగాలు, చిరుతలు, సింహాలు, పులులు, ఏనుగులు చూసి సందర్శకులు ఆశ్చర్యపోతారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. జూలో షికారు చేయడానికి పర్యాటకుల కోసం చిన్నపాటి(బుల్లి) రైలును ఏర్పాటు చేశారు. దీంట్లో కూర్చొని జూ మొత్తం చుట్టేయొచ్చు. సందర్శకులు లోపలికి ఫుడ్ ఐటెమ్స్ తీసుకెళ్లొచ్చు. కానీ, ప్లాస్టిక్ కవర్లను మాత్రం లోపలికి తీసుకెళ్లకూడదు. ప్లాస్టిక్ కవర్లు తీసుకెళ్లడం పార్కులో నిషేధం.

లయన్ సఫారీ..

నెహ్రూ జులాజికల్ పార్కులోని వన్యప్రాణులను చూడటానికి సందర్శకులకు లోపలికి అనుమతి ఉంటుంది. లయన్ సఫారి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది. వ్యాన్ ద్వారా సందర్శకులు గేటు లోపలికి వెళ్లొచ్చు. వ్యాన్ లోపలి నుంచే జంగల్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్న సింహాలు, అడవి ఎద్దులు, ఇతర వన్యప్రాణులను చూడొచ్చు.

వన్యప్రాణులు ఎన్‌క్లోజర్ల ..

పార్కులోని ఓపెన్ ఎన్‌క్లోజర్లలోని వన్యప్రాణులు కొన్ని రాత్రివేళల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దేశంలో ఓపెన్ ఎన్‌క్లోజర్లలో జంతువులను ప్రదర్శించబడుతున్న తొలి పార్కు నెహ్రూ జూలాజికల్ పార్కు కావడం విశేషం. 1974లో సఫారిని ప్రారంభించారు. రాత్రివేళల్లోనూ జంతువులను జనాలకు ప్రదర్శించడం 1987 నుంచి ప్రారంభించారు. నెహ్రూ జూలాజికల్ పార్కుకు సోమవారం హాలీ డే. కాగా, మిగతా అన్ని రోజుల్లో పర్యాటకులు జూకు హాయిగా వెళ్లొచ్చు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ ఓపెన్‌గా ఉటుంది. ప్రస్తుత వేసవి సెలవుల్లో మాత్రం సాయంత్రం 5.30 గంటల వరకు పార్కు ఓపెన్‌గానే ఉంటుంది. ఆసియాలోనే ఉత్తమ జంతు ప్రదర్శన శాల అయిన నెహ్రూ జూ లాజికల్ పార్కులోని వన్యప్రాణులన్నింటి రక్షణకు క్యూరేటర్ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారు. భానుడి ప్రతాపానికి తట్టుకునేందుకు వాటి కోసం సెపరేట్‌గా ఏర్పాట్లు చేయించారు. వాటి ఫుడ్‌కు సంబంధించిన కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ఈ మేరకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తుంటారు. ప్రతీ రోజు సుమారు 5 వేలకు పైగా వస్తుండగా, వీకెండ్స్‌లో 25 వేలకుపైగా మంది నెహ్రూ జూ పార్క్ సందర్శనకు వస్తుంటారు.



వికలాంగుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్

- రూ.1000 పెంచుతూ మరోసారి గొప్ప మనసు చాటుకున్న సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి వికలాంగుల క్షీరాభిషేకం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్రంలో దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ 1000 పెంచుతూ సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు చెందిన దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇప్పటివరకు దివ్యాంగులకు రూ.3116 పెన్షన్ ఇస్తుండగా, దానిని రూ.4116 కు పెంచుతూ వచ్చే నెల నుంచి అమలుకి వస్తుందని సీఎం కేసీఆర్ చెప్పిన నేపథ్యంలో దివ్యాంగుల ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ తమ పాలిట దేవుడని అన్నారు. ఇటీవల కాలంలో కన్నబిడ్డలే చూసుకోని ఈ తరుణంలో నెల నెల పెన్షన్ ఇస్తూ వెయ్యి రూపాయలు పెంచి మాకు పెద్ద కొడుకుల సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నాడని వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరేష్, బొడ్డు వెంకటేశ్వరరావు , మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ తంగా లక్ష్మారెడ్డి , డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంకరయ్య , రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్ , మాజీ అధ్యక్షుడు గౌసుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-దుండిగల్



కొత్తగూడంలో ఆదివారం జరగబోయే ప్రజా గర్జన బహిరంగ సభ విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పాల బిండెల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద వాల్ పోస్టర్ల విడుదల కార్యక్రమం సీపీఐ నాయకులు ఆశి.యాదయ్య అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా సీపీఐ మండల కార్యదర్శి పాలబిండెల శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు, విద్యార్థుల, మహిళల వ్యతిరేక విధానాలను ఎండకట్టడానికే ఈ ప్రజా గర్జన బహిరంగ సభ అని అన్నారు. ఈ సభలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం తీసుకోవలసిన చర్యల గురించి అలాగే ప్రజలు ఎటు వైపు పోవాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తాము అని అన్నారు. కనుక పెద్ద ఎత్తున ప్రజలు కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ బహిరంగ సభ కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రకాశం స్టేడియంలో లక్షకు పైగా జనాభా వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాగ్యమ్మ నర్సమ్మ, యాదమ్మ లక్ష్మీ, నాగమణి, పుష్పమ్మ, అమృతమ్మ పద్మమ్మ, మహేష్, కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రామచందర్ రాజీనామతో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- మంత్రి మల్లారెడ్డి వైఖరితో పార్టీకి ఉద్యమకారులు రామచందర్ యాదవ్ రాజీనామా
- మల్లారెడ్డి తన బంధువర్గానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నరని ఆరోపణ
- త్వరలో అనుచరులతో కాంగ్రెస్‌లో చేరుతా : రామచందర్ యాదవ్
- అసంతృప్తిలో మలిదశ ఉద్యమకారులు



నవతెలంగాణ-శామీర్ పేట

కార్మిక శాఖ మంత్రి చామకుర మల్లారెడ్డి వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ మలిదశ ఉద్యమకారులు బీఆర్ఎస్ నాయకులు చిర్రబోయిన రామచందర్ యాదవ్ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుంకుంట మున్సిపాలిటికీ చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమ కారులు బీఆర్ఎస్ నాయకులు చిర్రబోయిన రామచందర్ యాదవ్ శనివారం తుంకుంటలోని ఓ ఫంక్షన్ హాల్లో విలేకరులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి మల్లారెడ్డి ఒంటెద్దు పోకడలకు హద్దు అదుపు లేకుండా పోయిందని తన బందువర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఉద్యమకారులను, ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులకు విస్మరించారని తమకు జరుగుతున్న అన్యాయాన్ని, అవమానాన్ని పలుమార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని దీనికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. తాను మంత్రి తన్నీరు హరీష్ రావు శిష్యుడిని అయినందుకు ప్రజాసేవలో ముందున్నానని మంత్రి మల్లారెడ్డి ఉద్యమకారులను చిన్నచూపు చూసినా హరీష్ రావు శిష్యుడిని కావడంతో ఇన్ని రోజులు పార్టీలో కొనసాగనని పేర్కొన్నారు. అక్రమ దందాలు చేసి పార్టీకి నష్టం చేసేవారినే మంత్రి ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. తన అనుచరులు, అసంతృప్తి నాయకులు మొత్తం రెండు వేల మందితో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని మంత్రి మల్లారెడ్డిని ఓడించడమే తన లక్ష్యమని రామచందర్ యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎండి జహంగీర్, నర్సింగ్ యాదవ్, ఆగేష్ యాదవ్ పాల్గొన్నారు

నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ పరిధి దుందిగల్ తండా నివాసాలు బీఆర్ ఎస్ పార్టీ నాయకులు జగన్ నాయక్ నూతన గృహ ప్రవేశ కార్య క్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, ధర్మా రెడ్డి, భీమ్ సింగ్, గడిల ప్రవీణ్, మహేందర్ నాయక్ పాల్గోన్నారు.

సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు పున్నారెడ్డి శుభాకాంక్షలు

నవ తెలంగాణ-జగద్గిరిగుట్ట



సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన "పీపుల్స్ మార్చ్" సుదీర్ఘ పాదయాత్ర వేయి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివా రం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సొంటిరెడ్డి పున్నారెడ్డి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. 2024లో కేంద్రరాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభం రానుందని కార్యకర్తలు మనోధైర్యంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లాల్ మొహమ్మద్ ,నాయకులు గఫార్, మండవ శివకుమార్, పున్నన్న , అభిమాన సంఘం అధ్యక్షులు రాజ్ కుమార్, జలీల్ , మహేష్ యాదవ్ ,తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద ప్రజలకు వరం

- బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజలకు వరమని బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్‌కు చెందిన కార్తిక్ (25 సంవత్స రాలు)కాలేయ మార్పిడికి శాసనమండలి విప్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను ఆశ్రయించారు. దీంతో స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి కింద లక్ష రూపాయలు నిధులు మంజూరు చేయించారు. స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ సహకారంతో ఒక లక్ష రూపాయల చెక్కును కార్తీక్ తండ్రి ఎల్లయ్యకు యువ నాయకులు కొలుకుల జైహింద్ శనివారం మగ్దూం నగర్ లోని కార్పొరేటర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో భూదేవి హిల్స్ అధ్యక్షులు పెర్తి విట్టల్ ముదిరాజ్ , పోలేపల్లి శేషారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

ఫతేనగర్ డివిజన్ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ రమేష్ ఈఎన్టీ హాస్పిటల్ వారి సహకారంతో శనివారం భరతనగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ నందు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్ లో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతో దశల వారిగా కాలనీలలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 120 మంది స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని కార్పొరేటర్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించడానికి సహకారం అందించిన గౌడ రమేష్ ఈఎన్టీ హాస్పిటల్ యాజమా న్యానికి, వైద్యులకు కార్పొరేటర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు,గొంతు రుగ్మతలకు సంబంధించిన ఖరీదైన వైద్య పరీక్షలను నిపుణులైన వైద్యం బృందం అధ్వర్యంలో నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చి పూర్తి సహకారం అందించిన గౌడ రమేష్ ఈఎన్టీ హాస్పిటల్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలకు అందుబాటులో డివిజన్ పరిధిలో అన్ని కాలనీలలో ఏర్పాటు చేయడం కొరకు కృషి చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ రమేష్ ఈ ఎన్టీ హాస్పిటల్ కూకట్‌పల్లి వై జంక్షన్ లోని వైద్యులు హాసిని, ప్రకాష్ రావు, మేనేజర్, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

బహ్మోత్సవాల్లో మేయర్ దంపతులు



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిల్ కౌంటీ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లోలి భాగంగా శనివారం నిత్య హెూమం, చతుస్థానర్చనలు, మహా పూర్ణహుతి,అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీలా గోపాల్ రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్లు మేకల వెంకటేష్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల జగదీష్ యాదవ్, ఎన్ఎంసీ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ నాగరాజు యాదవ్,ఆలయ కమిటీ సభ్యులు నారాయణమూర్తి, దుర్గాప్రసాద్, సీతారామారావు, నరసింహ రావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్, గుండ్ల పోచంపల్లిలో ఘనంగా సుపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-మేడ్చల్



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలలో భాగంగా శనివారం మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్యాలయలలో సుపరిపాలన దినోత్సవాన్ని చైర్ పర్సన్‌లు మర్రి దీపిక నర్సింహా రెడ్డి, మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డిలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్‌లు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 10సంవత్సరాలు నిండిన సందర్భంగా సీఎం కేసిఆర్ దశాబ్ది ఉత్సవాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రగతిని సాధించిందని తెలిపారు. పట్టణ ప్రగతి, హరిత హారం, కల్యాణ లక్ష్మి- షాదీ ముబారాక్ రైతు బంధు, రైతు భీమా, దళిత బంధు కేసీఆర్ కిట్, ఆసరా పెన్షన్ లు వంటి పథకాలు భారతదేశానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అనంతరం 11వ వార్డులో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను కౌన్సిలర్ పానుగంటి సుహాసినితో కలిసి చైర్ పర్సన్ ప్రారంభించారు. మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము పరిపాలన విభాగములను పునర్విభజించి ప్రజలకు చేరువైయే విధముగా రాష్ట్రంలోని జిల్లాల సంఖ్యను పెంచి ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాలలో వైస్ చైర్మెన్ చీర్ల రమేష్, మున్సిపల్ కమిషనర్లు టిఎస్ విఎస్ త్రిల్లేశ్వర్ రావు, రాములు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండ ప్రకాష్ ముదిరాజ్ కు శుభాకాంక్షల వెల్లువ


నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ పెళ్లిరోజు పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సారా శంకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు జింకల వెంకటేష్ ముదిరాజ్, సభ్యులు ఆరే రామకృష్ణ ముదిరాజ్, నకీర్తి ఉమేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయనీ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి అన్నారు. శనివారం గురు మూరి నగర్ సంజీవరెడ్డి నగర్‌లోని శ్రీ వినాయక స్వామి ఆలయంలో నవ నాగుల యంత్ర విగ్రహ పునఃప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నరేందర్ రెడ్డి, ఎల్లమ్మ ఆలయం ధర్మకర్త కూతురు నరసింహ పాల్గొన్నారు.

నవతెలంగాణ-బేగంపేట్



నవచిత్రం



నాగబాబు తనయుడు, హీరో వరుణ్‌తేజ్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి నిశ్చితార్థ మహోత్సవం శుక్రవారం నాగబాబు స్వగృహంలో వైభవంగా జరిగింది. చిరంజీవి, పవన్‌కళ్యాణ్, అల్లుఅరవింద్, అల్లు అర్జున్, సాయిధరమ్‌తేజ్, లావణ్యత్రిపాఠి కుటుంబసభ్యులందరూ ఈ వేడుకలో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వయలెన్స్ కా విజిటింగ్ కార్డ్

నందమూరి బాలకృష్ణ హీరో(ఎన్‌బికె 109)గా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.
బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. బాలకృష్ణ, బాబీ కొల్లి, సూర్యదేవర నాగవంశీ పూజా కార్యక్రమాలను నిర్వహించి సినిమాను అధికారికంగా ప్రకటించి, చిత్ర పనులు ప్రారంభించారు. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో స్క్రిప్ట్‌ను దర్శకుడు వి.వి. వినాయక్ తన చేతుల మీదుగా చిత్ర బృందానికి అందజేశారు. దక్షిణ కొరియా గౌరవ కౌన్సెల్ జనరల్ చుక్కపల్లి సురేష్ ముహూర్తపు షాట్‌కి క్లాప్ కొట్టారు. దర్శకుడు గోపీచంద్ మలినేని కెమెరా స్విచాన్ చేశారు. మొదటి షాట్‌కి రచయిత, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ ఎలా ఉండబోతుందో తెలిపేలా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.




సూర్యదేవర నాగవంశీ, బాలకృష్ణ, బాబీ కొల్లి

ఇనుప పెట్టెలో మద్యం సీసా, గొడ్డలి, ఇతర పదునైన ఆయుధాలతో కథానాయకుడి పాత్ర ఎంత శక్తివంతంగా ఉండబోతుందో చెప్పకనే చెప్పారు. 1982 బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న కాన్సెప్ట్ పోస్టర్‌తోనే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు పెరిగేలా చేసింది చిత్ర బృందం. 'వయలెన్స్ కా విజిటింగ్ కార్డ్' అనే లైన్‌తో, అలాగే "ప్రపంచానికి అతను తెలుసు.. కానీ అతని ప్రపంచం ఎవరికీ తెలియదు' అంటూ పోస్టర్ పై రాసి ఉన్న సినిమా ట్యాగ్‌లైన్ అందర్నీ ఆకట్టుకుంటోంది.
ఈ చిత్రాన్ని 2024 ప్రారంభంలో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అలాగే త్వరలోనే దీనికి సంబంధించి మరిన్ని వివరాలను ప్రకటించనున్నారు.

ఇది.. జస్ట్ శాంపిల్ మాత్రమే

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ అనిల్ రావిపూడి, షైన్ స్క్రీన్స్ ప్రొడ్యూసర్స్ సాహు గారపాటి, హరీష్ పెద్ది కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'భగవంత్ కేసరి'. ఐ డోంట్ కేర్ అనేది ట్యాగ్ లైన్. ఈ చిత్ర టైటిల్ పోస్టర్ రెండు రోజుల క్రితం విడుదలై టెర్రిఫిక్ రెస్పాన్స్ అందుకుంది. తాజాగా బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. టీజర్ ప్రపంచవ్యాప్తంగా 108కి పైగా థియేటర్లలో స్క్రీన్ చేశారు. టీజర్‌ని పెద్ద స్క్రీన్‌లపై చూడటం అభిమానులకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. 'రాజు అహంకారానికి, మొండివాడికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బాలకృష్ణ వివరించడంతో టీజర్ ప్రారంభమవుతుంది. అర్జున్ రాంపాల్‌ను రూలర్‌గా పరిచయం చేయగా, బాలకృష్ణను మొండివాడిగా చూపించారు. 'అడవి బిడ్డ.. నేలకొండ భగవంత్ కేసరి' అని తనను తాను పరిచయం చేసుకున్నారు బాలయ్య. 'ఈ పేరు శానా యేండ్లు యాదుంటది' అని బాలకృష్ణ చెప్పినట్లుగానే ఇది చాలా కాలం పాటు గుర్తుండిపోతుంది. ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ,'రౌడీఇన్స్పెక్టర్ సినిమాలో బాలయ్య బాబు హిందీ డైలాగులు చెబితే థియేటర్లు దద్దరిల్లాయి. తెలంగాణ నేపథ్యం కావడంతో ఇందులో కూడా అక్కడక్కడ కొన్ని హిందీ డైలాగులు పెట్టాం. టీజర్‌లో సర్‌ప్రైజ్‌గా హిందీ డైలాగ్ ఇచ్చాం. బాలకృష్ణ ఈ సినిమాలో ఎలా కనిపించబోతున్నారనేదానికి టీజర్ జస్ట్ శాంపిల్ మాత్రమే. దసరాకి భగవంత్ కేసరి ఎంటర్‌టైన్‌మెంట్ మామూలుగా ఉండదు. అభిమానులతో పాటు తెలుగు సినిమాని ప్రేమించే ప్రేక్షకులందరూ ఈ సినిమాను కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ,'ఇది మేము అభిమానులకు ఇచ్చే కానుక. దసరాకి వస్తున్నాం. దర్శకుడు అనిల్ రావిపూడి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విధంగా సినిమాని తీర్చిదిద్దారు. ఈ దసరాకి అన్ని రికార్డులు భగవంత్ కేసరి సొంతం చేసుకుంటుంది. మేము అభిమానులుగా అభిమానులకు ఇచ్చే సినిమా భగవంత్ కేసరి' అని చెప్పారు. మరో నిర్మాత హరీష్ మాట్లాడుతూ, 'ఇది శాంపిల్ మాత్రమే. ఈ దసరాకి మీ అందరినీ ఉత్సాహపరుస్తాం' అని తెలిపారు.



బాలకృష్ణ

అరుదైన సినిమాకి అద్భుత ఆదరణ

సముద్ర ఖని, మాస్టర్ ధ్రువన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధనరాజ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'విమానం'. శుక్రవారం వరల్డ్ వైడ్‌గా తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ రిలీజై సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) 'విమానం' చిత్రాన్ని నిర్మించారు.
శనివారం ఈ మూవీ సక్సెస్ మీట్‌లో సముద్ర ఖని మాట్లాడుతూ 'విమానం రిలీజ్ తర్వాత థియేటర్స్ సంఖ్య పెరిగాయని నిర్మాతలు చెప్పటం చాలా హ్యాపీగా అనిపించింది' అని అన్నారు.
'కాన్సెప్ట్, కథలోని ఎమోషన్స్ కనెక్ట్ కావటంతో మౌత్ టాక్ కారణంగా మ్యాట్నీ నుంచి సినిమాకు ఆదరణ పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు థియేటర్స్ సంఖ్య పెరిగింది. ఇలాంటి ఎమోషనల్ మూవీ అరుదుగా వస్తుంటుంది' అని నిర్మాత కిరణ్ కొర్రపాటి చెప్పారు. డైరెక్టర్ శివ ప్రసాద్ యానాల మాట్లాడుతూ 'సినిమాను చూసిన వారందరూ గొప్పగా చెబుతున్నారు. మా నాన్న సినిమా చూశారు. ఎలా ఉంది నాన్నా అని అడిగితే.. మా నాన్న గుర్తుకొచ్చాడులేరా అని ఆయన, అలాగే మా అమ్మ కూడా చెప్పడం చాలా ఆనందమేసింది. అరుదైన సినిమాకి అద్భుత ఆదరణ లభించడం హ్యాపీ' అని తెలిపారు.



అనసూయ, సముద్రఖని, ధ్రువన్, శివప్రసాద్, కిరణ్ కొర్రపాటి

ఓవర్సీస్‌లో లైవ్ కన్సర్ట్స్

నార్త్ అమెరికా సీమాంధ్ర అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 'ఆర్ఆర్ఆర్' సినిమా 'నాటు నాటు' పాటకు 150 టెస్లా కార్లతో లైట్ షో నిర్వహించడం వంటి ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలను నిర్మాత టీజీ.విశ్వప్రసాద్ అధ్వర్యంలో నార్త్ అమెరికన్ సీమాంధ్ర అసోసియేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్వహించింది. రీసెంట్‌గా యువ గాయకుడు రామ్ మిరియాలతో పలు చోట్ల మ్యూజిక్ కన్సర్ట్‌లు నిర్వహించారు. ఈ షోస్‌కి ఊహించని రీతిలో అనూహ్య స్పందన లభించింది. ఇక తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ.విశ్వప్రసాద్, నాసా ఆధ్వర్యంలో సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్‌తో ఇదే మాదిరిగా మ్యూజిక్ కన్సర్ట్‌లను నిర్వహించనున్నారు.
దీనికి సంబంధించిన మోషన్ పోస్టర్ వీడియోను ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వేదికగా చిరంజీవి అధికారికంగా లాంచ్ చేసి, దేవిశ్రీ ప్రసాద్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కన్సర్ట్ జులై 2న డల్లాస్, జులై 8న ఫిలడెల్ఫియా, జులై 15న సియాటెల్, జులై 22న సాన్‌జోస్, జులై 29న చికాగోలో జరగనున్నాయి.
ఈ కన్సర్ట్‌లో సింగర్ ఇంద్రవతి, సాగర్, గీతా మాధురి, హేమ చంద్ర, రీటా, పృధ్వి, మౌనిక పాడనుండగా,. యాంకర్, నటి అనసూయ ఈ షోస్‌కి హోస్ట్‌గా వ్యవహరించనున్నారు.



దేవిశ్రీ ప్రసాద్

ప్రేక్షకులకు థ్యాంక్స్

సూర్యదేవర నాగవంశీ, మారుతి టీమ్ సమర్పణలో ఐవీవై ప్రొడక్షన్స్ నిర్మించిన కుటుంబ కథా చిత్రం 'ఇంటింటి రామాయణం'. వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ యిన్నమూరి నిర్మాతలు. రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, నరేష్, సురభి ప్రభావతి, గంగవ్వ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సురేష్ నరెడ్ల దర్శకత్వం వహించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.
దర్శకుడు సురేష్ నరెడ్ల మాట్లాడుతూ,' 'ఈ సినిమా చూసిన ప్రేక్షకులందరూ సినిమాని స్టార్టింగ్ నుండి ఎండింగ్ వరకు చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. బాగా నవ్వుకుంటున్నారు, ఎమోషనల్ సీన్స్‌కి కనెక్ట్ అవుతున్నారు. చూసినవాళ్లు అందరూ సినిమా గురించి చాలా బాగా మాట్లాడుతున్నారు. పాజిటివ్ మౌత్ టాక్ స్ప్రెడ్ చేస్తున్నారు' అని చెప్పారు. 'మేం సినిమా చేసేటప్పుడే ఈ సీన్‌కి ప్రేక్షకులు నవ్వుకుంటారు, ఈ సీన్‌కి ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు అనుకునే వాళ్లం. కానీ మేం ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన వచ్చింది' అని నటి నవ్య స్వామి తెలిపారు.
నటుడు అంజి మాట్లాడుతూ, 'ఈ సినిమా ఖచ్చితంగా ఇంటిల్లిపాది వెళ్లి ప్రశాంతంగా థియేటర్‌లో కూర్చొని ఎంజాయ్ చేసి, హ్యాపీగా నవ్వుకొని.. ఇంటికి వెళ్లి కూడా చెప్పుకొని చెప్పుకొని నవ్వుకునే సినిమా' అని అన్నారు. 'మేము థియేటర్‌కి వెళ్లి సినిమా చూసినప్పుడు ప్రేక్షకులందరూ మొదటి సీన్ నుంచి చివరి వరకు చాలా ఎంజాయ్ చేశారు. మేం నవ్వుకుంటూ, ఎంత సరదాగా సినిమాలో నటించామో.. ప్రేక్షకులు కూడా అంతే సరదాగా ఎంజాయ్ చేసుకుంటూ సినిమా చూస్తున్నారు. అందరూ ఈ సినిమాని మరింత ఆదరించండి' అని నటి కవిత చెప్పారు.



నవ్య స్వామి

రియల్ బ్లాక్‌బస్టర్

విజె సన్నీ, సప్తగిరి హీరోలుగా డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన హిలేరియస్ ఎంటర్ టైనర్ 'అన్ స్టాపబుల్'. నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని ఎ2బి ఇండియా ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మాత రజిత్ రావు నిర్మించారు. శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలై ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, రియల్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని, సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. హీరో సన్నీ మాట్లాడుతూ,'చూసిన ప్రేక్షకులందరూ సినిమా బాగుంది, చాలా బాగా ఎంజాయ్ చేశామని చెప్పడం ఆనందంగా ఉంది. సినిమాని ఆదరించిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు' అని చెప్పారు.
దర్శకుడు డైమండ్ రత్నబాబు మాట్లాడుతూ, "అన్ స్టాపబుల్‌'ని మంచి సినిమా అని ప్రేక్షకులు మెచ్చుకోవడం ఆనందంగా ఉంది. హాయిగా నవ్వించాలానే ఉద్దేశంతో ఈ సినిమా చేశాను. ప్రేక్షకుల నుంచి వచ్చిన రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. పబ్లిక్ టాక్ అద్భుతంగా ఉంది. ప్రేక్షక దేవుళ్ళు ఇచ్చిన తీర్పు రియల్ బ్లాక్ బస్టర్' అని అన్నారు. 'బాలయ్య బాబుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. 'అన్ స్టాపబుల్' అని ఆయన టైటిల్ తీసుకున్నాం. బాలయ్య బాబు ఏది పట్టుకున్న బంగారం అవుతుంది. మా ప్రొడక్షన్‌లో తొలి సినిమాకి ఆయన టైటిల్ ఉండటం ఆనందంగా ఉంది. 'అన్ స్టాపబుల్' రియల్ బ్లాక్ బస్టర్. ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తున్నారు. డైమండ్ రత్నబాబు ఆయన ఫోన్ నెంబర్ ఇచ్చారు. ప్రేక్షకుల నుంచి ఎక్స్ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తోంది. ఒక మంచి సినిమాని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో నిర్మాతగా మారాను. 'అన్ స్టాపబుల్‌'ని రియల్ బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు. 'అన్ స్టాపబుల్'2ని మళ్ళీ డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో చేస్తున్నాం' అని నిర్మాత రజిత్ రావు అన్నారు.



డైమండ్ రత్నబాబు, విజే సన్నీ, రజిత్‌రావు

క్షీణిస్తున్న మహిళా కార్మిక శక్తి !

దేశంలో ఉపాధి రంగంలో 20-శాతం కన్నా తక్కువమందే

లింగ సమానత్వం దిశగా కానరాని పురోగతి : ఐఎల్‌ఓ



న్యూఢిల్లీ : దేశంలో మహిళా కార్మిక శక్తి ప్రాతినిధ్యం క్షీణిస్తోంది. దేశంలోని మహిళల్లో 20శాతం కన్నా తక్కువమందే వేతనాలతో కూడిన ఉద్యోగాల్లో వున్నారు. భారతదేశంలో ఉపాధికి సంబంధించి లింగ వ్యత్యాసం 50.9శాతంగా వుందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) డేటా పేర్కొంది. కార్మిక శక్తిలో పురుషుల వాటా 70.1శాతంగా వుండగా, మహిళా కార్మికుల వాటా కేవలం 19.2శాతంగా మాత్రమే వుంది. గతేడాది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన లింగ వ్యత్యాస నివేదిక ప్రకారం, మొత్తంగా 146 దేశాలకు గానూ భారత్ 135వ స్థానంలో వుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి చిన్న దేశాల కన్నా వెనుకబడి వుంది. చైనా, పాకిస్తాన్, అజర్‌బైజాన్, కతార్ వంటి దేశాలతో పాటూ ప్రతి ఐదింటిలో ఒక దేశంలో లింగ అసమానతలు ఐదు శాతం దాటి వున్నాయి. లింగ సమానత్వం దిశగా పురోగతి స్తంభించిపోయిందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) పేర్కొంది.

కోవిడ్ మహమ్మారి వల్ల ఈ పరిస్థితి మరింత దిగజారింది. మహిళలు ఎక్కువగా పనిచేసే రిటైల్, ఆతిథ్య రంగాలు కోవిడ్ కారణంగా దెబ్బతినడంతో ఉపాధి విషయంలో వారు మరింత ఇబ్బందులు పడ్డారు. ప్రపంచ కార్మిక శక్తిలో పూర్తి స్థాయి లింగ సమానత్వం రావాలంటే మరో 132ఏళ్ళు పడుతుందని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది. గత రెండు దశాబ్దాల్లో భారతదేశంలో మహిళా కార్మిక ప్రాతినిధ్యం ఆశ్చర్యకరమైన రీతిలో తగ్గింది. 2005లో 32శాతంగా వున్నది 2021నాటికి 19శాతానికి పడిపోయింది. సమాజంలో విభిన్న సామాజిక వర్గాలు, మతాలు, వివిధ వయస్సు గ్రూపులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలవ్యాప్తంగా అందరికీ ఈ పరిస్థితి వర్తించింది. మహిళలు ఉపాధికి దూరంగా వుండేందుకు దారి తీస్తున్న కారణాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొద్దిగా భిన్నంగా వున్నాయి. కానీ చాలా కేసుల్లో దాదాపు ఒకేలా వున్నాయని చెప్పవచ్చు. ఇందులో మొదటిది, ప్రధానంగా మహిళలు చేసే పనులకు గుర్తింపు లేకపోవడం, వాటికి ఎలాంటి జీతాలు చెల్లించకపోవడం. ఇక రెండవది, సమాజంలో వుండే నియమ నిబంధనలు, లింగ సమానత్వ అంశాలు - అంటే ఆడది ప్రధానంగా ఇంటి పనులకే పరిమితం కావాలి, ఇంట్లో పనులు చూసుకుని, పిల్లలను చక్కదిద్దుకుంటే చాలనే కన్జర్వేటివ్ భావజాలం ఇందుకు కారణంగా వుంది. ఇటువంటి బాధ్యతలే మహిళలను ఇంటికే కట్టిపడేసేలా చేస్తున్నాయి. ఇక మూడో కారణం వేతనాల చెల్లింపుల్లో అంతరాలు, నాల్గవది మరింత మెరుగైన రీతిలో ప్రభుత్వ చర్యలు, చట్టాలు, ఆర్థిక విధానాలు రూపొందించాల్సిన అవసరం వుంది. లింగ సమానత లోపించడం, మహిళలకు అనువైన ఉపాధి అవకాశాలు కరువవడం, వ్యవసాయంపై ఆధారపడడం, కొన్ని కుటుంబాలకు సంబంధించినంత వరకు పెరిగిన ఆర్థిక సుస్థిరత, ఉద్యోగాలు చేయడం కన్నా చదువుకే ప్రాధాన్యతనివ్వడం, భద్రతాపరమైన ఆందోళనలు వంటివి ప్రధాన కారణాలుగా వున్నాయి. మహిళలు ఉద్యోగాలు చేయకుండా నివారిస్తున్న ఈ సమస్యలను ఎలా ఎదుర్కొనాలనేది కూడా ప్రధాన సమస్యగానే వుంది. వ్యక్తిగతంగా, సమాజపరంగా, ప్రభుత్వాల స్థాయిలో అనేక మార్పులు తీసుకువస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. మహిళలు పనిచేయగల ఒక వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సి వుంటుంది.

ఒక దేశం పురోగతి సాధించాలన్నా, ఆర్థిక ప్రగతిని అందుకోవాలన్నా ఈ సవాళ్ళన్నింటినీ పరిష్కరించి, మహిళల సేవలను, వారి శ్రమను ఆర్థికంగా, సమాజపరంగా గుర్తించడం చాలా కీలకం. లింగ వ్యత్యాసాలను రూపుమాపడానికి కొన్ని వ్యూహాలను అనుసరించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచించింది. సమాన విలువ గల పనికి సమాన వేతనానికి హామీ కల్పించడం, ఇందుకు చట్టపరమైన రక్షణ కల్పించడం, వేతనాల్లో పారదర్శకత, చట్టపరమైన చర్యల ద్వారా లింగ వివక్షను, వేధింపులను నిర్మూలించడం, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేలా ప్రచారాలు నిర్వహించడం చేపట్టాలని సూచించింది. దేశంలో మహిళా ఉపాధిని మరింత పెంపొందించాలంటే మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక తోడ్పాటును అందించే చొరవలు తీసుకోవడం, మెరుగైన విద్య, శిక్షణ, భద్రతాపరమైన చర్యలు ఉపాధి అవకాశాల పెంపు, మరింత మెరుగైన పని విధానాలు, పిల్లల సంరక్షణకు తగినచర్యలు తీసుకోవాల్సి వుందని పేర్కొంది.

పింఛన్ పెంపుతో దివ్యాంగుల సంబురాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
దివ్యాంగుల పింఛన్ మరో వెయ్యి రూపాయలు పెంచుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తమైంది. ఈపెంపుతో దివ్యాంగుల ఫించన్ మొత్తం రూ.4,116కు చేరుతుందనీ, వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని, సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల అవసరాలు తెలుసుకొని దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5.40 లక్షల మంది దివ్యంగులకు పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. దానితోపాటు వికలాంగుల సహకార సంస్థ ద్వారా ఉపకరణాలు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర దివ్యాంగుల సంఘాల నాయకులు మున్న, రాజ్యలక్ష్మి, అంధుల ప్రతినిధులు భాస్కర్, మహేందర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహితీ వైభవం

- నేటి 'దశాబ్ది'లో సాహిత్య దినోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సాహిత్య దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నది. గడచిన 9 ఏండ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాహిత్య వైభవాన్ని చాటి చెప్పేలా ఈ వేడుకలను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఉర్దూ, తెలుగు భాషల్లో రచన, పద్యం, కవి సమ్మేళనాలను రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

అమెజాన్ అడవుల్లో అద్భుతం !

- 40 రోజుల క్రితం విమాన ప్రమాదం నుంచి నలుగురు చిన్నారులు సజీవంగా...

బొగొటా, కొలంబియా: అమెజాన్ అడవుల్లో అద్భుతం చోటు చేసుకుంది. 40రోజుల క్రితం జరిగిన విమాన ప్రమాదంతో కారడవుల్లో తప్పిపోయిన నలుగురు చిన్నారులు సజీవంగా దొరికారు. కొలంబియా సైనికుల గాలింపు చర్యల్లో వీరిని కనుగొన్నట్లు అధికారులు ప్రకటించారు. వెంటనే వారిని బొగొటా తీసుకువచ్చి ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేశారు. అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ వార్త విన్నంతనే ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే వారితో మాట్లాడాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఒక తల్లి పిల్లలైన వీరు వరుసగా 13, 9, 4, 11మాసాల వయసున్న వారు. ఈ 40రోజులు వారు ఎలా వున్నారు, ఏం చేశారు, తిన్నారు వంటి వివరాలేమీ ఇంకా తెలియరాలేదు. పిల్లలతో సైనికులు, వలంటీర్ల బృందం దిగిన ఫోటోను కొలంబియా మిలటరీ ట్వీట్ చేసింది. థర్మల్ బ్లాంకెట్‌లలో పిల్లలను కప్పి వుంచారు. మరొక సైనికుడు ఆ పసిబిడ్డ నోటికి బాటిల్ అందిస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. మే 1వ తేదీన తెల్లవారు జామున సింగిల్ ఇంజను విమానం కుప్పకూలింది. ఆ సమయంలో విమానంలో ఆరుగురు ప్రయాణికులు వున్నారు. ఇంజను వైఫల్యంతో విమానం కూలిపోతోందని పైలట్ ప్రకటించారు. ఆ వెంటనే రాడార్ నుండి విమానం కనుమరుగై పోయింది. దీంతో వారిలో ఎవరైనా జీవించి వుంటారేమోననే ఆశతో తీవ్ర స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. కన్ను పొడుచుకున్నా కానరాని ఆ దట్టమైన అడవుల్లో యుద్ధ ప్రాతిపదికన గాలింపు చేపట్టారు. రెండు వారాల తర్వాత గాలింపు బృందానికి విమాన శిథిలాలు కనిపించాయి. అక్కడ ముగ్గురు పెద్దల మృత దేహాలు కనిపించాయి. కానీ పిల్లలు ఎక్కడున్నారో తెలియరాలేదు. దాంతో కొలంబియా ఆర్మీ గాలింపును ఉధృతం చేసింది. జాగిలాలతో 150మంది సైనికులు ఆ ఏరియాలోకి దిగారు. అక్కడి ఆదివాసీ గిరిజన తెగలకు చెందిన వలంటీర్లు కూడా పదుల సంఖ్యలో ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. చిట్టచివరకు వారి శ్రమ ఫలిస్తూ పిల్లలు దొరికారు. గాలింపు సమయంలో పిల్లల కోసం సైనికులు అక్కడక్కడా వదిలిన ఆహార పెట్టెలు బహుశా పిల్లలకు ఉపయోగపడి వుంటాయని భావిస్తున్నారు.

సూడాన్‌లో 24గంటలు కాల్పుల విరమణ

రియాద్ : శనివారం నుండి 24గంటల పాటు కాల్పుల విరమణకు సూడాన్ ప్రత్యర్థి పక్షాలు అంగీకరించాయి. ఈ మేరకు అమెరికా, సౌదీ మధ్యవర్తులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా కాల్పులను విరమించేందుకు సూడాన్ సాయుధ బలగాలు (ఎస్ఎఎఫ్), రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) ప్రతినిధుల మధ్య అంగీకారం కుదిరింది. శనివారం ఉదయం ఆరు గంటల నుండి ఈ ఒప్పందం అమలవుతుందని సౌదీ విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఆ ప్రకటన పేర్కొంది. గతంలో అనేక సార్లు కాల్పుల విరమణ ఒప్పందాలు కుదిరాయి, విఫలమయ్యాయి. గతంలో విఫలమైన ఒప్పందాలకు కూడా వీరే మధ్యవర్తిత్వం వహించారు. ఉభయ పక్షాలకు చెందిన జనరల్స్‌పై అమెరికా ఆంక్షలు కూడా విధించింది. భయంకరమైన రక్తపాతానికి ఇరు పక్షాలు కారణమని విమర్శించింది. ఈ 24గంటల కాల్పుల విరమణను కూడా పాటించలేకపోతే సౌదీ రాజధాని జెడ్డాలో జరుగుతున్న చర్చలను వాయిదా వేసే ఆలోచన చేయాల్సి వస్తుందని మధ్యవర్తులు హెచ్చరించారు. గత నెల చివరి నుండి ఈ చర్చలు నిలిచిపోతూ వస్తున్నాయి. ఏప్రిల్ నుండి ఈ పోరు కొనసాగుతోంది. ప్రధానంగా రాజధాని ఖార్టూమ్‌లో, పశ్చిమ డార్ఫర్ ప్రాంతంలో ఘర్షణలు విస్తృతంగా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటివరకు 1800మంది చనిపోయారని, 20లక్షల మంది నిర్వాసితులయాయరని ఐక్యరాజ్య సమితి పేర్కొంది.

ఒకే రన్‌వే పైకి రెండు విమానాలు !

టోక్యో : టోక్యోలోని ప్రధాన విమానాశ్రయంలో ఒకే రన్‌వేపైకి రెండు ప్రయాణికుల విమానాలు వచ్చేశాయి. ప్రమాదవశాత్తూ ఆ రెండు ఒకదానినొకటి తాకాయని అయితే ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ఒక విమానానికి రెక్క ఒకటి కొద్దిగా దెబ్బతిందని తెలుస్తోంది. బ్యాంకాక్ వెళుతున్న థాయి ఎయిర్‌వేస్ అంతర్జాతీయ విమానం, తైపే వెళుతున్న ఎవా ఎయిర్‌వేస్ విమానం ఈ రెండూ హనెడా విమానాశ్రయంలో ఒకదానినొకటి తాకాయి. దాంతో రన్‌వేను మూసివేసినట్లు జపాన్ మీడియా తెలిపింది. ఒకే రన్‌వేపై రెండు ప్రయాణికుల విమానాలు వున్న దృశ్యాలను మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. కాగా దీనిపై వ్యాఖ్యానించడానికి ఎయిర్‌లైన్స్, విమానాశ్రయం, రవాణా మంత్రిత్వ శాఖ అధికారులు ఎవరూ అందుబాటులో లేరు. ప్రమాద కారణం కూడా తెలియరాలేదు.

గుజరాత్‌లో ఐసిస్ కుట్ర భగ్నం.. నలుగురి అరెస్టు

న్యూఢిల్లీ : గుజరాత్ పోలీసు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. పోర్బందర్ పట్టణంలో ఇస్లామిక్ స్టేట్ మాడ్యూల్ గుట్టు రట్టు చేసింది. ఒక మహిళతో సహా నలుగురు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేసింది. అరెస్టయిన నలుగురు వ్యక్తులు ఐసిస్ టెర్రర్ మాడ్యూల్‌లో భాగమేనని అందిన సమాచారం మేరకు ఎటిఎస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. నిందితులంతా ఓ ఏడాది నుంచి సంబంధాలను కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు. దేశం విడిచి వెళ్లడానికి, ఐసిస్ ఉగ్రవాద సంస్థలో చేరడానికి వీరు ప్రణాళిక రచించారని తెలిపారు. డిఐజి దీపన్ భద్రన్, ఎస్పీ సునీల్ జోషీ నేతృత్వంలో జరిగిన దాడుల్లో సుమేర అనే మహిళతోపాటు, ముగ్గురు పురుషులను శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి అనేక నిషిద్ధ వస్తువులను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్స్ వీరిని రాడికలైజ్ చేసినట్లు గుర్తించారు. కాగా, కొన్ని రోజుల క్రితం అహ్మదాబాద్‌లో ముగ్గురు అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు.

ఎన్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సుప్రియా, ప్రఫుల్ పటేల్

ముంబయి: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సుప్రియా సూలే, ప్రఫుల్ పటేల్‌ను నియమించారు. శనివారం ఆ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శరద్ పవార్ ఈ నియామకాలు చేశారు. పవార్, పీఏ సంగ్మా కలిసి 1999లో ఎన్‌సీపీని స్థాపించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, ఉమన్ యూత్, లోక్‌సభ సమన్వయకర్తగా సుప్రియా సూలే బాధ్యతలు నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గోవా వ్యవహారాలను ప్రఫుల్ పటేల్ చూసుకుంటారు. శరద్ పవార్ గత నెలలో ఎన్‌సీపీ చీఫ్ పదవికి రాజీనామా ప్రకటించగా, పార్టీ కార్యకర్తలు ఆ ప్రతిపాదను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో పవార్ ఆ ఆలోచనను వెనక్కి తీసుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్లను ఏర్పాటు చేసుకోవాలని పవార్‌కు పార్టీ ప్యానల్ సూచించింది. ఈ నేపథ్యంలో పవార్ తాజా నియామకాలు చేపట్టారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ టక్కర్‌కు ఒడిశా, పశ్చిమబెంగాల్, రైతులు, మైనారిటీ శాఖ బాధ్యతలు అప్పగించారు. నంద శాస్త్రిని ఢిల్లీ పార్టీ చీఫ్‌గా పవార్ ప్రకటించారు. కొత్త పదవుల్లో శదర్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్‌కు ఎలాంటి బాధ్యతలు అప్పగించకపోవడం విశేషం.

సుపరిపాలన సూపర్...

- 'దశాబ్ది' ఉత్సవాల్లో సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణా రాష్ట్రావతరణ జరిగిన తొమ్మిదేండ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో దేశంలో మరే రాష్ట్రం సాధించని రీతిగా అభివద్ధిని సాధించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డీజీపీ అంజనీకుమార్, ప్రిన్సిపల్ సీసీఎఫ్ డోబ్రియల్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నీటి పారుదల, వ్యవసాయం, ఐటీ, పరిశ్రమలు, విద్యా, ఆరోగ్యం, సంక్షేమం, సుపరిపాలన, శాంతి భద్రతల పరిరక్షణ ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రం రికార్డు స్థాయి పురోగతి సాధించిందన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో సాధించిన విజయాలు, మార్పులపై ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వీ, వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులపై ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, మున్సిపల్ పరిపాలనపై ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, విద్యుత్ రంగంలో సంస్కరణలపై ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, రాష్ట్రంలో ఆర్థిక రంగ సంస్కరణలపై ఆర్థిక, ప్రణాళికా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, విద్య రంగంలో మార్పులపై విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్య, ధరణిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ తదితరులు పవర్ పాయింట్ ద్వారా వివరించారు.

పారిశుద్ధ్య కార్మికుల కష్టాలు



తక్కువ వేతనాలు.. అధికపని

- కనుమరుగవుతున్న పీఎఫ్ నిధులు
- దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న కార్మికులు

జంషెడ్‌పూర్ : జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో పారిశుధ్యకార్మికులు దయనీయ పరిస్థితులను అనుభవిస్తున్నారు. తక్కువ వేతనాలు, అధిక పని, అణచివేతను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా వారి పీఎఫ్ నిధులు కనుమరుగవుతున్నాయి. పారిశుధ్య కార్మికుల్లో అత్యధికం అట్టడుగు కులాల వారే ఉన్నారు. దీంతో ఈ పరిస్థితులతో వారు కష్టాలను ఎదుర్కొంటున్నారు.

ఓ ప్రయివేటు బ్యాంకులో సఫాయి కర్మచారిగా పనిచేస్తున్న జంషెడ్‌పూర్‌కు చెందిన రమేష్ కార్మికుల అవస్థలను వివరించారు. "నేను గత ఎనిమిదేండ్లుగా అదే జీతం పొందుతున్నాను. నేను లేకుండా, బ్యాంకు ఒక రోజు కూడా పనిచేయదు. అయినప్పటికీ, నా పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నది" అని అతను వాపోయాడు. బ్యాంకులో ఇతర ఉద్యోగులు జీతంలో వార్షిక పెంపుదల పొందుతున్నారనీ, తాను మాత్రం అదే ఆదాయంతో స్థిరపడవలసి వస్తున్నదని చెప్పారు. జంషెడ్‌పూర్‌లోని ఇతర పారిశుధ్య కార్మికుల పరిస్థితులు కూడా రమేశ్ ఎదుర్కొంటున్న పరిస్థితులనే ప్రతిబింబిస్తున్నాయి.

1900 ప్రారంభంలో ప్రయివేటు కంపెనీలు యూపీ, బీహార్ బెల్ట్ నుంచి కార్మికులను నియమించుకున్నాయి. వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎలాంటి నేపథ్య తనిఖీ లేకుండా నియమించబడ్డారు. వారందరికీ శాశ్వత ఉద్యోగాలు, వైద్య సదుపాయాలు, వారి కుటుంబాలు నివసించడానికి క్వార్టర్లు కల్పిస్తామని వాగ్దానం చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయోజనాలు కార్మికులు, అధికారులకే పరిమితం చేయబడ్డాయని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ముఖి పట్టణకార్యాలయంలో క్లీనింగ్ సిబ్బందిగా పని చేస్తున్న సాగర్ మాట్లాడుతూ.. మమ్మల్ని ఇక్కడకు తీసుకొచ్చి మాపై వివక్ష చూపటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అణగారిన సామాజిక వర్గాలను అదే శుభ్రపరిచే ఉద్యోగాలకు పరిమితం చేసినప్పటి నుంచి వారి ఆర్థిక స్థితి ఏ మాత్రమూ మెరుగుపడలేదని వివరించాడు. ప్రతి ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు పనిచేస్తున్నప్పటికీ వారి పిల్లలకు మెరుగైన విద్య, మెరుగైన జీవితాన్ని అందించడానికి ఆదాయం ఏ మాత్రమూ సరిపోవటం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా తాము మాత్రం వారికి చాలా తక్కువ అని అన్నాడు.

ఆరు నెలల క్రితం వరకు ఓ కాంట్రాక్టర్ కింద పనిచేసిన సుమన్‌దేవి అనే మహిళ మాట్లాడుతూ.. పని ప్రదేశంలో తాను ఎదుర్కొన్న దోపిడీ గురించి వాపోయింది. చెల్లింపులు ఆలస్యంగా జరుగుతున్నాయనీ, కుటుంబాన్ని పోషించుకోవటం కష్టంగా మారిందని వివరించింది. ఆమె ఇద్దరు కుమారులు కూడా అక్కడే స్వీపర్లుగా పని చేస్తున్నారు. వేతనాలు సరిగ్గా సమయానికి అందటం లేదనీ, ఇక పీఎఫ్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని అన్నారు. బోనస్‌లు, సెలవులు వంటివి లభించటం కష్టంగా ఉన్నదన్నారు. అయితే, పారిశుధ్య కార్మికుల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. వీరి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

ప్రతి నెలా జీతాలకు ఆలస్యమే

ప్రత్యేక పీడీ లేకపోవడంతో పెండింగ్‌లో ఫైల్

- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో జీతం ఏ రోజు వస్తుందో ఎవరికి తెలియని పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతుండటంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాక్స్ ఉద్యోగుల జీతాలపైన సంతకం చేయలేనంత బిజీలో ఇన్ ఛార్జీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉండడమే ఆలస్యానికి కారణంగా తెలుస్తున్నది. గత 10 రోజుల నుంచి జీతాల ఫైల్ నుంచి తీసుకుని ఆమె కార్యాలయానికి వెళితే, ఇంటికి తీసుకురావాలనీ, అక్కడికి వెళితే మరుసటి రోజు కార్యాలయానికి తీసుకురావాలని చెబుతున్నట్టు సమాచారం. ఎప్పుడు ఏదో ఒక సమావేశంలో ఉన్నాను.... ఇప్పుడు ఆ ఫైల్ చూడను అంటూ వెనక్కి పంపిస్తుండటంతో ఉద్యోగులు విసిగిపోతున్నారు. మరోవైపు టీశాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతామహంతి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నట్టు ఉద్యోగులు చెబుతున్నారు. టీశాక్స్ కు ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తే జీతాల జాప్యం సమస్యలతో పాటు ఇతర ఇబ్బందులను కూడా అధిగమించవచ్చనే సూచనలు వస్తున్నాయి.

గత కొన్ని నెలలుగా 20వ తేదీ వచ్చినా జీతాలు రాకపోవడంతో ఉద్యోగుల ఇంటి అద్దె, హౌమ్ లోన్లు, ఇతర ఈఎంఐలు కట్టలేక డిఫాల్టర్లుగా మిగిలిపోవాల్సి వస్తున్నది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ ఆర్గనైజేషన్ (న్యాకో) నిబంధనల మేరకు ఉద్యోగులకు ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలివ్వాల్సి ఉంటుంది. దానికి అంతకు ముందు నెలలో 20వ తేదీ తర్వాత జిల్లాల వారీగా హాజరు పట్టికను రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చేరుతుంది. ప్రతి నెలా 30వ తేదీ వరకు జీతాలకు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేస్తారు. మరుసటి నెల ఒకటో తేదీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫైల్‌పై సంతకం చేసి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆమోదంతో జీతాల ఫైల్ బ్యాంకుకు పంపించడం ఆనవాయితీ. ఈ సొసైటీ పరిధిలో 750 మందికి పైగా పని చేస్తున్నారు. వీరిలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, కౌన్సిలర్లు, ఫార్మాసిస్టులు, కేర్ కో ఆర్డినేటర్ వంటి కేడర్లలో ఉండి రోగులకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో, ఐసీటీసీ, పీపీటీసీపీ, బ్లడ్ బ్యాంక్, ఏఆర్‌టీ సెంటర్లు తదతర విభాగాల్లో ఉంటూ హెచ్ఐవీ మందుల సరఫరా తదితర సేవలందిస్తున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్ది సకాలంలో జీతాలు అందేలా చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు.

స్మారక చిహ్నం తుది పనుల పరిశీలన



నవతెలంగాణ-హైదరాబాద్

హుస్సేన్‌సాగర్ ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం ఫినిషింగ్ పనులను శనివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియ తిరుగుతూ అధికారులకు, వర్క్ ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. ప్రధాన ద్వారం, ఫౌంటైన్, ల్యాండ్ స్కేప్ ఏరియా, గ్రీనరీ, పార్కింగ్ ఏరియా, నిర్మాణ లోపలి భాగంలో ఆర్ట్ గ్యాలరీ, ఆడియో విజువల్ రూమ్‌పై అంతస్తుకు వెళ్లేందుకు ఎస్కలేటర్ ఏర్పాటు, లిఫ్ట్‌లు పరిశీలించారు. కన్వెన్షన్ సెంటర్, పైన రెస్టారెంట్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తెలంగాణ అమర వీరుల స్మారక చిహ్నం ప్రారంభించుకోనున్న నేపథ్యంలో మిగిలిన ఫినిషింగ్ వర్క్స్ వేగంగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అమరుల త్యాగాలు ప్రతిబింబించేలా నిరంతరం జ్వలించే జ్వాలా ఆకృతి దీపం వద్ద లైటింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. యావత్ తెలంగాణ ప్రజల మది నిండా నిలిచే నిర్మాణమని మంత్రి అన్నారు. మంత్రి వెంట ఆర్ అండ్ బీ ఈఎన్సీ ఐ. గణపతిరెడ్డి, సి.ఈ మోహన్‌నాయక్, ఎస్.ఈలు హఫీజ్, లింగారెడ్డి, ఎ.ఈ ధీరజ్ రెడ్డి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు కొండల్ రెడ్డి, శిల్పి రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీ పదవికి బోరిస్ జాన్సన్ రాజీనామా

పార్టీగేట్ కుంభకోణంపై పార్లమెంట్‌ను తప్పదారి పట్టించినందుకు ఆంక్షలు

లండన్ : తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రకటించారు. పార్టీ గేట్ కుంభకోణంపై పార్లమెంట్‌ను తప్పుదారి పట్టించినందుకు గానూ ఆయనపై ఆంక్షలు విధించనున్నట్లు కమిటీ ప్రకటించిన నేపథ్యంలో జాన్సన్ ఈ ప్రకటన చేశారు. కరోనా సమయంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు, ఆంక్షలనే పలుసార్లు ఉల్లంఘించడానికి సంబంధించిన పార్టీగేట్ గురించి జాన్సన్ వరుసగా పార్లమెంట్‌లో చేసిన ప్రకటనలన్నీ తప్పుదారి పట్టించేలా వున్నాయని ఎంపీల దర్యాప్తులో వెల్లడైంది. దాంతో తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి సుదీర్ఘమైన ప్రకటన జారీ చేశారు.

తనను ఎలాగోలా బయటకు పంపాలన్నదే తన ప్రత్యర్థుల ఉద్దేశ్యంగా వుందని ఆయన విమర్శించారు. తిరిగి పార్లమెంట్‌కు రావడానికి ప్రయత్నిస్తానని కూడా ఆయన సూచనప్రాయంగా తెలిపారు.

పార్లమెంట్‌ను వీడడం చాలా బాధగా వుందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ నుండి బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ప్రివిలైజెస్ కమిటీ నుండి తనకు లేఖ అందిందని, అది చూసి తాను చాలా విస్మయానికి గురయ్యానని చెప్పారు. దర్యాప్తు చేసిన కమిటీని కంగారూ కోర్టుగా ఆయన అభివర్ణించారు.

"వాస్తవాలతో నిమిత్తం లేకుండా నన్ను దోషిగా నిలబెట్టాలన్నది వారి ఆలోచనగా వుంది." అని జాన్సన్ పేర్కొన్నారు. సబర్బన్ లండన్ సీటు నుంచి గెలిచిన జాన్సన్ ఇప్పుడు రాజీనామా చేయడంతో ఆయన ఎన్నిక నిర్వహించగలరన్న ఊహాగానాలు మొదలయ్యాయి.

ఉక్రెయిన్‌కు 210కోట్ల డాలర్ల భద్రతా సాయం

ప్రకటించిన పెంటగన్

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌కు భద్రతాపరమైన సాయంగా 210కోట్ల డాలర్లు అదనంగా అందచేయనున్నట్లు అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది. కాగా, రష్యాపై సుదీర్ఘ స్థాయిలో పోరును కొనసాగించాలని ఉక్రెయిన్ భావిస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి.

ఈ నేపథ్యంలో అమెరికా ప్రకటన వెలువడడం గమనార్హం. ఈ సాయంలో పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలకు అదనపు ఆయుధాలు, హక్ వైమానిక రక్షణ వ్యవస్థలు, క్షిపణులు, 105ఎంఎం, 203ఎంఎం ఆర్టిలరీ రౌండ్లు, లేజర్ గైడెడ్ రాకెట్ వ్యవస్థలు తదితర ఆయుధాలు కూడా వున్నాయని రక్షణ విభాగం తెలిపింది. అమెరికా వద్ద వున్న నిల్వల నుండి ఆయుధాలు తీసి పంపించడం కాకుండా ఆయుధ వ్యాపారుల నుండి ఆయుధాలు కొనుగోలు చేసేందుకు బైడెన్ ప్రభుత్వాన్ని అనుమతించారు.

ఆయుధ వ్యవస్థల లభ్యత, వాటి ఉత్పత్తిని బట్టి వీటిని ఎప్పుడు అందచేసేది ఆధారపడి వుంటుంది. రష్యాతో సుదీర్ఘ పోరాటానికి ఉక్రెయిన్ సిద్ధపడినట్లు కనిపించగానే అమెరికా ఈ ప్రకటన చేసింది. ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనీషియేటివ్ (యుఎస్ఎఐ) కింద పెంటగన్ ఇప్పటివరకు ఉక్రెయిన్‌కు 700కోట్ల డాలర్లకు పైగా సాయాన్ని అందించింది.

ఐదు విడతలుగా ఈ సాయం అందింది. ఈ నెల 8న బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్‌తో జరిగిన సమావేశంలో బైడెన్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌కు అవసరమైనంత కాలమూ అవసరమైన సాయాన్ని అందచేయగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

370 ఆర్టికల్ రద్దు చేసినప్పుడు ..కేజ్రీవాల్ ఎక్కడున్నారు?

ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : 370 ఆర్టికల్ రద్దు చేసినప్పుడు అరవింద్ కేజ్రీవాల్ ఎక్కడున్నారని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. '370 ఆర్టికల్ రద్దు చేసినప్పుడు కేజ్రీవాల్ ఎక్కడున్నారు? అప్పుడు ఆయన కేంద్రానికి మద్దతిచ్చారు. ఈరోజు ఆయన ఇతర పార్టీలను మద్దతు ఇమ్మని అడుగుతున్నారు" అని రాజౌరిలో మీడియాతో మాట్లాడుతూ ఒమర్ అబ్దుల్లా ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన ఢిల్లీ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా కేజ్రీవాల్ ప్రతిపక్ష పార్టీల మద్దతు కూడగడుతున్న నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఈ ప్రశ్న వేశారు. ఢిల్లీలో గ్రూప్-ఎ అధికారుల నియామకాలు, బదిలీలపై అధికారం తమకు వర్తించేలా కేంద్ర ప్రభుత్వం మే 19న ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది.

ఢిల్లీ ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదలీల అధికారాన్ని కట్టబెడుతూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చిన వారం రోజుల్లోనే కేంద్రం ఈ ఆర్డినెన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. కేంద్రం చర్యను తప్పుబట్టిన కేజ్రీవాల్ ఇందుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీల మద్దతును కూడగడుతున్నారు. కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ బిల్లు కాకుండా పార్లమెంటులో అడ్డుకోవాలని కోరుతూ ఉద్ధవ్ థాకరే, శరద్ పవార్, అఖిలేష్ యాదవ్, హేమంత్ సోరెన్, ఎంకే స్టాలిన్, సీతారాం ఏచూరి, కెసిఆర్, నితీష్ కుమార్‌లను కేజ్రీవాల్ కలుసుకున్నారు.

డిగ్రీ పరీక్షలు పూర్తయ్యేవరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ వాయిదా వేయాలి

- ప్రభుత్వానికి కానిస్టేబుల్ క్వాలిఫై అభ్యర్థులు వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ పరీక్షలు పూర్తయ్యేవరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ వాయిదా వేయాలని కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానిస్టేబుల్ పోస్టులకు అర్హత సాధించినవారిలో ఎక్కువ మంది డిగ్రీ చదువుతున్న వారు ఉన్నారనీ, ఈనెల 13 నుంచి డిగ్రీ పరీక్షలు ఉన్నందున 14నుంచి 26వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు తమకు ఇబ్బందిగా ఉంటుందని, వినతిని పరిశీలించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

పరీక్షల తర్వాతే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించాలి : డివైఎఫ్ఐ

డిగ్రీ పరీక్షల తర్వాతే కానిస్టేబుల్ సెలెక్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించాలని డివైఎఫ్ఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

డిజిటల్ చెల్లింపుల్లో భారత్ టాప్

- ప్రపంచంలోనే అగ్ర స్థానం
- రెండో స్థానంలో బ్రెజిల్



న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రశ్రేణీ దేశంగా ఉంది. 2022లో 8.95 కోట్ల లావాదేవీలను నమోదు చేసిందని మైగవ్‌ఇండియా తన గణంకాల్లో వెల్లడించింది. దీంతో డిజిటల్ చెల్లింపుల జాబితాలో భారత్ టాప్‌లో ఉంది. భారత్ తర్వాత బ్రెజిల్ 2.92 కోట్లతో రెండో స్థానంలో, చైనా 1.76 కోట్ల లావాదేవీలతో మూడో స్థానంలో ఉండగా.. థాయిలాండ్ 1.65 కోట్లతో నాలుగో స్థానంలో, ఐదో స్థానంలో సౌత్ కోరియా 80 లక్షల లావాదేవీలను నమోదు చేసిందని మైగవ్ ఇండియా వెల్లడించింది. "డిజిటల్ చెల్లింపుల విభాగంలో భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. వినూత్న పరిష్కారాలు, విస్తృతమైన స్వీకరణ తో, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు దారి చూపుతున్నాము. " మైగవ్ ఇండియా పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉందని, దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపాంతరం చెందుతుందని ఇటీవల ప్రధాని మోడి పదే పదే చెబుతున్నారు. కానీ.. ప్రపంచంలోనే అతిఎక్కువ జనాభా కలిగిన భారత ప్రజల నిష్పత్తితో పోల్చితే.. చిన్న దేశాలు అంతకంటే మెరుగ్గా ఉండటం గమనార్హం. ఉదాహరణకు బ్రెజిల్ జనాభా 21 కోట్లు ఉంటే.. దాదాపు మూడు కోట్ల లావాదేవీలు జరిగాయి. అదే 140 కోట్ల జనాభా కలిగిన భారత్‌లో 8 కోట్ల లావాదేవీలు నమోద య్యాయి. ఈ రెండింటిని పోల్చి చూస్తే భారత్ ఇంకా వెనుకబడే ఉందని స్పష్టం అవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

286 ఉత్పత్తులపై శ్రీలంక నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: శ్రీలంక ప్రభుత్వం దాదాపు 300 ఉత్పత్తుల దిగుమతులపై ఉన్న నేషేధాన్ని ఎత్తివేసింది. గతేడాది ఆ దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం చోటు చేసుకుంది. విదేశీ మారకం నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. 2022 ఏప్రిల్‌లో విదేశీ చెల్లింపుల్లో విఫలమయ్యింది. దీంతో దిగుమ తులపై ఆంక్షలను విధించింది. తాజాగా 286 ఉత్పత్తులపై దిగుమతి ఆంక్షలను రద్దు చేస్తున్నట్లు ఆ దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటన చేసింది. క్రితం మార్చిలో అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ 3 బిలియన్ డాలర్ల బెయిలవుట్‌ను ప్రకటించింది. దీంతో ఆ దేశ పరిస్థితి కొంత మెరుగైంది. మరో 928 ఉత్పత్తులపై దిగుమతి నిషేధం కొనసాగుతుంది. ఇందులో వాహనాలు కూడా ఉన్నాయి.

విదేశాల్లో లావాదేవీలకు ఒకే రకం నిబంధనలు

- మనీ ఎక్స్ఛేంజీ పరిశ్రమ డిమాండ్

హైదరాబాద్: భారతీయులు విదేశాల్లో చేసే లావాదేవీలకు ఒకే స్థాయి అవకాశాలు, నిబంధ నలు ఉండాలని మనీ ఎక్స్ఛేంజీ పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరింది. ఉపయోగించిన మార్గంతో సంబంధం లేకుండా రూ. 7 లక్షల వరకు చేసే లావాదేవీలకు ఒకే రకమైన అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ ఆథరైజ్డ్ మనీ ఛేంజర్స్ అండ్ మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్స్ జనరల్ సెక్రటరీ భాస్కర రావు పి కోరారు. విదేశీ నగదు మార్పిడిలో డెబిట్, క్రెడిట్ కార్డ్‌లతో సమానత్వాన్ని కోరుతున్నా మన్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ గత నెలలో రూపొందించిన నిబంధనల ప్రకారం డెబిట్, క్రెడిట్ కార్డ్‌లను ఉపయో గించి విదేశాలలో నిర్వహించే లావాదేవీలకు టిసిఎస్ నుండి ఒక ఆర్థిక సంవత్సరానికి అతి తక్కువ మొత్తం రూ.7 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. అయితే.. విదేశీ కరెన్సీ నగదు, బ్యాంకుల ద్వారా వైర్ బదిలీలు, ప్రీ-పెయిడ్ ఫారెక్స్ కార్డ్‌లు ఇతర అంతర్జాతీయ చెల్లింపు అవకాశాలతో కూడిన చిన్న విలువ లావాదేవీలకు సంబంధించి మరీ ముఖ్యముగా విరామం లేదా ఉపాధి కోసం విదేశీ పర్యటనల సమయంలో వ్యక్తులు విస్తృతంగా ఉపయోగించే మొత్తానికి సంబంధించిన నిర్దిష్ట వివరణ ఇవ్వక పోవడంతో పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనికి సంబం ధించి ఆర్థిక మంత్రిత్వ శాఖకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. విదేశాల్లో క్రెడిట్ కార్డు లావాదేవీలను నిర్వహించినప్పుడు వర్తించే టిసిఎస్ నిబంధనలపై త్వరలోనే పూర్తి స్పష్టత ఇవ్వనున్నట్లు ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి రామన్ చోప్రా తెలిపారు. జులై 1 నుంచి విదేశాల్లో క్రెడిట్ కార్డు లావాదేవీలు చేసినప్పుడు 20 శాతం టిసిఎస్ విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై విమర్శలు రావడంతో రూ.7 లక్షల వరకూ మినహాయింపును ఇచ్చింది. అయినప్పటికీ అనేక అనుమానాలున్న నేపథ్యంలో మరింత స్పష్టత ఇస్తామని ఆర్థిక శాఖ పేర్కొంది.

డబ్ల్యుఇఎక్స్‌ఎల్ వ్యాపారం పునర్నిర్మాణం

- స్టాంపీడ్ కాపిటల్ ఆమోదం

న్యూఢిల్లీ: డబ్ల్యుఇఎక్స్ఎల్ ఎడ్యు ప్రయి వేటు లిమిటెడ్ వ్యాపారాన్ని పునర్నిర్మించడానికి, విలీనం, కొనుగోలు చేయడానికి స్టాంపీడ్ క్యాపిటల్ లిమిటెడ్ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఇందుకోసం డబ్ల్యుఇఎక్స్ఎల్ ఈక్విటీ విలువను నిర్ణయించడానికి పిడబ్ల్యుసిసి బిజినెస్ కన్సల్టింగ్ సర్వీసెస్‌ను నియమించుకున్నట్లు స్టాంపీడ్ కాపిటల్ వెల్లడించింది. డబ్ల్యుఇఎక్స్ఎల్ ఈక్విటీ విలువ రూ.91 కోట్ల నుంచి రూ.101 కోట్ల వర కు ఉంటుందని పిడబ్ల్యుసి తన నివేదికలో అంచనా వేసిందని పేర్కొ ంది. ఒక్కొక్క షేర్ రూ.1 విలువ కలిగిన 10.60 లక్షల ఈక్విటీ షేర్ల కేటాయింపును పూర్తి చేసి, రూ.1.48 కోట్ల విలువైన అంటే.. ఒక్కో షేరుకు రూ.14 చొప్పున డిఫరెన్షియల్ ఓటింగ్ హక్కులను కంపెనీ కల్పించినట్లు తెలిపింది.

మనం కలుసుకుంటే బాగుండు

మా గాలి చేష్టలని
జాడిచ్చి దులిపిన ఈత బరిగెలు
పుస్తకాలని పట్టేలా చేసిన గది గాంఢ్రింపులు
తిరిగి అస్తే బాగుండు
ఆ మదురాన్ని మరిచి పొకుంటే మంచిగుండు

నల్లబోర్డు మీద సార్లు నేర్పిన
అక్షరాలతో కలిపి దిద్దుకున్న జ్ఞాపకాలని
పంతోమ్మిది ఏండ్లలో

అనుభవించిన ఎత్తు పల్లాలని
వాట్సాప్ గోడల మధ్య కూసుండి
ఒకరికొకరం షేర్ చేసుకుంటే బాగుండు

మూలకాలను ముప్పావు గంటలో ముల్లెగట్టి
మైండ్ లా పెట్టుకున్నట్టే
ఇన్ని ఏండ్ల తర్వాత దొరికిన స్నేహాలని
గుండె గుప్పెట్లో బంధించి
ఆయువంచుల దాకా కొనసాగిస్తే మంచిగుండు

ఎక్కడెక్కడో ఉన్న మనం
అప్పుడప్పుడన్న బారిష్టర్ పార్వతీశం
పంచిన నవ్వుల్ని
ఫోన్ కాల్స్‌లో తల్సుకుని పువ్వులమై
విచ్చుకుంటే బాగుండు

ఇప్పటికైన అడ్డు గోడలై నిల్సున్న ఇగోలని
షేక్ హ్యాండ్స్ తో కూలగొట్టి
ముల్లై గీరుకున్న మాటల మనస్పర్ధలని
మునుపటి పసితనపు జల్లులతో
చెరిపెస్తే బాగుండు



నోటు బుక్కులు అదిలిబదిలి చేసుకుని
ఒక్కొల్లదంట్లకెల్లి ఇంకోల్ల అండ్లకు
అక్షరాల సోల్పులు సల్లుకున్నట్లే
ఎనుకబడ్డ నేస్తానికి చేయ్యందించి
మనండ్ల కలుపుకుని
ముందుకు నడిపిస్తే మంచిగుండు

నైట్ క్లాస్‌లో బెంచిల కింద
దాసిన నిద్ర మబ్బులు
ఒల్లర్లను తిప్పితే ఎగరిపొయిన
వెన్నెల బల్బులు
ఎడ దాగి ఉన్నాయో
ఐదు ఏండ్ల కొసరన్న కలిసి
ఏతుక్కుంటే మంచిగుండు

ఆత్మీయ సమ్మేళనంలోనే గాక
ఏడగలిసిన నాలుగు తియ్యని మాటలతో
స్కూల్ రోజుల్ని తల్సుకుంటే మాస్తుగుండు.

- జి.యం.నాగేష్ యాదవ్
9494893625



చిన్నప్పటి నుండే నాకు యాక్టింగ్ అంటే చాలా ఇంట్రెస్ట్. నా ఇంట్రెస్ట్‌ను అమ్మానాన్నా కూడా ఎప్పుడూ అడ్డుచెప్పలేదు. వారి ప్రోత్సాహంతోనే చదువుతో పాటు, యాక్టింగ్‌పై కూడా ఇష్టం పెరుగుతూ వచ్చింది. అది గమనించిన నాన్న నా ఇంజనీరింగ్ పూర్తి కాగానే గచ్చిబౌలిలోని 'దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో జాయిన్ చేశారు. అక్కడ కోర్సు పూర్తి చేసి, ఇంకా కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఆసక్తితో అమెరికా వెళ్లాను. అక్కడ కూడా ప్రఖ్యాత నటుడు, డైరెక్టర్ 'లీ స్ట్రాస్ బెర్గ్' నడుపుతున్న 'ది లీ స్ట్రాస్ బెర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్' లో కోర్స్ పూర్తి చేశాను. అక్కడే ప్రముఖ నటులు, రచయితలతో కలిసి 'ది చెకోవియన్స్' అనే థియేటర్ సంస్థను ప్రారంభించాను. దీనితో పాటు నా సృజనాత్మకతను వెలికి తీసే ఏ చిన్న అవకాశాన్నీ నేను వదులుకోలేదు. ఎక్కడ హైదరాబాద్.. ఎక్కడ అమెరికా... ఇక్కడకు వచ్చి ఒక సినిమా తీయడం, దానికి 4 అంతర్జాతీయ అవార్డులు రావడం నాకు గొప్ప ప్రేరణ. నా ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.



- జి.రోహిత్

11 హైదరాబాద్
నవతెలంగాణ
ఆదివారం
11 జూన్ 2023
www.navatelangana.com
జోష్
YOUTH N YOUTH

హైదరాబాదీకి నటనలో అంతర్జాతీయ అవార్డు

హైదరాబాదుకు చెందిన యువ నటుడు జి.రోహిత్ నటన, దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాడు. రోహిత్ కి చిన్నప్పటి నుండీ నటనపై ఆసక్తి ఎక్కువ. అదే ఆయనను 2021లో ప్రగతినగర్, హైదరాబాద్ నుండి న్యూయార్క్‌కు నడిపించింది. హైదరాబాద్, గచ్చిబౌలి లోని "దాదాసాహేబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్" (Dadasaheb Phalke School of Film Studies) నుండి నటనలో పట్టభద్రుడైన జి.రోహిత్‌పై ప్రఖ్యాత అమెరికన్ డైరక్టర్, నటుడు, నటనా ఉపాధ్యాయుడు లీ స్ట్రాస్ బెర్గ్ (Lee Strasberg) ప్రభావం ఎక్కువ. అదే, అమెరికాలోని "ది లీ స్ట్రాస్ బెర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్" (The Lee Strasberg Theatre and Film Institute) లో చేరి, యాక్టింగ్ కోర్సులు పూర్తి చేసేందుకు కారణమయ్యింది.

అతనిలోని కళా ప్రతిభ అమెరికాలో వివిధ కళా వేదికలపై నటన, దర్శకత్వం రూపంలో వ్యక్తమవుతోంది. రోహిత్ ఇన్స్టిట్యూట్‌లో ఉండగానే ఎమెలీ డి పైవా (Emely de Paiva), ఎర్మెటె డి బోని (Ermete de Boni)తో కలిసి "ది చెకోవియన్స్" (The Chekhovians) అనే ప్రఖ్యాత థియేటర్ సంస్థను నెలకొల్పారు. తమకంటూ సముచిత స్థానాన్ని ఏర్పరచుకున్న ఈ డైనమిక్ త్రయం "ది చెకోవియన్స్" (The Chekhovians) వేదికపై, వేదిక వెనుక దర్శకత్వంలో తమ అత్యుత్తమ నైపుణ్యంతో ప్రదర్శన లిస్తున్నారు. అంటోన్ చెకోవ్ (Anton Chekhov) "యాన్ ఆఫ్టర్నూన్ విత్ యాంటోన్" (An Afternoon with Anton) మొదటిసారి నిర్మించిన "ది యానివర్సరీ" (The Anniversary), "ఎ స్వాన్ సాంగ్" (A Swan Song) లను న్యూయార్క్‌లోని "ది ప్లేయర్స్ థియేటర్" (The Player's Theatre) అనే రెండు చిన్న నాటకాలు ప్రదర్శించి ప్రేక్షకుల నుండి అద్భుతమైన ప్రశంసలను అందుకొన్నారు. మొదటి విజయంతో అవధులు దాటిన ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఈ బృందం యూరప్ కు వెళ్ళింది. ఇటలీలో కూడా ఈ త్రయం అదే ప్రదర్శనతో ప్రేక్షకుల మన్ననలు పొందింది. "ది చెకోవియన్స్" (The Chekhovian's), చెకోవ్(Chekhov) రచనలను

కొత్తదనంతో, తాజాగా, ఉల్లాసంగా, సరదాగా ప్రదర్శించి, నాటకాల హాస్య అంశాలను రక్తి కట్టించారు. వారి నాటకీయ చతురత, హావభావాలు హాస్యాన్ని పండిచాయి.

వరుస విజయాలు సాధించిన చెకోవియన్లు ప్రస్తుతం తమ తదుపరి నిర్మాణంలో, క్లాసిక్ నాటకాన్ని పునః రూపకల్పన చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. చెకోవియన్స్ ఆగస్టులో విడుదల చేయనున్న "ది చెర్రీ ఆర్చర్డ్" (The Cherry Orchard) ప్రత్యేకమైన విధానంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనుంది.

నాటక రచయిత దర్శకుడు ఫ్రాంక్.ఇ. రాబిన్సన్ (Frank E.Robinson) రూపొందించిన "వై?" (Y?)లో ప్రధాన పాత్ర పోషించిన రోహిత్ అందరి దృష్టిని ఆకర్షించడం అతనిలోని ప్రతిభకు నిదర్శనం. ఈ ఆకర్షణీయమైన నాటకం గణనీయమైన సంచలనాన్ని సృష్టి స్తోంది. భవిష్యత్తులో మంచి విజయాన్ని స్తుందని విమర్శకులు అంటున్నారు.

సినిమాపై తన అభిరుచిని కొనసాగిస్తూనే, రోహిత్ గత కొన్ని నెలలుగా వివిధ ప్రాజెక్టులలో చురుకుగా పాల్గొంటున్నాడు. అటువంటి ప్రయత్నాలలో ఒకటి "ది మౌంటైన్స్ వుయ్ లెఫ్ట్ బిహైండ్" (The Mountains We Left Behind)., ఇది ఒక సుందరమైన పర్వత గ్రామం నేపథ్యంలో సాగే చిత్రమైన చిత్రం. కథానాయకుడు తన దినచర్యలోని మార్పుల నుండి విముక్తి పొందాలనే కోరికతో బాధపడుతుంటాడు, పర్వతాలు దాటి తన కోసం ఒక గొప్ప ప్రపంచం వేచి ఉందని నమ్ముతాడు. కథ సాగుతున్నప్పుడు, ఆకర్షణీయమైన ప్రకృతి దృశ్యాలను, కథానాయకుడి అంతర్గత పోరాటాలను జత చేసారు. మనం ఎక్కడికి వెళ్లినా మన నిజస్వరూపాన్ని ఎంతవరకు తీసుకువెళతామో అనే ఆలోచనను రేకెత్తించే ప్రశ్నలను లేవనెత్తుతుంది ఈ చిత్రం.



మరొక థ్రిల్లింగ్ వెంచర్, "ఇన్ ది స్టిల్ ఆఫ్ ది నైట్" (In the Still of the Night) లో రోహిత్ ఫోటోగ్రఫీ డైరెక్టర్‌గా పనిచేశాడు. అతని సృజనాత్మక భాగస్వామి ఎమెలీ డి పైవా (Emely de Paiva) రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రం న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక గోథమైట్ మంత్లీ ఫిల్మ్ అవార్డ్స్ (Gothamite Monthly Film Awards)లో ప్రశంసను పొందింది. దాని కథనం ఆకర్షణీయమైన దృశ్యాలతో హృదయాలను గెలుచుకుంది.

రచయితగా, దర్శకుడిగా, నటుడుగా పాత్రలను పోషిస్తున్న రోహిత్ స్వీయ దర్శకత్వంలో "వన్ లాస్ట్ సన్‌రైజ్" (One Last Sunrise)లో తెరపైకి రానేవచ్చాడు. దీనిలో రేపిస్ట్‌ను ఎదుర్కోవడానికి ఒక మిషన్‌ను ప్రారంభించిన హెడ్‌హంటర్ చుట్టూ కథ తిరుగుతుంది. అతను తనను వేధించే వాడిని ఎదుర్కొన్నప్పుడు, ఒక శత్రువు సన్నివేశంలోకి ప్రవేశించడంతో ఊహించని మలుపు తిరుగుతుంది. "వన్ లాస్ట్ సన్‌రైజ్" (One



Last Sunrise) అనేక అవార్డులను పొందింది. ఫెస్టివల్ సర్క్యూట్ (festival circuit)లో విజయకేతనాలను ఎగురవేస్తూనే ఉంది. దానిలో భాగమే "ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్" (Indo French International Film Festival) లో ఉత్తమ మౌన లఘు చిత్రాల (Best Silent Short Film) విభాగంలో విజేతగా నిలవడం.

ప్రగతినగర్ హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్రొగ్రెస్ ట్రస్ట్ (Peoples Progress Trust) హాస్టల్‌లో ఉండి ప్రాథమికోన్నత విద్యను అభ్యసించి బి.ఏ. డిగ్రీ పట్టా, నటనలో పట్టా పొంది., విదేశాల్లో విజయకేతనం ఎగురవేస్తున్న గుట్టమీది రోహిత్ ఇప్పుడు ఎంతో మందికి స్ఫూర్తి. రోహిత్ ఇక్కడ నేర్చుకున్న పాఠాలు, సాధించిన విజయాలకు పునాదులుగా నిలిచాయి. అందుకే హైదరాబాద్ నుండి న్యూయార్క్ నగరానికి పయనమైన రోహిత్ .గుట్టమీది, థియేటర్, చలనచిత్ర ప్రపంచాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోవడానికి, భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నాడు. అతని అపారమైన ప్రతిభ, అచంచలమైన అంకితభావం, అతని సృజనాత్మకత సహ కళాకారుల మద్దతుతో మున్ముందుకు దూసుకు పోవడం తథ్యం. రోహిత్ తన నటనాప్రపంచంలో కీర్తి శిఖరాలను అధిరోహించాలని. అతని మిత్రులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

- ఎం.కె.

మా అబ్బాయి రోహిత్ అంతర్జాతీయ స్థాయిలో నటన, దర్శకత్వంలో ప్రతిభ కనబరిచి ప్రపంచస్థాయి అవార్డ్స్ అందుకోవడం తల్లిదండ్రులుగా మేమెంతో గర్వ పడుతున్నాం. మా రోహిత్ నటనలో మరింత ఎత్తుకు ఎదగాలని, మంచి సందేశాత్మక చిత్రాలు, నాటకాలు ప్రదర్శించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. రోహిత్‌కు నటనపై ఉన్న అభిమానం న్యూయార్క్‌కి నడిపించింది. చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పించిన ప్రగతి విద్యాలయం, దాదా సాహెబ్ ఫాల్కే ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్ వారికి ధన్యవాదాలు.

- రాజామణి, విఠల్



మళ్ళీరావా..!!

ప్రియమైన
నా బంగారానికి,
ఓయ్ ఎట్లున్నవ్.. ?


నువ్వు మంచిగానే ఉన్నావ్ అని అనుకుంటున్నా, మన మీద ఏ కన్ను పడ్డదో గానీ నా కంటిపాపైన నువ్వు నాకు దూరమైనవ్.

మన మధ్య అడ్డు గోడలొచ్చి ఐదేండ్లు ఐతుంది. చివరిగా నిన్ను చూసిన ఆ క్షణం.. ఇంకా నన్ను వెంటాడుతూనే ఉంది. మనం కలిసున్న రోజులు ఇంకా నా కండ్ల ముందే కదులుతున్నై. నీ తీపి మాటలు ఇంకా వినబడుతూనే ఉన్నయ్.

నీ నుంచి ఎంత దూరం పరిగెత్తినా, నా మనసుల్నే ఉన్న నీ జ్ఞాపకాలు నిన్ను ఏడ మరువనిస్తై. మొదటి సారి నిన్ను చూసినప్పుడే అనిపించింది.. నువ్వు నా కోసమే పుట్టావని. ఆ రోజే అనుకున్నాను నువ్వు నాకే సొంతం అని.

నీతో ఒక కుటుంబాన్ని ఊహించుకున్నాను.. కానీ నా కలలు అన్ని ఇలా కళ్ళ జారుతాయి అనుకోలేదు.

బోనాల పండుగకి చీరలో నా కండ్ల ముందు నుంచి వెళ్తున్న పుడు చిరునవ్వుని నీపై విసిరుతుంటే ఏడ అందరికి మన గురించి ఎరుకైతదోనని ఎంత బయపడ్డవ్. కండ్లతోనే వద్దంటూ సైగ చేస్తూ.. నీ కండ్లు అలా తిప్పుతుంటే ఒక్కసారే కాలం ఆగినట్టు అనిపించింది. నీ చేతి గాజుల గలగలలో, కాళ్ళ పట్టీల సవ్వడితో నా గుండె చప్పుడు కూడా రాగం కలిపింది. నువ్వు వెళ్తుంటే నీ చీరకొంగు నాకు



ముడేసినట్టు.. నీ అడుగుల్లో అడుగేస్తూ వెంట నడిచాను యాదికుందా..??

నీ మీద రాసిన మొదటి కవిత గుర్తుందా!!

"ఓ నా బంగారు కొండ
నువ్వే నా గుండె నిండా
వేస్త నీ మెడలో పూల దండ"

అది విని రోజు అంతా నవ్వుతూనే ఉన్నావ్.

చిన్న
చిన్న వాటికే అలిగే దానివి. మళ్ళీ మాటల్లో నెయ్యి కలిపి గోరుముద్దలుగా నోటికి అందిస్తే గానీ అన్నం తినకుండా మారాం చేసేదానివి. ఇప్పుడు ఎవర్ని అలా గారాబం చెయ్యాలి ? పొద్దున్నే మొదటి మెసేజ్ - రాత్రికి చివరి మెసేజ్ నీకే పంపెటోడ్ని. ఇప్పుడు ఎవర్ని పొద్దున్నే కోడికూతై నిద్ర లేపాలి. ఎవర్ని లాలిపాటై నిద్రపుచ్చాలి..??

చంటి పిల్లలాంటి నీ మనసు అమాయకమైన నీ వ్యక్తిత్వం నన్ను నీకు ఇంకా దగ్గర చేశాయి. మన బంధాన్ని దేవుడు అల్లాడు అనుకున్నాను. కానీ ఇలా మధ్యల్నే విడదీస్తాడు అనుకోలేదు. కోపం ఉంటే చెప్పేదుండె.. తప్పు చేస్తే తిట్టేదుండె.. కానీ నన్ను ఇట్లా బాధ పెటోచ్చునా.. ఐనా ఒక్క మాటైనా చెప్పకుండా నన్ను ఒదిలేసి ఎట్ల పోయినవ్..?? నా చేయి చీకట్లనే ఒదిలేసి ఎందుకు పోయినవ్..?? నువ్వు వెళ్లి పోయినంక కన్నీళ్ళతో నా మనసంతా తడిసి ముద్దైంది. నీ ఆలోచనలు నాపై మెరుపుదాడి చేసినయ్. జ్ఞాపకాలు పిడుగులై గుండెను ముక్కలు చేశాయి తెలుసా.. ఏ అమ్మాయి గొంతుల "ఓయ్" అన్న మాట ఇన్నా నువ్వేనేమోనని ఆశతో వెనక్కి తిరిగి చూస్తున్నా .. కానీ నువ్వు కాదని తెలిసి నిరాశతోనే ముందడుగేస్తున్న.. ఏందో నువ్వు ఎల్లిపోయినప్పటి నుంచి నిరాశపడడం ఈ జీవితానికి అలవాటైపోయింది.

ప్రేమలేఖలు
Voice Of Love

నన్ను రోజు తలుచుకుంటూనే ఉంటావు అనుకుంటా. అందుకే ఎప్పుడూ నా గుండె పొలమారుతూనే ఉంటుంది. నీ ప్రేమకి నేను ఎప్పుడో దొరికిన కదా మళ్ళీ ఈ దోబుచులాటలు ఎందుకు.. ?? పగలంతా నేను నిన్ను వెతుకుతున్నా.. కనిపించక పోయేసరికి రాత్రయితే చాలు.. నా నీడ నన్నొదిలి నీ జాడ కోసం వెళ్ళిపోతుంది. మొన్న ఓ పావురం గులాబీ రంగు కాళ్ళకు పూసుకొని నా దారికి అడ్డం తిరిగింది బహుశా ప్రేమ పావురం అనుకుంటా.. నువ్వు పంపిన సందేశం మోసుకొచ్చిందేమో అనుకున్న కానీ చూస్తుండగానే ఏం చెప్పకుండానే తిరిగి ఆకాశానికి ఎగిరిపోయింది.

"మళ్ళీరావా..."

నీ చిటికెన వేలు పట్టుకొని ఏడు అడుగులు నడవాలని ఉంది.. నీ మెడలో నల్ల పూసను అవ్వాలనుంది.. నీ నుదుట సింధూరం దిద్దాలని ఉంది.. నువ్వు తిరిగొచ్చే దాకా నీ కోసం తపించే నా మనసు ఎదురు చూస్తూనే ఉంటది..

ఆకాశ వీధిలో అందాల జాబిల్లి నువ్వు
జాబిల్లి కోసం ఎదురుచూసే ఆకాశం నేను.

కన్నీటి అలలతో
నీ..
ఆకాష్ మునిగాల

గమ్యం చేరని ప్రేమలేఖలు


పేరుకు రెండే అక్షరాలు
కానీ, మహా చిలిపివి ఆ అక్షరాలు
గుండెల్లో దాగి
ఊసులాడతాయి
కవ్విస్తాయి... కన్నీళ్లు పెట్టిస్తాయి
ఆనందాన్ని ఇస్తాయి... త్యాగాలకు సంసిద్ధం చేస్తాయి.
దానికి, కాలంతో కానీ...కులంతో కానీ..
ప్రపంచంతో కానీ పనిలేదు
ప్రేమ అన్న పలుకే
స్వచ్ఛమైనది... నిర్మలమైనది...
అలాంటి ప్రేమ ఇప్పుడు
పట్టాలపై రక్తపు మడుగులో
గమ్యం చేరిందా లేదా అన్నది వేల దాలర్ల ప్రశ్న.



కోరమాండల్ బోగీలో ప్రయాణించిన బెంగాలి తన ప్రేయసిని గుర్తుకు చేసుకుంటూ రాసుకున్న డైరీకి సంబంధించి పేజీలు రైలు పట్టాలపై రక్తపు మడుగులో కనిపించాయి. దీంతో అవి చూసిన వారి కండ్లల్లో నీళ్ల తిరిగాయి. ఇవి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. డైరీల్లోని పేజీల్లో ప్రేమ కావ్యాలు.. అందంగా గీసిన చిత్రాలు, పుష్పాలు, సూర్యుడు ఇలా చాలా బొమ్మలు కనిపించాయి. అందులో 'చిన్ని చిన్ని మేఘాలు చిరుజల్లులను కురిపించగా.. మనం వినే చిన్ని చిన్ని కథల్లోంచే ప్రేమ సుకుమాలు విరబూస్తాయి' అని బెంగాలీలో రాసి ఉంది. 'అన్ని వేళలా నీ ప్రేమ నాకు కావాలి.. నువ్వు నా మదిలో ఎప్పుడూ ఉంటావు'. అని రాసిఉన్న కాగితాలు ఇద్దరు ప్రేమికులను గుర్తుకు చేసుకుంటూ కన్నీరు పెడుతున్నాయి అన్నట్లుగా ఉన్నాయి. అయితే ఈ డైరీ ఎవరిది..? ఆ వ్యక్తి మరణించాడా..? బతికే ఉన్నాడా..? అని తెలియలేదు.

సైరికుడు

పెనుగాలిని సైతం ధిక్కరించే
ఆ గడ్డి పరక నడుగు చెబుతుంది
ఆ బక్క చిక్కిన దేహంలో ఉన్న ధైర్యమెంతో ...
గలగలా నవ్వే ఆ పైరునడుగు చెబుతుంది
ఆ చేతి గాజులు చేసే
సవ్వడి లయ మధురమెంతో.......
బండెడు బరువులు లాగే
ఆ బసవన్న నడుగు చెబుతుంది
పదిమంది కడుపు నింపే



ఆ పైరు కాపు పస్తులెన్నో.....

బండ బారిన బీడు భూమిని చీల్చే
ఆ అరకనడుగు చెబుతుంది
చితికిపోయిన ఆ దేహానికి
ఉన్న గాయాలెన్నో....
నీ కంచంలో మెరిసే
ఆ తెల్లని మెతుకునడుగు చెబుతుంది
కుటుంబ భారాన్ని మోయలేక
అలసిపోయి పురుగుల మందుతో
సేదతీరే రైతుల కష్టాలెన్నో........!!!!!!

- ఎం. కురుమయ్య యాదవ్
7799553493